

సంగీత మేరు శిఖరాలు
రూ॥ 120/-
పేజీలు: 138
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM సిటీ

సంపుటి 28, సంచిక: 344 | సోమవారం | 08-06-2026 | హైదరాబాద్ Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar | పేజీలు: 12 | వెల రూ. 5.00


### ఇరాన్‌ను సర్వనాశనం చేస్తా : ట్రంప్

యుద్ధ పరిష్కారానికి జరుగుతున్న చర్చలు విఫలమైతే ఇరాన్‌ను సర్వనాశనం చేస్తానని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ హెచ్చరించారు. ఇరాన్ ఆస్తులను విడుదల చేసే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. అదేసమయంలో హోర్ముజ్ జలసంధిలో అంతర్జాతీయ రవాణాకు ఆటంకంగా ఉన్న రెండు ఇరాన్ డ్రోన్లను సెంట్‌కామ్ కూల్చివేసింది. ఇరాన్ దురాక్రమణకు వ్యతిరేకంగా నౌకలకు రక్షణ ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని అమెరికా సైన్యం ప్రకటించింది. ''మేం ఒప్పందానికి దగ్గరలో ఉన్నాం, కానీ చర్చలు విఫలమైతే ఇరాన్‌ను సర్వనాశనం చేస్తాం'' అని ట్రంప్ చెప్పారు.



## 15 నుంచి స్కూల్స్

- రెండు రోజులు వేసవి సెలవులు పొడిగించిన ప్రభుత్వం
- 13న రెండో శనివారం, 14న ఆదివారం కావడంతో పాఠశాలల పునఃప్రారంభ తేదీ మార్పు

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో పాఠశాలల వేసవిసెలవులను రాష్ట్ర ప్రభుత్వం పొడిగించింది. ఈ నెల 15న పాఠశాలలను పునః ప్రారంభించనున్నట్టు ప్రకటించింది. ఈ మేరకు రాష్ట్ర విద్యాశాఖ సంచాలకులు నవీన్‌నికోలస్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. వేసవి సెలవుల అనంతరం '202627 విద్యా సంవత్సర' క్యాలెండర్ ప్రకారం రాష్ట్రంలోని అన్ని పాఠశాలలు ఈనెల (జూన్) 12వ తేదీ నుంచి ప్రారంభం కావాల్సి ఉంది. అయితే పాఠశాలల ప్రారంభ తేదీని పునఃపరిశీలించాలని వివిధ వర్గాల నుంచి ప్రభుత్వానికి విజ్ఞప్తులు అందాయి. అలాగే ఈ నెల 13,14వ తేదీలు వరుసగా రెండో శనివారం, ఆదివారం కావడంతో విద్యార్థుల సౌకర్యార్థం ప్రభుత్వం పాఠశాల పునః ప్రారంభ తేదీని 15వ తేదీకి పొడిగించింది. ఈనెల 13వ తేదీ రెండవ శనివారం సెలవుకు బదులుగా జులై 11న తరగతులు నిర్వహించాలని ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది.

## మెట్రో రైల్ విస్తరణకు కిషన్‌రెడ్డే అడ్డుకట్ట





- హైదరాబాద్‌లో 122 కిలోమీటర్ల మేర మెట్రో పొడిగించాలని మోదీని కోరితే కేంద్రమంత్రి అడ్డుకున్నారు
- మెట్రోరైల్ విస్తరణ లేకపోవడంతో హైదరాబాద్ స్థానం 9కి పడిపోయింది అభివృద్ధికి సహకరించకుంటే నిలదీస్తాం
- బిజెపి పాలిత రాష్ట్రాల్లో నదులను ప్రక్షాళన చేసిన కేంద్రం తెలంగాణలో మూసీ పునరుజ్జీవనాన్ని అడ్డుకుంటోంది
- మూసీ ప్రక్షాళనకు రాష్ట్రంలో ప్రతిపక్షాలు సైతం అడ్డుపడుతున్నాయ్
- రానున్న వంద రోజుల్లో నాగోల్ నుంచి గౌరెల్లి వరకు మూసీ ప్రక్షాళనను పూర్తిచేస్తాం
- కేంద్ర ప్రభుత్వం రైతుల నుంచి ధాన్యం తీసుకునేలా చేయకపోతే కిషన్‌రెడ్డిని ప్రశ్నిస్తాం
- మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ శాశ్వత భవన నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉద్ఘాటన

ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి

ప్రజాభివృద్ధి పనుల్లో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వంతో సహకరించక పోతే నిలదీయక తప్పదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హెచ్చరించారు. హైదరాబాద్ మహానగరంలో 122 కిలో మీటర్ల మేర మెట్రోను పొడిగించాలని తాను ప్రధాని మోదీని ఐదుసార్లు కలిసి కోరితే తెలంగాణ రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహిస్తూ కేంద్ర మంత్రిగా ఉన్న కిషన్‌రెడ్డి మెట్రో ప్రతిపాదనలను అడ్డుకున్నారని విమర్శించారు. మెట్రో విస్తరణ లేక పోవటం వల్లే దేశంలో హైదరాబాద్ మెట్రో స్థానం 9కి పడి పోయిందన్నారు. మెట్రో విస్తరణ, రీజనల్ రింగ్ రోడ్డు నిర్మాణాలపై సమాధానం చెప్పాల్సిన బాధ్యత కిషన్‌రెడ్డికి లేదా అని ప్రశ్నించారు. పదెకరాల స్థలంలో రూ. 98 కోట్ల వ్యయంతో ఉప్పల్ భగాయత్ ప్రాంతంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో నూతనంగా ఏర్పడిన మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ శాశ్వత భవన నిర్మాణం, ఉప్పల్‌లో వంద పడకల ఏరియా ఆస్పత్రి నిర్మాణం, ఎఒసి సెంటర్ చుట్టూ ప్రత్యామ్నాయ రోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపనలతో పాటు ఆస్తి పన్ను, విద్యుత్, నీటి బిల్లులు, ట్రాఫిక్ చలాన్‌లులాంటి అనేక ప్రభుత్వ బిల్లులను ఒకే చోట చెల్లింపులు చేసే విధంగా రూపొందించిన క్యూర్–1 మొబైల్ యాప్‌ను రేవంత్‌రెడ్డి ఆవిష్కరించారు. అనంతరం ఆయన ప్రసంగించారు. బిజెపి పాలిత రాష్ట్రాలైన గుజరాత్‌లో సబర్మతి రివర్ ఫ్రంట్, ఢిల్లీలో యమునా రివర్ ఫ్రంట్ అభివృద్ధితో పాటు యుపిలో గంగానదిని ప్రక్షాళన చేసిన కేంద్ర ప్రభుత్వం తెలంగాణలో మూసీ ప్రక్షాళనకు ఎందుకు అడ్డంకులు సృష్టిస్తోందని ఆయన మండి పడ్డారు. తనను ఎవరూ ఏమీ చేయలేరని అహకారంతో చెప్పుకుంటున్న కిషన్‌రెడ్డికి ప్రజలే బుద్ధి చెబుతారన్నారు. కేంద్ర ప్రభుత్వం రైతుల నుండి కొనుగోలు చేసిన వడ్లను తీసుకునేలా చేయకపోతే కేంద్ర మంత్రి హోదాలో ఉన్న కిషన్‌రెడ్డిని నిలదీస్తామన్నారు. ఈ నెల 15

తరువాయి 8లో

## 'బండ' భారం



- గృహ వినియోగ గ్యాస్ సిలిండర్ ధర పెంచిన కేంద్ర సర్కార్
- 14.2 కిలోల సిలిండర్‌పై రూ. 29 వడ్డింపు
- మూడు నెలల్లో మొత్తం రూ. 89 భారం
- కోలుకోలేని స్థితికి సామాన్యుడు


**న్యూఢిల్లీ:** కేంద్రంలోని బిజెపి సర్కార్ సామాన్యుడిని నడ్డిని మరోసారి విరిచేసింది. బండ భారం మోపింది. ఇప్పటికే నాలుగుసార్లు పెట్రోల్, డీజిల్ ధరలు పెంచి ప్రజలను కోలుకోలేని దెబ్బతీసిన నరేంద్ర మోదీ ప్రభుత్వం తాజాగా గృహ వినియోగ గ్యాస్ సిలిండర్ ధరను పెంచింది. ధరల పెంపుపై ప్రతిపక్షాలు పెద్ద ఎత్తున నిరసనలు వ్యక్తం చేస్తున్నా మోదీ ప్రభుత్వం ఖాతరు చేయడం లేదు. 14.2 కిలోల ఎల్‌పిజి సిలిండర్‌పై రూ. 29 వడ్డించింది. మూడ నెలల వ్యవధిలో డొమాస్టిక్ సిలిండర్ ధరలు పెరగడం ఇది మూడవసారి. మార్చి 7వ తేదీన గృహ అవసరాలకు వినియోగించి 14.2 కిలోల ఎల్‌పిజి సిలిండర్ ధరపై రూ. 60 పెంచింది. రెండు కలిపి మొత్తంగా రూ. 89 భారం వేసింది. ఆదివారం అర్ధరాత్రి నుంచే పెరిగిన ధరలు అమల్లోకి వచ్చాయి. హోటళ్లు, రెస్టారెంట్లు సహా వాణిజ్య అవసరాల కోసం వాడే కమర్షియల్ 19 కిలోల సిలిండర్ ధరలో ఎలాంటి మార్పు లేదు. అయితే ధరల పెంపును కేంద్ర ప్రభుత్వం సమర్థించుకుంది. పశ్చిమాసియాలో నెలకొన్న అంతరాయాల కారణంగా అంతర్జాతీయంగా ఎల్‌పిజి ధరలు భారీగా పెరిగినప్పటికీ, భారతీయ గృహాలు ప్రపంచంలోనే అత్యల్ప ధరలకు వంట గ్యాస్‌ను పొందుతూనే ఉన్నాయని ప్రభుత్వం ఆదివారం తెలిపింది. దేశీయ ఎల్‌పిజి సిలిండర్ ధరను రూ. 29 మేర పెంచిన తర్వాత ప్రభుత్వం ఈ ప్రకటన చేసింది. ఢిల్లీలో 14.2 కిలోల దేశీయ ఎల్‌పిజీ సిలిండర్ ధర

తరువాయి 12లో

### గ్యాస్ ధర పెంపుపై నాడు రచ్చ చేశారు... ఇప్పుడెందుకు రోడ్లపైకి రారు?

- బిజెపి నేతలను నిలదీసిన కాంగ్రెస్
- మోదీ సర్కార్‌పై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మండిపాటు

07





## ప్రధాన్ రాజీనామా చేసేంత వరకు ఆందోళన ఆపం

- క్రాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే స్పష్టీకరణ
- ఢిల్లీ జంతర్‌మంతర్ వద్ద నిర్వహించిన ఆందోళన సక్సెస్
- ఈ ఉద్యమాన్ని దేశమంతా విస్తరిస్తామని వెల్లడి

**ఛత్రపతి శివాజీనగర్ :** పరీక్షలు, నియామకాల్లో జరిగిన అక్రమాలపై తాము చేపట్టిన ఆందోళన ఆపబోమని క్రాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి) వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే స్పష్టం చేశారు. కేంద్ర విద్యాశాఖమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసేంత వరకు కొనసాగుతోందన్నారు. మహారాష్ట్రలోని ఛత్రపతి సంభాజీనగర్‌లో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద సిజెపి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన నిరసన కార్యక్రమం విజయవంతమైందని, సుమారు 7,000 మంది పాల్గొన్నారని దీప్కే పేర్కొన్నారు. ఈ ఉద్యమాన్ని ఇక దేశవ్యాప్తంగా విస్తరిస్తామని ఆయన తెలిపారు. సిజెపి అనేది యువత నేతృత్వంలోని ఒక ఆన్‌లైన్ ఉద్యమం; ఇది నీట్, సిబిఎస్ఇ, క్యూట్, ఎస్ఎస్‌సి వంటి పరీక్షలు,

తరువాయి 12లో




## కార్మిక వ్యతిరేక విధానాలను సింగరేణి మానుకోవాలి

- కార్మిక సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమాలు ఉధృతం
- ప్రభుత్వం నుంచి సంస్థకు రావలసిన రూ.56వేల కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలి
- గుర్తింపు సంఘం కేంద్ర కౌన్సిల్ సమావేశంలో సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు కూనంనేని

ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం

కార్మికుల శ్రమతో సింగరేణి సంస్థ మనుగడ సాగిస్తోందని, కానీ యాజమాన్యం సంస్థకు మూలాధారమైన కార్మికులను చిన్న చూపు చూస్తోందని, కార్మిక వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న యాజమాన్యం ఇకనైనా మానుకోవాలని, కార్మిక సమస్యలు పరిష్కరించకుంటే పోరాటాలు చేయక తప్పదని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం నియోజకవర్గ శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. కొత్తగూడెం ఆర్‌సిఒఎ క్లబ్‌లో ఆదివారం జరిగిన సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) కేంద్ర కౌన్సిల్ సమావేశం తొలి రోజు కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన ఆయన సింగరేణి సంస్థలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్మికుల హక్కులు, సంక్షేమం, ఉద్యోగ భద్రతకు విఘాతం కలిగించే విధానాలను యాజమాన్యం

తరువాయి 8లో

## ఉరుములు, మెరుపులతో వర్షాలు

గంటకు 40- 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు

పలు జిల్లాలకు వాతావరణ కేంద్రం హెచ్చరిక

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. ఇదే సమయంలో గంటకు 40 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురుస్తాయని చెప్పారు. సోమవారం రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, రంగారెడ్డి, హైదరాబాద్, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. సోమ, మంగళ, బుధవారం రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. గురువారం, శుక్రవారం వరకు కొమురంభీం

తరువాయి 12లో

## ఏకతాటిపైకి 'ఇండియా' కూటమి

నేడు ఢిల్లీలోని కాన్‌స్టిట్యూషన్ క్లబ్‌లో ఇండియా జన్‌బంధన్ పేరుతో భేటీ

23 పార్టీలు హాజరవుతున్నట్లు ధృవీకరించిన కాంగ్రెస్

ఎజెండా లేకున్నా.. చర్చించాల్సిన అంశాలున్నాయ్ : సిపిఐ




**న్యూఢిల్లీ :** ఇటీవల ఐదు రాష్ట్రాల్లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తరవాత రాజకీయాల్లో ఒక్కసారిగా మార్పులు జరిగాయి. ఈ నేపథ్యంలో ప్రతిపక్ష ఇండియా కూటమి సమావేశం సోమవారం ఢిల్లీలో జరగనుంది. కాన్‌స్టిట్యూషన్ క్లబ్‌లో జరిగే ఈ భేటీకి 'ఇండియా జన్ బంధన్' అని నామకరణం చేశారు. ఈ సమావేశానికి 23 రాజకీయ పార్టీలకు చెందిన నేతలు హాజరవుతున్నట్లు కాంగ్రెస్ తెలిపింది. భారత్ లాగే 'ఇండియా జన్ బంధన్' కూడా తన వైవిధ్యాన్ని చాటుకుంటూ ఐక్యంగా ముందుకు సాగుతుందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ స్పష్టం చేశారు. కొన్ని పార్టీలు సొంత కారణాల వల్ల ఈ ప్రత్యేక సమావేశానికి హాజరు కాలేమని తెలియజేశాయని ఎక్స్‌లో పేర్కొన్నారు. రమేష్ పోస్టును ట్యాగ్ చేస్తూ, టిఎంసి ఎంపి డెరెక్ ఓ'బ్రియన్ స్పందిస్తూ 'ఒకే లక్ష్యంతో, స్పష్టమైన ఉద్దేశ్యంతో సమావేశం జరగనుందని, ఇండియా కూటమి ఐక్యంగా ఉందని, అనేక పార్టీలు సౌభ్రాతృత్వ స్ఫూర్తితో సమావేశం కోసం ఎదురుచూస్తున్నాయన్నారు. 'లక్షలాది మంది భారతీయుల ఓటు హక్కును హరించివేస్తూ, ప్రతిరోజూ రాజ్యాంగంపై దాడి చేస్తూ, దర్యాప్తు సంస్థల ద్వారా ప్రతిపక్ష నాయకులపై దాడులు చేస్తూ, కోట్లాది మంది భారతీయుల జీవనోపాధిని తీవ్రంగా దెబ్బతీస్తూ, ఎడతెరిపి లేకుండా పెరుగుతున్న ధరలతో కుటుంబ బడ్జెట్‌లను విచ్ఛిన్నం చేస్తూ, లక్షలాది యువత ఆశలు, ఆకాంక్షలకు ద్రోహం చేస్తూ, పెట్టుబడుల వాతావరణాన్ని నీరుగారుస్తూ, తన విదేశాంగ విధానంతో జాతీయ ప్రయోజనాలను దెబ్బతీస్తున్న మోదీ ప్రభుత్వ విధానాలు, చర్యలకు తమ తీవ్ర వ్యతిరేకతను తెలియజేసినప్పటికీ, కొన్ని పార్టీలు తమ సొంత కారణాలతో ఈ ప్రత్యేక సమావేశానికి హాజరు కాలేకపోతున్నామని తెలిపినట్లు కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ వెల్లడించారు. కాగా, 2029 సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని భవిష్యత్ కార్యాచరణపై

తరువాయి 12లో

## రోడ్డెక్కనున్న కాంట్రాక్టర్లు



పెండింగ్ బిల్లుల కోసం ఈనెల 18న ధర్నా

- బిల్లులు రాక కాంట్రాక్టర్ల వెతలు
- పెండింగ్‌లో రూ.వేలకోట్ల బిల్లులు.. పెరుగుతున్న అప్పులు
- నిలిచిపోతున్న అభివృద్ధి పనులు

ప్రజాపక్ష/వనపర్తి

ఒకప్పుడు తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి అంటే భారీ రోడ్డు, వంతెనలు, చెక్‌డ్యాంలు, సాగునీటి ప్రాజెక్టులు, గ్రామీణ రహదారులు, మున్సిపల్ మౌలిక సదుపాయాలు గుర్తుకొచ్చేవి. ఆ అభివృద్ధి వెనుక వేలాది మంది కాంట్రాక్టర్ల కష్టం ఉంది. కానీ ప్రస్తుతం అదే కాంట్రాక్టర్లు బిల్లులు చెల్లించాలంటూ ధర్నాలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈనెల 18న హైదరాబాద్‌లో రాష్ట్రవ్యాప్త మహాధర్నాకు పిలుపునివ్వడం వెనుక ఉన్న అసలు కారణాలు ఏమిటి? ఈ పరిస్థితి ఎందుకు వచ్చింది? 2014 లో తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ప్రభుత్వం భారీ ఎత్తున అభివృద్ధి పనులు చేపట్టింది. కాళేశ్వరం వంటి భారీ ప్రాజెక్టులు మిషన్ భగీరథ, గ్రామీణ రహదారులు మున్సిపల్ మౌలిక వసతులు , డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ప్రభుత్వ భవనాల నిర్మాణం వంటి

తరువాయి 8లో

## పెరిగిన ధరలతో పేదలు కుదేలు

ఒకవైపు పిల్లల పుస్తకాలు, మరోవైపు విత్తనాల కొనుగోళ్లు

ఇప్పటికే పెరిగిన ఎరువులు, నిత్యావసరాల ధరలు


గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు పైపైకి

ఈనెల 10న సిపిఐ ఆందోళనలు

ప్రజాపక్షం/హనుమకొండ

పెరిగిన ధరలతో పేదలు కుదేలవుతున్నారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం భారీగా పెంచిన పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు అన్ని రంగాలపై పడి సామాన్యులపై ప్రభావం చూపుతున్నది. ఇప్పటికే వంట గ్యాస్ వెయ్యి రూపాయలు దాటగా మరోసారి కేంద్ర ప్రభుత్వం రూ. 29 పెంచింది. మరోవైపు నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని పేదలు వాపోతున్నారు. వాటికి తోడు కూరగాయల ధరలు కూడా పెరిగాయి. సామాన్య, మధ్య తరగతి ప్రజలకు పెరిగిన ధరలు ప్రస్తుతం మోయలేని భారంగా మారుతున్నాయి. కాగా ప్రస్తుతం జూన్ నెలలో పాఠశాలలు, కళాశాలలు ప్రారంభం కానున్నాయి. మరోవైపు ఖరీఫ్ వ్యవసాయ సీజన్ వచ్చేసింది. దీంతో జూన్ అంటేనే పేద, మధ్య తర గతి కుటుంబాలు హడలెత్తిపోతున్నాయి. పాఠ శాలల పునఃప్రారంభం, రైతులకు వానాకాలం సీజన్ రెండూ ఒకేసారి వస్తాయి. ఓ వైపు పిల్లల పుస్తకాలు, ఫీజులు, మరో వైపు విత్తనాలు, సాగు పనుల ఖర్చులు మీదపడుతాయి. దీనికి తోడు ఇప్పటికే పెరిగిన నిత్యావసర సరుకులు, ఇటీవల గ్యాస్ ధరలతో మరింత భారం

తరువాయి 8లో



## మిత్ర కలం, విమలక్క గళం...

# తెలంగాణ ఆత్మ – ఒక అమర గీతం

కాలం కొన్ని పాటలను పాతబరుస్తుంది. మరికొన్ని పాటలను జ్ఞాపకాల అలమారలో దాచిపెడుతుం ది. కానీ అరుదుగా కొన్ని గీతాలు కాలాన్నే అధిగమించి ఒక జాతి ఆత్మలో భాగమైపోతాయి. అవి కేవలం పదాల సమాహారం కావు. అవి ఒక భూభాగపు ఊపిరి, ఒక ప్రజల అస్తిత్వం, ఒక సమాజపు గుండెచప్పుడు. 'పాడరా పాడరా మన పాట... జన తెలంగాణమని ప్రతినోట' అనే తెలం గాణ గీతం అలాంటి అరుదైన ప్రజా గీతాల్లో ఒకటి. ఇరవై ఐదు సంవత్సరాల క్రితం పుట్టిన ఈ గీతం నేడు కూడా తెలంగాణ నేలపై అదే ఉద్వేగంతో, అదే గర్వంతో, అదే ఆత్మవిశ్వాసంతో వినిపిస్తుండటం యాదృచ్ఛికం కాదు. ఎందుకంటే ఈ పాట కేవలం ఒక ఉద్యమ గీతం కాదు. తెలంగాణ అనే భౌగోళిక ప్రాంతం వెనుక ఉన్న చరిత్రను, సంస్కృతిని, జీవన విధానాన్ని, పోరాటాలను, స్వాభిమానాన్ని ఒకే గానంలో బంధించిన సజీవ చరిత్ర. ఆ రోజులు తెలంగాణకు సులభమైన రోజులు కావు. ప్రాంతీయ అసమానతలు, వలస రాజకీయాలు, నిర్లక్ష్యం, వివక్షల మధ్య తెలంగాణ సమాజం తన అస్తిత్వాన్ని వెతుక్కుంటున్న కాలం అది. ప్రజల గొంతుకలు వినిపించని చోట పాటలు మాట్లాడాయి. సభల కన్నా ఎక్కువగా సాంస్కృతిక వేదికలు ప్రజల్లో చైతన్యా న్ని నింపాయి. అలాంటి సమయంలో ప్రజాకవి కామ్రేడ్ మిత్ర కలం నుంచి జాలువారిన ఈ గీతం తెలంగాణ ఉద్యమానికి ఒక సాంస్కృతిక జెండాగా మారింది. ఈ పాటను వినగానే ముందుగా కనిపించేది తెలంగాణ నేల. కృష్ణా, గోదావరి నదులు రెండు వైపులా పారుతుండగా మధ్యలో గోల్కొండ కిరీటంలా మెరిసే భూమి. ఇది కేవలం ప్రకృతి వర్ణన కాదు. ఒక భూభాగం తన చరిత్రతో, తన వారసత్వంతో ప్రపంచం ముందు తలెత్తుకుని నిలబడిన దృశ్యం. తెలంగాణను కేవలం రాజకీయ ప టంలో ఉన్న ప్రాంతంగా కాకుండా భారతమాత నుదుటి సింధూరంగా కవి చిత్రీకరించడం వెనుక ఒక చారిత్రక గర్వం ఉంది. అక్కడితో పాట ఆగిపోదు. పల్లెల్లోని చెరువులు, వెన్నెల రాత్రులు, జొన్నపిండి వాసనలు, పాలపిట్ట ల అందాలు అన్నీ ఒక్కొక్కటిగా మన కళ్ల ముందు ప్రత్యక్షమవుతాయి. తెలంగాణను అర్థం చేసుకోవాలంటే దాని మట్టిని అర్థం చేసుకోవాలని ఈ గీతం చెబుతుంది. నగరాల రాజకీయ చర్చల్లో కనిపించని గ్రామీణ తెలంగాణను ఈ పాట ప్రపంచానికి పరిచయం చేసింది. తెలంగాణ సంస్కృతిని ఒక్క మతం, ఒక్క వర్గం, ఒక్క భాషకు పరిమితం చేయలేమని ఈ గీతం అత్యంత స్పష్టంగా చెబుతుంది. పోశమ్మ, మైసమ్మ, గంగమ్మ, సారలమ్మల నుంచి బతుకమ్మ వరకు ప్రజల విశ్వాసాలను గౌరవంగా పలకరిస్తుంది. అదే సమయంలో తెలుగు, ఉర్దూ, కన్నడ, మరాఠీ యాసలు కలిసిన బహుభాషా సంపదను సైతం సంబరంగా ఆహ్వానిస్తుంది. తెలంగాణ అంటే వైవిధ్యం లో ఐక్యత అని చెప్పే అత్యంత శక్తివంతమైన సాంస్కృతిక ప్రకటన ఇది. ప్రతి ఉద్యమానికి ఒక రాజకీయ చరి త్ర ఉంటుంది. కానీ దాని కంటే గొప్పది సాంస్కృతిక చరిత్ర. తెలంగాణ ఉద్యమం కూడా అందుకు మినహాయింపు కాదు. పాలకుర్తి సోమన నుంచి ఆధునిక ప్రజాకవుల వరకు సాగిన సాహిత్య సంప్రదాయం, దళితబహుజన చైతన్యం, సామాజిక న్యాయం కోసం సాగిన కలం పోరాటం ఈ గీతంలో ప్రతిధ్వనిస్తుంది. అందుకే ఇది కేవలం ఒక ప్రాంతీయ గీతం కాదు. సామాజిక న్యాయం కోసం సాగిన ప్రజల దీర్ఘయాత్రకు సాంస్కృతిక పత్రం. అయితే ఈ గీతం పదాలతో మాత్రమే మహత్తర స్థాయికి చేరలేదు. దీనికి ప్రాణం పోసిన గళం ఉంది. ఆ గళం పేరు విమలక్క. తెలంగాణ ఉద్యమ చరిత్రలో విమలక్క ఒక వ్యక్తి మాత్రమే కాదు. ఒక సాంస్కృతిక శక్తి. ఒక ఉద్యమ స్వరం. ప్రజల కష్టాలు, ఆశలు, ఆవేదనలు, ఆకాంక్షలను తన గాత్రంలో మోసుకెళ్లిన కళాకారిణి. ఆమె వేదికపై పాడినప్పుడు అది గానం కాదు, ఒక సమా జం మాట్లాడుతున్నట్టు ఉంటుంది. అక్క పాటల్లో వినిపించింది తెలంగాణ రైతు నిట్టూర్పు. కూలీ చెమట. విద్యార్థి ఆవేదన. మహిళ ఆత్మగౌరవం.ఈ తెలంగాణ గీతం విమలక్క గొంతులో వినిపించిన తర్వాత అది కేవలం ఒక పాటగా మిగలలేదు. అది ఉద్యమ నినాదమైంది. గ్రామాల్లో, తండాల్లో, విశ్వవిద్యాలయాల్లో, ర్యాలీల్లో, ధర్నాల్లో, సభల్లో ప్రజలు ఈ గీ తాన్ని తమదిగా స్వీకరించారు. ఒక పాట ప్రజల ఆస్తిగా మారినప్పుడు అది సాహిత్యాన్ని దాటి చరిత్రలోకి ప్రవేశిస్తుంది. తెలంగాణ గీతం అలాంటి అరుదైన స్థాయిని అందుకుంది. విమలక్కకు ప్రజా కళ అంటే వినోదం కా దు. సామాజిక మార్పు కోసం ఉపయోగించే ఆయుధం. అందుకే ఆమె పాటల్లో ఎప్పుడూ బాధితుల పక్షం వినిపించింది. దళితులు, బహుజనులు, ఆదివాసులు, మహిళలు, కూలీలు, రైతులు ఆమె గానంలో తమ ప్రతిబింబాన్ని చూసుకున్నారు. తెలంగాణ ఉద్యమ కాలంలో ప్రజల ఆత్మగౌరవాన్ని కాపాడటంలో రాజకీయ నాయకులంతే పాత్రను ప్రజా కళాకారులు పోషించారని చెప్పాలంటే విమలక్క పేరు తప్పక గుర్తు చేయాలి. ఈ గీతంలో ఆదివాసుల నుంచి సర్దార్ పాపన్న వరకు, రైతాంగ సాయు ధ పోరాటం నుంచి బహుజన ఆత్మగౌరవం వరకు తెలంగాణ చరిత్రలోని విభిన్న ప్రవాహాలు కలుస్తాయి. తెలంగాణ అనేది కేవలం ఒక రాష్ట్రం కాదు, శతాబ్దాల పోరాటాల ఫలితమని ఈ పాట గుర్తు చేస్తుంది. ఈ నేలపై పుట్టిన ప్రతి వర్గానికీ, ప్రతి సమాజానికీ, ప్రతి భాషకీ, ప్రతి సంస్కృతికీ ఇందులో స్థానం ఉంది. తెలంగాణ రా ష్ట్రం ఏర్పడి దశాబ్దానికి పైగా గడిచింది. ఉద్యమ లక్ష్యం నెరవేరింది. కానీ ఈ పాట ప్రాసంగికత మాత్రం తగ్గలేదు. ఎందుకంటే రాష్ట్రం ఏర్పడటం ఒక రాజకీయ విజ యం మాత్రమే. తెలంగాణ అస్తిత్వాన్ని, సంస్కృతిని, భాషను, స్వాభిమానాన్ని తరతరాలకు అందించడం ఒక నిరంతర ప్రక్రియ. ఆ బాధ్యతను ఈ గీతం ఇప్పటికీ నిర్వర్తిస్తోంది.

నేటి యువతలో చాలా మంది ఉద్యమ కాలాన్ని ప్రత్యక్షంగా చూడలేదు. కానీ ఈ పాట విన్నప్పుడు వారు తెలంగాణ చరిత్రను అనుభూతి చెందగలుగుతున్నారు. ఒక తరం పోరాడి సాధించిన రాష్ట్రం వెనుక ఉన్న త్యాగాలను అర్థం చేసుకోగలుగుతున్నారు. అందుకే ఈ గీతం ఒక చారిత్రక పాఠ్యపుస్తకంలా, ఒక సాంస్కృతిక స్మృతిగ్రంథంలా నిలుస్తోంది. ప్రపంచం వేగంగా మారుతోం ది. సంగీత ధోరణులు మారుతున్నాయి. ప్రతిరోజూ వం దల పాటలు వస్తున్నాయి, మాయమవుతున్నాయి. కానీ మట్టిలో పుట్టిన పాటలకు కాలం పరిమితి ఉండదు. ప్రజల గుండెల్లో పుట్టిన స్వరాలు ఎప్పటికీ చనిపోవు. తెలంగాణ గీతం అదే సత్యాన్ని మరోసారి నిరూపించింది. ఈ పాట వినిపించిన ప్రతిసారి మనకు కేవలం ఒక గాయకురాలి గళం మాత్రమే వినిపించదు. ఒక కవి అమర్ అన్న కలం కనిపిస్తుంది. ఒక ఉద్యమం అడుగుల శబ్దం వినిపిస్తుంది. ఒక జాతి ఆత్మగౌరవం ప్రతిధ్వనిస్తుంది. చెరువుల నీళ్లు, పల్లెల దుమ్ము, బతుకమ్మ రంగులు, రైతు చెమట, విద్యార్థి కలలు అన్నీ కలిసి ఒకే స్వరంగా మారుతాయి. అందుకే 'పాడరా పాడరా మన పాట' ఒక పాట కాదు. అది తెలంగాణ ఆత్మకథ. అది తెలంగాణ సంస్కృతికి చిరునామా. అది తెలంగాణ స్వాభిమానానికి ప్రతీ క. అది ఉద్యమ తరాల జ్ఞాపకం. అది కొత్త తరాల పా ఠం. కాలం గడిచినా, తరాలు మారినా, రాజకీయాలు మారినా, తెలంగాణ అనే పేరు ఉన్నంత వరకు ఈ గీతం జీవిస్తుంది. ఎందుకంటే ఇది ఒక గానం కాదు. ఒక జాతి గుండెచప్పుడు.

**మన్నారం నాగరాజు.**
**సామాజిక రాజకీయ విశ్లేషకులు**



**పాడరా పాడరా మన పాట**
**జన తెలంగాణమని ప్రతినోట**

పాడరా పాడరా మన పాట
జన తెలంగాణమని ప్రతినోట
కృష్ణ గోదావరులు కుడి ఎడమ పారగా
గోల్కొండ తలపైన కిరీటమై మెరవగా
త్రిలింగాల నేల తెలంగాణమై
భరతమాత నుదుట సింధూరమై
పాడరా పాడరా మన పాట
జన తెలంగాణమని ప్రతినోట
సెరువు అలుగులు దుంక
సిలుకవన్నెల సెలుక మంచెనెక్కి
రాత్రికాసేను నెలవంక జొన్నపిస్కిల్లు
తల్లి పాలోలెరా పాలపిట్ట వాలి తింటుందిరా
॥పాడరా, పాడరా॥
పోశమ్మ మైసమ్మ గ్రామ పొలేరమ్మ
వాగొస్తె గంగమ్మ వనంలో సారమ్మ
సిబ్బిపూలనడుమ గౌరమ్మరా
ఆడబిడ్డల జాడ బతుకమ్మరా
॥పాడరా, పాడరా॥
తెలుగు ఉర్దులు బహు భాషా సంపదలు '
కన్నడ మరాఠీ కలెగలిసె యాసలు
జానపదులు తేనెలొలికేనురా
దేవ సంస్కృతీడ నడమాదురా
॥పాడరా, పాడరా॥

పాటలంకితమివ్వ ఏ రాజులెందుకని
పాలకుర్తి నుండి ప్రజాకవుల దాకా
సమరాగ్ని కలములో నింపుకోగా
సామాజిక న్యాయమంపు కోగా
॥పాడరా, పాడరా॥
పంబాల జముకులు సొన్నాయి పలుకులు
సార్తకాండ్ల వీణతోలుడప్పు,
డోలు వీరీల బోనాల పండుగరా
గజల్ బాగోతాలు పండేనురా

॥పాడరా, పాడరా॥

ఆదివాసుల కొలువు సమ్మక్క సారక్క
బహుజన రాజ్యమే సర్దార్ పాపన్న
రైతాంగ సాయుధ పోరాటమై
॥పాడరా, పాడరా॥

వాగు వంకలు తిరిగెవయ్యారి నడకలు
కాయకష్టమెరిగె రైతులు కూలీలు
పల్లెల తండాల పదిజిల్లాలురా
పట్నాలు కార్మికుల నిలయాలురా
॥పాడరా, పాడరా॥
మాదిగలు మాలలు బహుజనులందరు
సంచార జాతులుస ర్వమానవతలు
పుట్టి పెరిగే ఆత్మగౌరవంగా
ఎలుగెత్తి చాటిందీ తెలంగాణరా
॥పాడరా, పాడరా॥

శాంతి సమతలు విత్తిపంట రాశులనెత్తి
ప్రతి ఇంట త్యాగాల్లో నవకాంతి రాగాల్లో
తెలంగాణ తొలిపొద్దు వరాలురా
ముక్కోటి రతనాల వీణాయేరా
॥పాడరా, పాడరా॥
తెలంగాణ తొలి పొద్దు వర్ణాలురా
ముక్కోటి రతనాల వీణాయెరా
పాడరా పాడరా మనపాట
తెలంగాణ తల్లి బతుకుపాట...

**ఈ పాట 25 ఏళ్ల పాట ప్రస్థానం సందర్భంగా...**

# ధిక్కార, దిగ్గజ కవి భానుడు.... దాశరథి రంగాచార్య!



దిగ్గజ కవి... దాశరథి రంగాచార్య... తెలంగాణా సాహితీ భానుడిగా, ధిక్కార కవిగా, తెలుగు సరస్వతి ముద్దుల పుత్రుడిగా మహోజ్వలంగా ప్రకాశించాడు. పరస్పర వైరుధ్యాలు కలిగిన మార్క్సిజం, ఆధ్యాత్మికాలను జోడు గుఱ్ఱాలుగా కట్టి సమ ఉజ్జీలుగా సాహితీ రథాన్ని పరుగు పెట్టించిన మేటి సాహితీ సారథిగా...రంగాచార్య గొప్ప ఖ్యాతి గడించాడు. నిజాం దాష్టిక పాలనకు ప్రజలు ఎదురు తిరిగిన రోజుల నేపథ్యంలో... మహబూబాబాద్ జిల్లా(ఉమ్మడి వరంగల్ జిల్లా) చిన్న గూడూరులో దాశరథి వెంకటాచార్యవెంకటమ్మ దంపతులకు ప్రథమ పుత్రుడు, ప్రసిద్ధ సకలాంధ్ర కవి దాశరథి కృష్ణమాచార్య 1925 జూలై 22న జన్మించగా... 1928 ఆగస్టు 24న... ద్వితీయ పుత్రుడిగా దాశరథి రంగాచార్య జన్మించాడు. ఆధ్యాత్మిక కార్యాలకు తప్ప, అన్య కార్యాలలో పాల్గొనని సాంప్రదాయ శ్రీ వైష్ణవ కుటుంబం వారిది. సాధారణంగా రాజకీయాలను గాని, ఏఇతర వ్యవహారాలను గానీ అంటు కోక కేవలం దైవ, సాంస్కృతిక కార్యాలనే బతుకు తెరువుగా గడిపే పేద కుటుంబం వారిది. ఇందుకు విరుద్ధంగా... సోదర ద్వయం... దాశరథి కృష్ణమాచార్య, దాశరథి రంగాచార్యులు... అరాచక పాలన సాగిస్తున్న దుష్ట నిజాం నవాబుపై... ప్రళయ కాల సమయాన శివుని లాగా... త్రినేత్ర సందిగ్ధులై ఒక చేత్తో పెన్ను, మరొక చేత్తో గన్నుతో ప్రజాపక్షాన పోరాటానికి దిగారు... ఇలా ఉండగా... నిజాంకు వ్యతిరేకంగా... ఉవ్వెత్తున వ్యాపించిన వందేమాతరం ఉద్యమంలో భాగంగా... విద్యార్థి దశలో... రంగాచార్య... పాఠశాల ప్రార్థనా సమయంలో... నిజాం స్తుతిని ధిక్కరించి వందేమాతరం పాడి నిజాం ఉపాధ్యాయుల చేతిలో దెబ్బలు తి న్నాడు. ఇదే క్రమంలో నిజాం నవాబు విధించిన యూనిఫారంలో కుచ్చు టోపికి బదులు గాంధీ టోపీని పెట్టుకున్నాడు. తోటి విద్యార్థు లందరికి పెట్టించి తన తెలంగా ణా విముక్తి ఆకాంక్షను బలంగా వెల్లడించాడు.... ఈక్రమంలో నిజాం వ్యతిరేక పోరాటంలో పూర్తి స్థాయి చురుకైన కార్యకర్తలుగా కొనసాగడం చేత... నిజాం పోలీసుల దాడులు తమ సోదర ద్వయంపై తీవ్రంగా పెగడంతో వ్యూహాత్మకంగా... రంగాచార్య అండర్ గ్రౌండ్ వెళ్ళి పో యాడు. తుపాకి పేల్చడంలో శిక్షణ తీసుకున్నాడు. 1948 సెప్టెంబర్ 16న పోలీస్ యాక్షన్ తర్వాత ఉద్యమం నుంచి బయటకు వచ్చాడు... స్వయం కృషితో చదువుకొని 1951లో ఉపాధ్యాయ వృత్తి చేపట్టాడు. 1957 లో సికింద్రాబాద్ మున్సిపల్ కార్పోరేషన్లో అనువాదకులుగా చేరారు. వివిధ విభాగాల్లో పని చేసి 1988లో అసిస్టెంట్ కమీషనర్గా ఉద్యోగ విరమణ చెందాడు. తండ్రి కవి, పండితుడు, తల్లి హరికథ భాగవతారిణి అవడం చే త వారి కవితా, పాండిత్య, సాంస్కృతిక పరిమళాలు... అన్నదమ్ములిద్దరికి అబ్బాయి... ఇలా ప్రజా కవులై నిజాంపై రాసిన... కవితలు, గేయాలు, నినాదాలను ఆ యుధాలుగా చేసుకొని ఎక్కుపెట్టి సాహిత్య పిడుగులు రాల్చారు. ఈక్రమం... ఇద్దరి సోదరులను మహాకవుల ను చేసింది. ఈక్రమంలో నిజాం నవాబు అరాచక పాలనతో తల్లడిల్లిన తెలంగాణా ప్రజల బతుకు చిత్రణతో మహా రచయిత వట్టికోట అళ్వారు స్వామి నవలలు రా స్తున్నాడు. ఆయన ప్రభావం రంగాచార్యపై పడి ఆయ నా... అదే మార్గంలో... తెలంగాణా గ్రామీణ జీవితం, నీచ భూస్వామ్య దురాగత వ్యవస్థ, దుష్ట రజాకార్ల, నిజాం పోలీసుల దాష్టికాలకు అద్దం పడుతూ... తెలంగాణా మాండలికానికి పెద్ద పీట వేస్తూ నవలల రచనల ను ఆరంభించా డు. 1964 అక్టోబర్లో తొలి నవల 'చిల్ల ర దేవుళ్ళు' రా శాడు. ఈనవల అప్పుడు పెద్ద సంచలన మైంది. 1974లో సావిత్రి, ప్రభాకర్‌రెడ్డి, వినయకుమా ర్, ఉమా భారతి ప్రధాన పాత్రధారులుగా 'చిల్లర దేవు ళ్ళు' సినిమాను హనుమకొండకు చెందిన దర్శకుడు టి. మాధవ రావు తీశాడు. 'శ్రీలక్ష్మి నీమహిమలు గౌరమ్మ' అనే బతుకమ్మ పాటను... తద్వారా హనుమకొండలో... యావత్ తెలంగాణాలోనే ఎంతో గొప్పగా జరిగే సద్దుల బతుకమ్మ పండుగను ... తొలి సారిగా ప్రపంచానికి పరిచయం చేసి హనుమకొండకు గొప్ప ఖ్యాతిని తెచ్చింది 'చిల్లర దేవు ళ్ళు' చిత్రం. ఈవిధంగా... రంగాచార్య రచనా ప్రభంజనం కొనసాగింది. కాగా తెలంగాణా మాండలిక ప్రయోగంతో మొత్తం 9నవలలు రాశాడు. తెలంగాణా శైలితో రాయడం ఆయనకు మంచి పేరు తెచ్చింది. వాల్మీకి, వ్యాసుడు, కాళిదాసు, పాల్కురికి సోమన, పోతన, గోర్కీ ప్రేంచద్‌ల మేలు కలయికగా... ఆమహా కవులందరూ ఒక్కటిగా కలిస్తే ఒక శిఖరాగ్ర మహాకవి దాశరథి రంగాచార్యగా... ఆయన పేరు ప్రఖ్యాతులు గడించాడు. రంగాచార్య సాగించిన భిన్న వైరుధ్యాల అక్షర సృష్టి అనితర సాధ్యం. 9నవలలతో పాటు రామాయణం, భారత, భాగవతాలు, 4వేదాలు, 10 ఉపనిషత్తులు, 2బ్రాహ్మణాలు, పలు ఇతర రచనలు... ఒక్క చేతి మీద వెలువరించడం, అన్ని రకాల పాఠకులను మెప్పించడం సామాన్యులకు సాధ్యం కాదు. రాబోయే కాలాల్లో ఈ అక్షర బ్రహ్మ యశస్సు మరింతగా పెరుగు తుంది... ఈ సుదీర్ఘమైన రచనా జీవితానికి స్వస్తి వాచకం పలుకుతూ దాశరథి రంగాచార్య 2015 జూన్ 8న 83 ఏళ్ళ వయసులో పరమపదించారు. రంగాచార్య మన మధ్య భౌతికంగా లేకున్నా... ఆయన రచనలు ప్రజల్ని నిత్యం చైతన్య పరుస్తూనే ఉంటాయి.

**తాళ్ళపల్లి యాదగిరిగౌడ్,**
**9949789939**

## ఈ వారం కవితలు

### కాక్రోచ్ జనతా పార్టీ!




గళాన్ని బలంగా
విప్పిన యువత
నిరుద్యోగం పేపర్ లీకేజ్
జీవన వ్యయబారం
అవకాశాల కొరత నిరుద్యోగులు
సోమరిపోతులు కాక్రోచ్‌లు

పరాన్న జీవులు అన్న ఒక్క పదం
ఎంత పని చేసిందో చూడు
సిజెఐ దెప్పిపొడుపు మాట
సిజెపి ఆవిర్భావానికి
ఎలా కారణమైందో చూడు!

చరిత్రలో అర్జునుడు
ద్రౌపతి తక్షకుల శపథం ఎలా
పరిణమించాయో తెలుసు కదా!
అలా వచ్చి ఇలా
అల లాగా వెళ్ళిపోతుందా!

మూలిగే నక్కపై
తాటికాయ పడ్డట్టు
యువత నవత అవమానం
భరిస్తుందా!
సెక్యులర్ సోషలిస్ట్ డెమోక్రటిక్
లేజీ డిజిటల్ ఆలోచనలతో
ప్రాణంపోసుకున్నకాక్రోచ్‌జనతాపార్టీ

వినూత్న ఉద్యమం!
సాంకేతికత ఒక శక్తి
ఆయుధంగా మారిన
డిజిటల్ యుక్తి!
అవమానకర వ్యాఖ్యలకు
వ్యంగ్య నిరసన
ప్రతిఘటనలు ప్రతిబింబం

యువతను నిర్లక్ష్యం చేస్తే
అవమానిస్తే నిద్రాణమై ఉన్న
భావాగ్ని అగ్ని కొండై
బద్దలు కాదా!

సిజెపి మ్యానిఫెస్టో వినూత్నం
ఆధునిక ఆకాంక్షల
యువత యత్నం
ప్రశాంత భారత వనిలో
కొత్త పొద్దు పొడుస్తుందా
చూద్దాం!

**పట్లోళ్ల బక్కారెడ్డి, 9705315250**

### గానామృతం

ఓంకారనాదాలు చేయనా
ఒలికే బ్రహ్మతత్త్వం పలుకనా,
ఆదిమధ్యాంత రహిత స్వరంతో
అంతరంగాలను వెలిగించనా ॥

వీణానాదాలు మీటనా
విద్యాదేవిని స్తుతించనా,
తంతులతాకిడిలో తీయనిభావాలు
హృదయ తరంగాలుగా పారించనా॥

శంఖారావాలు పూరించనా
శుభవేళల సందేశాలు చాటనా,
మంగళధ్వనుల మకరందాన్ని
మనసుల తోటల్లో చల్లనా ॥

గాంధర్వగానాలు వినిపించనా
గగనవీధుల్లో విహరించనా,
స్వరసుధల జలపాతాలతో
శ్రోతల హృదయాలు తడిపెయ్యనా॥

ప్రేమగీతాలు ఆలపించనా
ప్రణయసుధలను పారించనా,
రెండు హృదయాల మధ్యన
అనురాగ దీపాలు వెలిగించనా॥

భక్తిగీతాలు పాడనా
భవసాగరానికి పడవనవ్వనా,
దైవనామ స్మరణామృతంతో
భక్తుల మనసులు పులకింపజేయనా॥

గానం నా గుండె ఆక్రందం
స్వరం నా జీవన స్పందనం,
పాటే నా ప్రాణనాదం —
పరమానందమే నా గానామృతం॥

సప్తస్వరాల సౌరభాలతో
సకల జగతిని అలరించనా,
మానవత్వ మాధుర్యాన్ని
మధుగీతమై వినిపించనా॥

**గుండ్లపల్లి రాజేంద్రప్రసాద్**

### అంతర్యుద్ధం..!

లోలోపలి సగటు ఘర్షణ
నిలువెత్తున ఎగసి పడుతున్నా
ప్రశ్నించలేని పరిస్థితి
చుట్టూ వలయంలా అల్లుకుంది

ఎన్నో గాయాల్ని తట్టుకుంటూ
మరెన్నో కన్నీటి కాల్వలను దాటుతూ
జీవన ప్రయాణం సాగిపోతోంది
అడిగే నోటిని నొక్కుతూ
చూపుడు వేలును విరిచే తత్త్వం
అణువణువునా పడగలిప్పుతోంది

అంతర్యుద్ధం మొదలైన దగ్గర్నుంచి
ఆకలి పోరాటం అడుగడుగునా
నినాదమై శంఖం ఊదుతోంది
మనసు పొరల్లో మొదలైన ప్రకంపన
అక్కడే విచ్ఛిన్నమైపోతూ
ఒక బ్రతుకును చిదిమేసుకుంటోంది

పైపైకి కనిపించని స్థితి గతులతో
లోలోపల తిరగబడే ఆర్థిక భారంతో
పోటీ పడి సాధించలేని పరిస్థితిలో
అడిగే హక్కుకు కూడా దిక్కులేని
దీనావస్థ నేస్తమైపోయింది
బాహ్య ప్రపంచంలో మనుగడకు
తావులేకుండా పోయింది

ఎన్ని ఆర్థిక యుద్ధాలు లోలోపల
భీభత్సం సృష్టించలేదు
ఎన్ని నష్టాలు మధ్యతరగతిని
చిన్నాభిన్నం చేయలేదు

ఎన్ని తారతమ్యాలు
తిరగబడి నేలకు తొక్కలేదు
ఈ సగటు అంతర్యుద్ధంలో
ఎన్ని వైఫల్యాలు చుట్టుకోలేదు
ప్రశ్నకు సమాధానం తిరుగుబాటు

**నరెడ్డుల రాజారెడ్డి, 9666016636**

### ' రుధిర పోరాటం '

నా నిండా ఎర్రగా పారుతున్నది
నన్ను తనలో కలుపుకొని
పోరాటమై ఎగిసిపడుతున్నది
కన్నీటి సుక్కల వెంట మొలకెత్తుతది
ఎండిన కడుపులలో
కూడుకొరకు కుస్తీ పడుతది
ప్రశ్నల వర్షమై కురుస్తది

హక్కుల సాధనై సాగుతది
త్యాగనిరతికి నిదర్శనం

నిరాడంబరత తన ఉనికి
నన్ను రగిలించే నిత్య చైతన్యం
భేదమెరుగక సమానతగా
పారుతది నేను నిలబడాలంటే
నా రక్తము ఎర్రగా పండాలంతే
నేను పంటనై పండాలంటే
ఎర్రదనమై నిండి పోవాలి
ఎరుపుదనమే నవజీవన చైతన్యం

**గుండెల్లి ఇస్తారి**

# ఆధునిక సాహిత్య ధోరణి 'హైకూ'



సాహిత్యం అంటే పెద్ద కావ్యాలు, వందల పేజీల నవలలు మాత్రమే కాదు. మూడు పంక్తుల్లో విశ్వాన్నే ఇమిడ్చే శక్తి ఉన్న చిన్న రూపం ఉంది. అదే హైకూ. జపాన్ నుండి బయలుదేరి, తెలుగు నేలపై వేరు వేసుకుని, నేడు ఆధునిక తెలుగు కవిత్వంలో ఒక ప్రత్యేక ధోరణిగా ఎదిగింది హైకూ. హైకూ అంటే '575' అక్షరాల గణంతో,మూడు పంక్తుల్లో రాసే సూక్ష్మ కవితా రూపం. మొత్తం 17 అక్షరాలు. కానీ ఈ 17 అక్షరాల్లో కవి ఒక క్షణాన్ని, ఒక భావాన్ని, ఒక ప్రకృతి దృశ్యాన్ని బంధిస్తాడు. 'తక్కువ మాటలు ఎక్కువ భావం' అనేది హైకూ సూత్రం.తెలుగులో దీనిని 'త్రిపది' లేదా 'ముక్కుపద్యం' అని కూడా అంటారు. తెలుగులో హైకూను మొదట పరిచయం చేసింది జానమద్ది హనుమచ్ఛాస్త్రి గారు. ఆయన 'హైకూ మంజరి' పుస్తకంతో ఈ రూపాన్ని తెలుగువారికి చేరువ చేశారు. ఆ తర్వాత డా. సినారె, కొత్రపాటి గంగాధరావు, శ్రీరామ్ శర్మ, యర్రా రిషికేష్ లాంటి వారు హైకూకు కొత్త ఒరవడి తెచ్చారు. వీరి కృషి వల్ల హైకూ కేవలం అనువాద కవిత్వం నుండి స్వతంత్ర తెలుగు కవితా రూపంగా ఎదిగింది. నేడు 'హైకూ సాహిత్య వేదిక', 'ఆంధ్ర హైకూ సంఘం' లాంటి సంస్థలు ప్రతి నెల పోటీలు పెట్టి కొత్త కవులను ప్రోత్సహిస్తున్నాయి. హైకూ ఒక ఫోటో లాంటిది. 'వర్షం చుక్క / అరచేతిలో పెట్టుకొని ఆగి / మాయమైంది' ఇక్కడ కవి వర్షం చుక్కను మన కళ్ల ముందు నిలబెట్టాడు. ఆ క్షణం శాశ్వతమైపోతుంది. సాంప్రదాయ హైకూలో 'కిగో' అంటే ఋతు పదం తప్పనిసరి. తెలుగు హైకూ కూడా వర్షం, మబ్బు, పున్నమి, ఎండ, కోయిల లాంటి ప్రకృతి మూలకాలతో మొదలైంది. నేటి పర్యావరణ స్పృహకు ఇది చాలా అవసరం.హైకూలో కవి అంతా చెప్పడు.సగం చెప్పి సగం పాఠకుడికి వదిలేస్తాడు. 'ఖాళీ బల్ల / దాని మీద నీ నీడ / ఈరోజు కూడా'. ఇక్కడ విరహం ఉంది, ఒంటరితనం ఉంది. కానీ ఆ మాటలు కవి రాయలేదు. పాఠకుడే అర్థం చేసుకుంటాడు. ఈ 'ఖాళీ'నే హైకూ బలం. పాతకాలపు హైకూ ప్రకృతి గురించే రాస్తే, నేటి తెలుగు హైకూ నగర జీవితం, మొబైల్, ట్రాఫిక్, కరోనా, ఉద్యోగ ఒత్తిడి వీటి గురించి కూడా రాస్తోంది. 'సిగ్నల్ దగ్గర / కారు అద్దం దిగి / నవ్వే చిన్నారి' ఇది ఆధునిక హైకూకు ఉదాహరణ.వాట్సాప్ స్టేటస్, ట్విట్టర్, ఇన్‌స్టా రీల్స్ యుగంలో హైకూకు విపరీతమైన డిమాండ వచ్చింది. ఎందుకంటే 17 అక్షరాలు అంటే ఒక ట్వీట్ కంటే చిన్నది. తెలుగు హైకూ అనే హ్యాష్‌ట్యాగ్‌తో వేలాది కవితలు రోజూ పోస్ట్ అవుతున్నాయి. 'కరోనా హైకూలు', 'లాక్‌డౌన్ హైకూలు' లాంటి సంకలనాలు కూడా వచ్చాయి.యువత మొబైల్‌లో టైప్ చేసేంత సులభంగా ఉండడం, వెంటనే లైకులు, కామెంట్లు రావడం వల్ల హైకూ సోషల్ మీడియా స్టార్‌గా మారింది. హైకూతో తక్కువ పదాలతో ఎక్కువ భావం చెప్పడం అలవాటవుతుంది.భాషా నైపుణ్యం పెరుగుతుంది.ఒత్తిడి మధ్య మూడు పంక్తులు చదివి మనసు తేలిక పడుతుంది. ఇది 'మైండ్‌ఫుల్‌నెస్' లాంటిది. గజల్, గేయం, వచన కవిత్వం తర్వాత హైకూ తెలుగు కవిత్వానికి కొత్త రూపు ఇచ్చింది. యువ కవులు దీన్ని ప్రయోగశాలగా వాడుకుంటున్నారు. కొందరు '575 గణం తెలుగులో కుదరదు' అంటారు.తెలుగు అక్షర నిర్మాణం జపనీస్‌కు భిన్నం కాబట్టి, '3 పంక్తులు, చిన్నదిపెద్దది చిన్నది' అనే రూపం పాటిస్తే చాలు అనేది చాలా మంది అభిప్రాయం. మరికొందరు 'హైకూ పేరుతో సామెతలు,సూక్తులు రాస్తున్నారు' అని విమర్శిస్తారు. కానీ ఏ కొత్త ధోరణికైనా మొదట్లో ఈ పరీక్షలు తప్పవు. హైకూ అంటే కవిత్వంలోని 'మినిమలిజం'. పెద్దగా చెప్పకుండా, గట్టిగా అరవకుండా, మెల్లగా గుండె తట్టి వెళ్లిపోయే కళ. ఆధునిక మనిషికి కావాల్సింది కూడా అదే. ట్వీట్ యుగంలో హైకూ మరింత ప్రస్తుతమైంది. 'పాత చింత చెట్టు / కొత్త చిగురు వేసింది / కాలం నవ్వింది' ఈ మూడు పంక్తులు చాలు. కాలం మారుతుంది, కానీ జీవం ఆగదు అనే సత్యం అర్థమవుతుంది. తెలుగు హైకూ రేపటి సాహిత్యంలో ఒక బలమైన ప్రవాహంగా నిలుస్తుందనడంలో సందేహం లేదు.మన పత్రిక లాంటి వేదికలు ప్రవాహానికి వంతెనలుగా నిలవాలి.

**సుధాకర్.ఎ.వి, 9000674747**

# ప్రభుత్వ ఉద్యోగాల కోసం
# బిసి స్టడీ సర్కిల్స్‌లో ప్రత్యేక శిక్షణా తరగతులు

విద్యార్థుల సమగ్ర వికాసం కోసం హాస్టళ్లలో క్రీడలకు ప్రాధాన్యం

బిసి సంక్షేమ శాఖ అధికారుల సమీక్షా సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాబోయే ప్రభుత్వ ఉద్యోగ నోటిఫికేషన్లను దృష్టిలో ఉంచుకుని రాష్ట్రంలోని బిసి స్టడీ సర్కిళ్లలో ప్రత్యేక శిక్షణా తరగతులు ప్రారంభించాలని బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులకు సూచించారు. ఫౌండేషన్ కోర్సులు, కెరీర్ గైడెన్స్ కార్యక్రమాలను ఏడాది పొడవునా నిర్వహించేలా ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు.
అదేవిధంగా బిసి స్టడీ సర్కిళ్లలో సివిల్ సర్వీసెస్ అభ్యర్థుల కోసం దీర్ఘకాలిక శిక్షణ కార్యక్రమాలు త్వరలో ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలన్నారు. బిసి సంక్షేమ శాఖలో చేపడుతున్న పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, హాస్టల్ల పని తీరు తదితర అంశాలపై ఆదివారం మినిస్టర్ క్వార్టర్స్‌లో బిసి సంక్షేమ శాఖ ఉన్నతాధికారులతో మంత్రి పొన్నం ప్రభాకర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. బిసి సంక్షేమ శాఖ ద్వారా అమలవుతున్న సంక్షేమ పథకాలు, కార్యక్రమాల ప్రభావవంతమైన అమలుతో పాటు బిసిల సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా ఈనెల మూడవ వారంలో జిల్లా బిసి సంక్షేమ అధికారులు, సహాయ బిసి సంక్షేమ అధికారులతో మంత్రి పొన్నం ప్రభాకర్ మేధో మథనం నిర్వహించనున్నట్లు తెలిపారు. బిసి గురుకుల పాఠశాలలు, బిసి సంక్షేమ హాస్టళ్లు పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యార్థులకు మెరుగైన సౌకర్యాల కల్పన, విద్యా ప్రమాణాల పెంపు, సంక్షేమ కార్యక్రమాల సమర్థవంతమైన అమలుపై సమావేశంలో విస్తృతంగా చర్చించనున్నారు. హాస్టళ్లు ప్రారంభమైన వెంటనే విద్యార్థులకు అందించాల్సిన మెనూ అమలు తీరు, యూనిఫారాలు, పాఠ్యపుస్తకాలు, షూస్ తదితర అవసరమైన సామగ్రి పంపిణీ విధానంపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు. ఈ సందర్భంగా బిసి గురుకులాలు, బిసి సంక్షేమ హాస్టళ్ల విద్యార్థులు ఈ విద్యా సంవత్సరంలో పదో తరగతి పరీక్షల్లో రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమ ఫలితాలు సాధించడం పట్ల మంత్రి అభినందనలు తెలిపారు. అలాగే బిసి గురుకులాల్లో ఇంటర్మీడియట్, డిగ్రీ విద్యార్థుల సంఖ్య పెంపుపై చర్యలు చేపట్టాలని ఆదేశించారు. విద్యార్థుల సమగ్ర వికాసం కోసం హాస్టళ్లలో క్రీడలకు ప్రాధాన్యం కల్పించాలని సూచించారు. ప్రతి విద్యార్థికీ క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, వ్యక్తిగత ఆరోగ్య రికార్డులు సిద్ధం చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. సమావేశంలో బిసిల ఆత్మగౌరవానికి ప్రతీకలైన ఆత్మగౌరవ భవనాల పురోగతిపై కూడా చర్చ జరిగింది. సమీక్షా సమావేశంలో బిసి సంక్షేమ శాఖ కార్యదర్శి బాలమాయాదేవి, బిసి కార్పొరేషన్ ఎండి మల్లయ్య బట్టు, ఎంబిసి కార్పొరేషన్ ఎండి అలోక్ కుమార్, బిసి స్టడీ సర్కిల్ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, వడ్డెర ఫెడరేషన్ ఎండి శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కార్మికుల మద్దతు కాంగ్రెస్ ప్రభుత్వానికే
## స్పష్టం చేసిన జలమండలి ఫలితాలు

టిపిసిసి అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జలమండలి గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల ఫలితాలు కార్మికులు, ఉద్యోగుల మద్దతు కాంగ్రెస్ ప్రభుత్వానికే ఉందని స్పష్టం చేస్తున్నాయని టిపిసిసి అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. సింగరేణి, జలమండలి తదితర సంస్థలను బిఆర్‌ఎస్ నాయకులు తమ గుప్పిట్లో పెట్టుకుని కార్మికులను ఇబ్బందులకు గురిచేశారని మండిపడ్డారు. ముఖ్యంగా జలమండలిపై హరీష్‌రావు ఆధిపత్యం కొనసాగిందని విమర్శించారు. జలమండలి గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో అధ్యక్షునిగా ఘన విజయం సాధించిన ఐఎన్‌టియుసి అనుబంధ కార్మిక సంఘం తెలంగాణ జలమండలి ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు మొగుళ్ల రాజిరెడ్డి అభినందన సభ ఆదివారం గాంధీభవన్‌లో జరిగింది. సభకు ముఖ్య అతిథిగా హాజరైన మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ ఐఎన్‌టియుసి ద్వారా జలమండలిలో కాంగ్రెస్ జెండాను ఎగరేశామని, రానున్న జిహెచ్‌ఎంసి ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ విజయపతాకం ఎగరవేస్తుందని ధీమా వ్యక్తం చేశారు. జలమండలి ఎన్నికల్లో అధ్యక్షుడిగా ఘన విజయం సాధించిన మొగుళ్ల రాజిరెడ్డి నాయకత్వ బృందానికి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మికులు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించి తమ నాయకులను ఎన్నుకున్నారని తెలిపారు. కార్మికుల కష్టసుఖాల్లో అండగా నిలవాలని మొగుళ్ల రాజిరెడ్డి బృందానికి సూచించారు. కార్మికుల సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని మహేష్‌కుమార్ గౌడ్ హామీ ఇచ్చారు. మొగుళ్ల రాజిరెడ్డి మాట్లాడుతూ జలమండలిలో 12 ఏళ్ల తర్వాత కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి, ఐఎన్‌టియుసి అనుబంధ కార్మిక సంఘం (తెలంగాణ జలమండలి ఎంప్లాయిస్ యూనియన్)ను భారీ మెజార్టీతో గెలిపించినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. సిఎం రేవంత్ రెడ్డి, మహేష్ కుమార్‌గౌడ్, మంత్రులు వివేక్ వెంకటస్వామి, పొన్నం ప్రభాకర్ తదితరులు తనకు పూర్తి సహాయ సహకారాలు అందించారని పేర్కొన్నారు. జలమండలి కారికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సాధ్యమైనంత త్వరగా పరిష్కరిస్తానని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. ఈ సభలో ఐఎన్‌టియుసి ఇన్‌చార్జి, మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, ఐఎన్‌టియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు ఆర్.డి. చంద్రశేఖర్, వై.నాగన్న గౌడ్, అదిల్ షరీఫ్, టిజెఐయు ప్రధాన కార్యదర్శి కె.రాఘవేంద్ర రాజు, అసోసియేట్ ప్రెసిడెంట్ అల్లి శ్రావణ్ కుమార్, వాటర్ వర్క్స్ ఎంప్లాయిస్ యూనియన్ తెలంగాణ అధ్యక్షుడు కె.రాజి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ధరల పెరుగుదల నిరసిస్తూ ..
# 10న రాష్ట్రవ్యాప్త ఆందోళన

సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు



**ప్రజాపక్షం/హనుమకొండ :** ధరల పెరుగుదలను నిరసిస్తూ సిపిఐ ఆధ్వర్యంలో ఈనెల 10న రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన నిర్వహిస్తున్నట్లు సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు తెలిపారు. రోజు రోజుకు నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని, సామాన్యుడు బతికే పరిస్థితి లేకుండా పోయిందని, బియ్యం, పప్పులు, నూనెలు, గ్యాస్, పెట్రోల్, డీజిల్, చివరకు కూరగాయల ధరలు కూడా సామాన్య, మధ్యతరగతి కుటుంబాల బడ్జెట్‌ను అతలాకుతలం చేస్తున్నాయని తెలిపారు. ఈ ధరల పెరుగుదలను అరికట్టడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని పేర్కొన్నారు. దీంతో ఇల్లు గడవడమే భారంగా మారిన పేద ప్రజల భవిష్యత్తు మరింత అంధకారమవుతున్నదని, తక్షణమే నిత్యావసరాల ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు సబ్సిడీపై రేషన్ వస్తువులను అందించాలని,పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ ధరలపై పన్నులను తగ్గించి, సామాన్యుడికి ఉపశమనం కలిగించాలని కోరారు. మార్కెట్‌లో నల్లబజారు, కృత్రిమ కొరత సృష్టిస్తున్న వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్, నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలను నిరసిస్తూ జూన్ 10న రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయాల ముందు ఆందోళన చేపట్టనున్నట్లు, ఈ ఆందోళన కార్యక్రమాలలో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని నిరసన తెలపాలని ఆయన కోరారు.



# నన్ను ఆపేటోడు ఇంకా తెలంగాణలో పుట్టలేదు

కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** 'నన్ను పొలిమేర దాటనివ్వనని అనడానికి నువ్వెవరు? 'నన్ను ఆపేటోడు ఇంకా తెలంగాణలో పుట్టలేదు' అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్ నాంపల్లిలోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. తాను రేవంత్ రెడ్డిలా పది పార్టీలు మారలేదని, తన పుట్టుక, చావు బిజెపిలోనేనని స్పష్టం చేశారు. సిఎం తాటాకు చప్పుళ్లకు భయపడే ప్రసక్తే లేదన్నారు. ఏ అంశంపై ఎక్కడైనా చర్చకు సిద్ధమని సవాల్ విసిరారు. ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను, దళితులు, బిసిలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుంటే రేవంత్ రెడ్డి ఇంటిని ప్రజలు ముట్టడిస్తారని కిషన్ రెడ్డి హెచ్చరించారు. నగరంలోని కార్పొరేట్ పాఠశాలలు, ఇంజనీరింగ్ కాలేజీల్లో డ్రగ్స్ సంస్కృతి చాపకింద నీరులా విస్తరిస్తోందని కిషన్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. బస్తీల్లో పర్యటించినప్పుడు మహిళలు సైతం దీనిపై తనకు ఫిర్యాదు చేస్తున్నారని తెలిపారు.
యువశక్తి మత్తుకు బానిసై నిర్వీర్యమైతే దేశానికే ప్రమాదమన్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అలర్ట్‌గా ఉండి సమాజాన్ని చైతన్యం చేయాలని పిలుపునిచ్చారు. యువత డ్రగ్స్ బారిన పడకుండా ఉండేందుకు యోగా ఎంతో దోహదపడుతుందని, ఇందుకోసం ఈనెల 20న ఎల్.బి. స్టేడియంలో భారీ ఎత్తున 'యోగా డే కౌంట్‌డౌన్' నిర్వహిస్తున్నట్లు కిషన్ రెడ్డి తెలిపారు. ఈ సమావేశంలో బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతం రావు పాల్గొన్నారు.

# కవిత ఆరోపణలు అబద్ధం

ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కల్వకుంట్ల కవిత చేస్తున్న లక్ష కోట్ల భూ దోపిడీ ఆరోపణలు పూర్తిగా అబద్ధాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ స్పష్టం చేశారు. శనివారం సిఎల్‌పి కార్యాలయంలో మీడియాతో ఆయన మాట్లాడుతూ, కెసిఆర్ పాలనలో జరిగిన భూ కబ్జాలు, అవినీతి విషయాలపై కవితనే సమాధానం చెప్పాలని అన్నారు. బిఆర్‌ఎస్‌లో అవినీతికి కిటికీలు తెరిచారంటున్న కవిత అందులో ఆమె వాటా ఎంతో చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ భూములు, చెరువులు కబ్జాల నుంచి రక్షించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, 50 వేల కోట్ల రూపాయల విలువైన భూములను హైడ్రా కాపాడిందని తెలిపారు. ప్రభుత్వ భూముల రక్షణలో సిఎం రేవంత్ రెడ్డి కీలకంగా పనిచేస్తున్నారని ప్రశంసించారు.రేవంత్ రెడ్డి కుటుంబంపై కవిత చేస్తున్న ఆరోపణలకు సంబంధించి ఆధారాలు ఉంటే ప్రభుత్వానికి లేదా సంబంధిత అధికారులకు ఇవ్వాలని సూచించారు. గత ప్రభుత్వ నిర్ణయాలపై కూడా విమర్శలు చేస్తూ, కృష్ణా జలాల ఒప్పందాల్లో తెలంగాణ ప్రయోజనాలను దెబ్బతీసిన నిర్ణయాలకు బిఆర్‌ఎస్ నాయకులే బాధ్యత వహించాలని అన్నారు.తుమ్మిడిహట్టి ప్రాజెక్టు, కాళేశ్వరం వంటి అంశాలపై కూడా మాజీ ప్రభుత్వంపై ప్రశ్నలు ఉన్నాయని పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమాన్ని సమానంగా ముందుకు తీసుకెళ్తోందని ఆయన తెలిపారు.

# విద్యుత్ అవసరాలకు అనుగుణంగా విస్తరణ

డిమాండ్ పెరిగినా కోతలు లేవు

20వేల మెగావాట్ల గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తే లక్ష్యం

విద్యుత్ ఉప కేంద్రాన్ని ప్రారంభించిన ఉప ముఖ్య-మంత్రి, మంత్రి తుమ్మల



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** పెరుగుతున్న విద్యుత్ అవసరాలకు అనుగుణంగా విద్యుత్ రంగంలో మౌలిక వసతులను నిరంతరం విస్తరిస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి పదంలో ముందుకు తీసుకెళ్తున్నామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టివిక్రమార్క తెలిపారు. ఆదివారం ఖమ్మం నగరంలోని పాకబండ వద్ద ఎన్‌పిడిసిఎల్ ఆధ్వర్యంలో నిర్మించిన 33/11 కెవి విద్యుత్ ఉప కేంద్రాన్ని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, కలెక్టర్ దివాకర టిఎస్‌తో కలిసి ప్రారంభించారు. విద్యుత్ ఉప కేంద్రంలోని కంట్రోల్ రూమ్ ఆధునీక పరికరాలను పరిశీలించిన ఉప ముఖ్యమంత్రికి అధికారులు సాంకేతిక వివరాలను వివరించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క మాట్లాడుతూ ఆధునీక, సాంకేతిక పరిజ్ఞానంతో ఈ ఉప కేంద్రాన్ని నిర్మించడం జరిగిందని కంట్రోల్ రూమ్ నుంచే నిర్వహించేవిధంగా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.
గతంతో పోలిస్తే ఖమ్మంజిల్లాలో విద్యుత్ డిమాండ్ గణంగా పెరిగినప్పటికీ వ్యవసాయం, పరిశ్రమలు, గృహ అవసరాలు సహా అన్ని రంగాలకు ఎలాంటి కోతలు లేకుండా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తున్నామన్నారు. 2023లో రాష్ట్రం పీక్ డిమాండ్ 15వేల మెగావాట్లు ఉండగా ప్రస్తుతం 18548 మెగావాట్లకు పెరిగిందన్నారు. మూసి పునర్జీవనం, ఫ్యూచర్ సిటీ, పరిశ్రమలు, ఫార్మసిటీ, డేటా సెంటర్లు, వ్యవసాయ రంగ విస్తరణ వంటి కారణాలతో భవిష్యత్తులో విద్యుత్ అవసరాలు మరింత పెరుగుతాయని తెలిపారు. దీనిని దృష్టిలోఉంచుకుని ప్రభుత్వం గ్రీన్ ఎనర్జీ రంగంపై ప్రత్యేక దృష్టిసారించి 2030 నాటికి 20వేల మెగావాట్ల పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తే లక్ష్యంగా పని చేస్తుందన్నారు. రాష్ట్రంలో 85 గ్రామాలను పూర్తి స్థాయి సోలార్ గ్రామాలుగా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని, బోనకల్ మండలంలో సోలార్ ఆధారిత విద్యుత్ వినియోగాన్ని ప్రోత్సహిస్తున్నామని తెలిపారు.
ఇందిరా గిరి జల వికాస పథకం క్రింద సుమారు ఆరులక్షల ఎకరాలకు సోలార్ పంపుసెట్ల ఏర్పాటు కోసం ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. రాష్ట్రంలో 30 లక్షల వ్యవసాయ పంపు సెట్లకు ప్రభుత్వం ప్రతి నెల రూ.1150 కోట్ల సబ్సిడీ అందిస్తుందన్నారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ ఖమ్మం నగరం వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా మరిన్ని ఉప కేంద్రాలు, ట్రాన్స్‌మిషన్ లైన్లు, డిస్ట్రిబ్యూషన్ వ్యవస్థాలను బలోపేతం చేయాలని అధికారులకు సూచించారు. అభివృద్ధి పనులకు ఆటంకంగా ఉన్న విద్యుత్ స్తంభాల తరలింపును వేగవంతం చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ ఆధీనంలో ఖాళీగా ఉన్న భూముల్లో సోలార్ విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుపై కార్యాచరణ రూపొందించాలని సూచించారు.
కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ ఖమ్మం నగరంలో విద్యుత్ వినియోగం నిరంతరం పెరుగుతున్న నేపథ్యంలో భవిష్యత్తు 30 సంవత్సరాల అవసరాలను దృష్టిలో ఉంచుకుని విద్యుత్, మౌలిక వసతులను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి, ఖమ్మం మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, సుడా ఛైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ ఎండి ఖాదర్‌బాబా, మాజీ మేయర్ పునుకొల్లు నీరజ, ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# నీటి హక్కుల విషయంలో రాజీపడబోం

బిఆర్‌ఎస్‌ఎల్‌పి ఉప నాయకుడు తన్నీరు హరీశ్‌రావు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పోలవరం కావేరీ అనుసంధానాన్ని వ్యతిరేకిస్తూ శాసనసభలో తీర్మానం చేసి, ఢిల్లీలో ధర్నాలు చేయాలని, బిఆర్‌ఎస్‌ఎల్‌పి ఉప నాయకుడు తన్నీరు హరీశ్‌రావు డిమాండ్ చేశారు. గోదావరి కావేరీ ప్రాజెక్ట్‌కు పాలమూరు ప్రాజెక్టుకు లింకుపెట్టడమంటేనే తెలంగాణ జల హక్కులను కాలరాయడమని మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్రానికి ట్రిబ్యునల్ ద్వారా సంక్రమించిన నీటి హక్కుల విషయంలో రాజీపడబోమని స్పష్టం చేశారు.
హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో శాసనమండలిలో ప్రతిపక్ష నేత మదుసూదనాచారి, బిఆర్‌ఎస్ మాజీ మంత్రులు సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, గంగులకమలాకర్, ఎంపి వద్దిరాజు రవిచంద్ర, ఎంఎల్‌సి దాసోజుశ్రవణ్, ఎంఎల్‌ఎలుc డాక్టర్ కల్వకుంట్ల సంజయ్, చింత ప్రభాకర్‌తో కలిసి హరీశ్‌రావు మాట్లాడుతూ బనకచర్ల, నల్లమల సాగర్ ప్రాజెక్ట్ విఫలమవ్వడంతోనే ప్రస్తుతం గోదావరి కావేరి నదీ అనుసంధానం ప్రాజెక్టు పేరుతో ముందుకొచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు.
ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర భూభాగాన్ని తాకకుండా కావేరికి నీళ్లు తీసుకుపోయే కుట్ర చేస్తున్నారన్నారు. తద్వారా గోదావరి నుంచి నేరుగా ఎపికి నీళ్లు వెళ్తాయని,దీంతో సమ్మక సాగర్ ప్రాజెక్ట్ 47 టిఎంసిల నీటినీ తెలంగాణ వదులుకోవాల్సి వస్తుందన్నారు.



# జగమెరిగిన ఉద్యమ యోధుడు...
# చంద్ర రాజేశ్వరరావు చిరస్మరణీయుడు

సి.ఆర్.ఫౌండేషన్ గౌరవాధ్యక్షుడు డాక్టర్ కె.నారాయణ

కొండాపూర్‌లోని సి.ఆర్ 112వ జయంతి సందర్భంగా ప్రముఖులు ఘనంగా నివాళులు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కొండాపూర్‌లోని చంద్ర రాజేశ్వర్‌రావు (సి.ఆర్) ఫౌండేషన్‌లో ఆదివారం దివంగత సిపిఐ అగ్రనేత చంద్ర రాజేశ్వరరావు 112వ జయంతి ఘనంగా జరిగింది. సి.ఆర్. ఫౌండేషన్‌లో చంద్ర రాజేశ్వరరావు (సి.ఆర్) విగ్రహానికి సిపిఐ కంట్రోల్ కమిటీ చైర్మన్, సి.ఆర్.ఫౌండేషన్ గౌరవాధ్యక్షుడు డాక్టర్ కె.నారాయణ, సైబరాబాద్ మునిసిపల్ కమిషనర్ సృజన ఐ.ఎ.ఎస్ తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. డాక్టర్ కె.నారాయణ ప్రసంగిస్తూ జగమెరిగిన ఉద్యమయోధుడు, నిబద్ధత కలిగిన కమ్యూనిస్టునేత, మహా మనీషి, జన హృదయ నేత దివంగత చంద్ర రాజేశ్వరరావు చిరస్మరణీయుడన్నారు.
కమ్యూనిస్టు పార్టీ ఉద్యమంలో, భారత జాతీయ స్వాతంత్ర ఉద్యమంలో, భూస్వామ్య వ్యవస్థను నిర్మూలించడంలోనూ చంద్ర రాజేశ్వరరావు నిర్వహించిన పాత్ర ప్రముఖమైనదని, రాజ్యాంగ, ప్రజాస్వామ్య, లౌకికవాద రక్షణకు, దేశ సమైక్యతకు అలుపెరుగని కృషి చేసిన ఒక గొప్ప మానవతావాది అని శ్లాఘించారు. మూడు దశాబ్దాల క్రితం ప్రారంభించబడిన సి.ఆర్. ఫౌండేషన్ సేవా కార్యక్రమాలు ప్రశంసించదగినవన్నారు.హైదరాబాద్‌లో ఉన్న ఓల్డ్ ఏజ్‌హోమ్ దేశంలోనే అత్యంత పేరు ప్రతిష్ఠలు సముపార్జించిందన్నారు. ఇందులో 150 మంది సీనియర్ సిటీజన్లకు ఆశ్రయం కల్పించడం జరిగిందన్నారు. సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ సృజన మాట్లాడుతూ చంద్ర రాజేశ్వరరావు దేశం గర్వించదగిన మహోన్నత నాయకుడని, ఆయన ప్రజల కోసం ఎన్నో త్యాగాలు చేశారని, ఆయన పేరిట నిర్వహింపబడుతోన్న చంద్ర రాజేశ్వర్ రావు ఫౌండేషన్ ఫర్ సోషల్ ప్రోగ్రెస్ చేస్తున్న సామాజిక సేవలు కొనియాడదగినవన్నారు.
ఈ కార్యక్రమంలో సి.ఆర్. ఫౌండేషన్ ఉపాధ్యక్షుడు కె.అజయ్‌కుమార్, కార్యదర్శి చెన్నమనేని వెంకటేశ్వరరావు, కోశాధికారి చెన్నకేశవరావు, ఆరోగ్య కేంద్రం డైరెక్టర్ డాక్టర్.కె.రజిని, మహిళా సంక్షేమ కేంద్రం డైరెక్టర్ జోశ్యభట్ల కల్పన, వృద్ధాశ్రమ సలహా కమిటీ సభ్యులు తమ్మారెడ్డి తాన్య, యన్. రాజేంద్రరావు, మల్లంపాటి వెంకటేశ్వరరావు, సాంబశివరావు, అరుణకుమారి, మహిళా సంక్షేమ కేంద్రం సభ్యులు వి.లలిత, ఆరుట్ల మమత, డి.కృష్ణకుమారి, వంకా లక్ష్మి, పాలి క్లినిక్ సిఇఒ విజయ, సిఇఒ డి.శ్రీనివాస్, సిపిఐ తెలంగాణ రాష్ట్ర సమితి సభ్యులు రామకృష్ణ, శేరిలింగంపల్లి కార్యదర్శి చందుయాదవ్, ఎన్.ఆర్.ఆర్ సెంటర్ సభ్యులు డి.జవహర్ బాబు, వృద్ధాశ్రమ వాసులు, విద్యార్థినులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.




## గ్యాస్ సిలిండర్ ధర పెంపు
# వెంటనే ఉపసంహరించాలి : సిపిఐ(ఎం)

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** గృహ వినియోగ గ్యాస్ సిలిండర్ పై రూ.29 పెంచడం అన్యాయమని, కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని సిపిఐ(ఎం) తెలంగాణ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ పెంపు సామాన్య ప్రజలపై అదనపు భారం మోపుతుందని పార్టీ రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ అన్నారు. ఇప్పటికే పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు పెరిగి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆయన పేర్కొన్నారు.ఇంధన కొరత లేకపోయినా ధరలు పెంచడం సరైంది కాదని, ఇది ప్రజలపై భారాలు మోపే విధానమని విమర్శించారు. హైదరాబాద్‌లో గ్యాస్ సిలిండర్ ధర దాదాపు రూ.1000కు చేరడం ఆందోళనకరమని తెలిపారు. పెంచిన ధరను వెంటనే ఉపసంహరించుకోవాలనిడిమాండ్ చేశారు.

**విద్యార్థిని ఇందు మృతి ఘటనపై చర్యలు తీసుకోవాలి :** గద్వాల ప్రభుత్వ ఆసుపత్రి వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే ఎర్రవల్లి గ్రామానికి చెందిన నీట్ విద్యార్థిని ఇందు మృతి చెందిందని సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ ఆరోపించారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులైన వైద్యులను తొలగించాలని, ఆసుపత్రి సూపరింటెండెంట్‌ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా, ప్రభుత్వ ఉద్యోగం, ఇల్లు, ఐదు ఎకరాల భూమి కేటాయించి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఘటనపై ఆందోళన చేస్తున్న కుటుంబ సభ్యులు, సిపిఐ(ఎం) నాయకులను పోలీసులు అరెస్టు చేయడాన్ని ఖండిస్తూ, వారిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

# ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై బిజెపి పోరుబాట

బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు బిజెపి కార్యాచరణ సిద్ధం చేసింది. హైదరాబాద్ నాంపల్లిలోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో పార్టీ పదాధికారుల సమావేశం జరిగింది. రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ అభయ్ పాటిల్, సంస్థాగత ఇన్‌చార్జ్ చంద్రశేఖర్ తివారీల సమక్షంలో జరిగిన ఈ భేటీకి రాంచందర్ రావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'రైతు గోసబిజెపి భరోసా' ఉద్యమంతో ప్రభుత్వం దిగివచ్చిందన్నారు. అదే స్ఫూర్తితో విద్యార్థుల సమస్యలపై కూడా గట్టిగా పోరాడుతామన్నారు.

# గచ్చిబౌలి ఘటనపై న్యాయ విచారణ జరపాలి : ఎఐవైఎఫ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** గచ్చిబౌలిలోని ఎలైట్ కోలివింగ్ హాస్టల్‌లో యువతి దుర్గ మృతి ఘటనపై సమగ్ర న్యాయ విచారణ జరపాలని ఎఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర డిమాండ్ చేశారు. ఈ ఘటన కోలివింగ్ హాస్టళ్లలో భద్రతా లోపాలను బయటపెట్టిందని ఆయన అన్నారు. ఉద్యోగాలు, విద్య కోసం నగరాలకు వచ్చే యువతకు సురక్షిత వసతి కల్పించాల్సిన ప్రభుత్వాలు, ప్రైవేట్ హాస్టళ్లపై సరైన నియంత్రణ తీసుకురావడంలో విఫలమయ్యాయని విమర్శించారు. హైదరాబాద్‌లో పెద్ద సంఖ్యలో నడుస్తున్న కోలివింగ్ హాస్టళ్లలో భద్రతా ప్రమాణాలు, మహిళల రక్షణ చర్యలు, అత్యవసర సౌకర్యాలు లేకపోవడం ఆందోళనకరమని పేర్కొన్నారు. యువత అవసరాలను వ్యాపారంగా మార్చే ధోరణిని అరికట్టాలని, ప్రభుత్వ హాస్టళ్లు, వర్కింగ్ ఉమెన్స్ హాస్టళ్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. దుర్గ మృతి ఘటనలో హాస్టల్ నిర్వహణ, భద్రతా ప్రమాణాలు, అధికారుల పర్యవేక్షణపై పూర్తి స్థాయి విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కల్లూరు ధర్మేంద్ర కోరారు.

## పెంచిన ధరలను నిరసిస్తూ 10న జిల్లా కలెక్టరేట్ల ముట్టడి

సిపిఐ మల్కాజిగిరి మండల కార్యదర్శి కాసర్ల నాగరాజు

**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను నిరసిస్తూ 10న తలపెట్టిన జిల్లా కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సిపిఐ మల్కాజిగిరి మండల కార్యదర్శి కాసర్ల నాగరాజు ఓ ప్రకటనలో కోరారు. కార్పొరేట్ల సేవలో ఉన్న ప్రధాని మోదీ సామాన్య ప్రజల బాధలను పట్టించుకొనే స్థితిలో లేదని విమర్శించా రు. మరో పక్క రాష్ట్ర ప్రభుత్వం గత రెండున్నరేళ్ల కాలంలో హామీలను నెరవేర్చటంలో విఫలమైందని, ఇకనైనా హామీలను ప్రజలకు చేరవేయాలని సూచించారు.

## ఉచిత వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి: కొలను



**ప్రజాపక్షం/ నిజాంపేట్ :** ఉచిత వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మాజీ కార్పొరేటర్ కొలను వీరేందర్ రెడ్డి అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని నిజాంపేట్ సర్కిల్, బాచుపల్లి, క్రాంతినగర్‌లో బికెఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సిఎంఆర్ ఆసుపత్రి సహకారంతో ఉచిత మెగా వైద్య శిభిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి మాజీ కార్పొరేటర్ కొలను వీరేందర్ రెడ్డి, బికెఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు కిషోర్ రెడ్డిలు విచ్చేసి వైద్య శిభిరాన్ని ప్రారంభించారు. చికిత్స చేయించుకున్న వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఆదివారం ఉదయం తొమ్మిది గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు స్థానిక ప్రజలకు ఉచితంగా అన్ని రకాలైన వైద్య సేవలను, చికిత్సలను నిర్వహించారు. ఈ సందర్భంగా కొలను వీరేందర్ రెడ్డి, కిషోర్ రెడ్డిలు మాట్లాడుతూ మురికి వాడలలో, నిరుపేదలు నివసించే వారికి ఇలాంటి ఉచిత వైద్య సేవలను అందించడం సంతోషకరమన్నారు.ప్రజలు ఇలాంటి ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నిజాంపేట్ సర్కిల్ ప్రధాన కార్యదర్శి కొలను జీవన్ రెడ్డి, జిల్లా యువజన కాంగ్రెస్ కార్యదర్శి కొలను బాల్ రెడ్డి, కాలనీ వాసులు పాల్గొన్నారు.

## పార్టీని మరింత బలోపేతం చేయాలి



**ప్రజాపక్షం/చర్లపల్లి :** పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేసి పార్టీని మరింత బలోపేతం చేయాలని మల్కాజ్‌గిరి పార్లమెంటు ఇన్‌చార్జ్ రాగిడి లక్ష్మారెడ్డి, మేడ్చల్ నియోజకవర్గం ఇన్‌చార్జ్ మహేందర్‌రెడ్డిలు అన్నారు. మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నాగారం, దమ్మాయిగూడ, కీసర డివిజన్ల బిఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ల్యాండ్‌మార్క్ కన్వెన్షన్‌లో నిర్వహించిన సభ్యత్వ నమోదు, సర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వారు హాజరై ప్రసంగిస్తు పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త సమిష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. సభ్యత్వ నమోదు కార్యక్రమం పార్టీ విస్తరణకు కీలకమని,సర్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కల్గి ఉండాలని వారు అన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ ప్రణీతశ్రీకాంత్‌గౌడ్,నాయకులు తేళ్ల శ్రీధర్, నిమ్మల శ్రీనివాస్,అనంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సిఐఎఫ్ ఆధ్వర్యంలో 'సండే ఆన్ సైకిల్'



**ప్రజాపక్షం/చర్లపల్లి :** హైదరాబాద్ ఎన్‌ఎఫ్‌సి సిఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో ప్రపంచ సైకిల్ దినోత్సవాన్ని పురస్కరించుకుని సండే ఆన్ సైకిల్ కార్యక్రమాన్ని కుషాయిగూడ ఇసిఐఎల్ చౌరస్తా, డిఎఇ కాలనీ మీదుగా 15 కిలో మీటర్లు నిర్వహించారు. ఈ సైకిల్ ర్యాలీలో కమాండెంట్ శంకరరావు బైరెడ్డి, డిప్యూటీ కమాండెంట్ జై శంకర్‌సింగ్‌లు మాట్లాడుతూ శారీరక దృఢత్వం,ఆరోగ్యకర జీవనశైలి,క్రీడా స్ఫూర్తి,పరస్పర స్నేహభావాన్ని పెంపొందించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్ధేశ్యమని అన్నారు.ఈ కార్యక్రమంలో 100 మంది సిబ్బంది,50 మంది కుటుంబ సభ్యులు,150 చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

## బాబాగూడలో నీటి సమస్య పరిష్కారం



**ప్రజాపక్షం/శామీర్‌పేట:** ప్రజల దాహార్తిని తీర్చడానికి అయ్యన్నగారి లక్ష్మారెడ్డి ముందుకు వచ్చి బోర్ మోటార్‌ను విరాళంగా అందజేశారు. శామీర్‌పేట డివిజన్ బాబాగూడలోని ఎస్‌సి కాలనీలోని మినీ ఫంక్షన్ హాల్‌లో నీటి సమస్యతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అదే గ్రామానికి చెందిన సందని ఆనంద్ ఇట్టి సమస్యపై దృష్టి సారించి బొమ్మరాశిపేటకు చెందిన అయ్యన్నగారి లక్ష్మారెడ్డిని ఆశ్రయించి సమస్యను వివరించాడు. దీంతో స్పందించిన లక్ష్మారెడ్డి కొత్త బోర్‌మోటార్‌ను విరాళంగా అందజేసి బిగించారు. నీటి సమస్య తీర్చిన లక్ష్మారెడ్డికి ఎస్‌సి కాలనీ ప్రజలు ధ్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పంబలి అశోక్, రాచకొండ గణేష్, నక్క మనోహార్ తదితరులు పాల్గొన్నారు.

## సంపూర్ణ మధ్యపాన నిషేధం ఏకగ్రీవ తీర్మాణం

**ప్రజాపక్షం /వికారాబాద్ :** ధన్నారంలో సంపూర్ణ మధ్యపాన నిషేదం వికారాబాద్ మున్సిపల్ లోని 2వ వార్డు ధన్నారం గ్రామంలో మద్యం మహమ్మారిని తరిమికొట్టేందుకు గ్రామస్తులంతా ఏకమయ్యారు. అమ్మితే రూ.5లక్షల, కొంటే రూ.2లక్షలు జరిమానా గ్రామస్తుల ఏకగ్రీవ తీర్మానం చేసి సంతకాల సేకరణ పూర్తి చేశారు. విచ్చలవిడి మద్యం అమ్మకాలతో యువత పక్కదారి పడుతుండటం ,మత్తు పదార్థాలకు బానిసై కొందరు ప్రాణాలు కోల్పోయిన ఘటనల నేపథ్యంలో ఆదివారం గ్రామ సభలో కీలక తీర్మణం చేశారు. నేటి ధన్నారం గ్రామ పరిధిలో మధ్యం గుట్కా ,గంజాయి,ఇతర పదార్థాల అమ్మకాలు ,కొనుగోళ్లు ,సేవించడం పూర్తిగా నిషేదం అమల్లో ఉంటుందని అన్నారు. గ్రామంలో ని మహిళా సంఘాలు ,యువజన సంఘాలు ,రైతులు ,పెద్దలు అందరూ సంతకాలు చేసి ఈతీర్మానాన్ని ఏకగ్రీవంగా అమోదించారు. గ్రామంలో మధ్యం నిషేధం కోసం ఒక కమిటీ ఏర్పాటు చేశారు 24గంటలు నిఘాఉంటుందని తెలిపారు.ఈ తీర్మానాన్ని గ్రామంలో అక్రమ మధ్యం అరికట్టేందుకు ఎక్సైజ్‌పోలీస్ శాఖలు సహకరించాలని ,ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించాలని గ్రామస్తులు కోరారు.

# ఉద్యానానికి ఊతం

- వికారాబాద్ జిల్లా వ్యాప్తంగా ఉద్యాన పంటల సాగుపెంచే దిశగా చర్యలు
- 2026-27ఆర్థిక సంవత్సరానికి గాను దరఖాస్తుల స్వీకరణ
- పండ్లు, పూలు, కూరగాయల సాగుకు వర్తించేలా 80 నుండి 100% రాయితీతో స్ప్రింకర్లు, డ్రిప్‌పరికాలు





**ప్రజాపక్షం /వికారాబాద్ :** ఉద్యాన పంటల సాగు విస్తీర్ణం పెంచే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా తక్కువ ఖర్చుతో ఎక్కువ అదాయం వచ్చే పంటలపై రైతులకు అవగాహన కల్పిస్తోంది. రాష్ట్ర రాజధానికి దగ్గరగా ఉన్న వికారాబాద్ జిల్లా ఉద్యాన పంటలపై అధిక ప్రాధాన్యత ఉన్న నేపథ్యంలో ఆ శాఖ అధికారులు సాగు విస్తీర్ణం పెంచేందుకు రైతులను సంయుక్తం చేస్తున్నారు. హైదరాబాద్ వాసులకు కూరగాయల అవసరాలను 50 శాతం కూడా తీర్చలేకపోతున్నారు. రంగారెడ్డి, వికారాబాద్, సంగారెడ్డి, భువనగిరి, మెదక్‌జిల్లాలోని 50 శాతం లోపే పండిస్తున్నట్లు అధికారులు అంచ నా వేస్తున్నారు. మిగిలిన 50శాతం కూరగాయ లు పక్క రాష్టం ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర నుంచి నగరానికి దిగుమతి చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా రైతులను ప్రోత్సహించే దిశగా ప్రభుత్వం, జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా రైతాంగం దశాబ్ద కాలంగా ఉద్యాన పంటలపై కూరగాయలు, పూలు పండ్ల తోటల పెంపకంపై మొగ్గుచూపుతోంది. ప్రస్తుతం 49.495 ఎకరాల్లో ఉద్యానవన పంటలు సాగవుతుండగా ఇందులో 15.265 ఎకరాల్లో పండ్ల తోటలు, 27.125ఎకరాల్లో కూరగాయలు పండిస్తున్నారు. మరో 6.254 ఎకరాల్లో పసుపు, అల్లం, 851 ఎకరాల్లో పూల తోటలు సాగుచేస్తున్నారు. ఇతర జిల్లాలతో పోలిస్తే కూరగాయల సాగుకు అనువైన, సారవంతమైన భూములు మన జిల్లాలోనే ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఏటా ఉద్యాన పంటల సాగు విస్తీర్ణం పెంచి భవిష్యత్తులో రెండింతలు చేయాల నే ఆలోచనతో ముందుకు సాగుతున్నారు. ఇందులో భాగంగా యంత్ర పరికాలను 50 నుంచి 100శాతం రాయితీపై అందించాలని నిర్ణయించారు. రైతులకు 2026–27 సంవత్సరానికి గాను దరఖాస్తులు స్వీకరించాలని కలెక్టర్ అదేశించారు. ఉద్యాన పంటలను ప్రోత్సహించడానికి రాయితీ పరికలు అందజేస్తున్నారు. ఇందులో డ్రిప్ పరికరాలను పెద్ద రైతులకు 70 శాతం రాయితీపై, ఎస్‌సి, ఎస్‌టిలకు 90శాతం సన్నకారు రైతులకు 80శాతం రాయితీతో అందజేయాలని, అన్ని వర్గల రైతులకు 65శాతం రాయితీతో స్ప్రింకర్లు ఇవ్వాలని నిర్ణాయించారు. ఆర ఎకరానికి ఒక యూనిట్ చొప్పున రాయితీ వర్తిస్తుంది. రైతుల పొలాల్లో నీటి గుంటలు నిర్మించుకునేందుకు ఆర్థిక సహాయం అందించనుంది. గుంతలకు ప్లాస్టిక్ లెనింగ్ ఏర్పాటుకు 50శాతం రాయితీ ఇవ్వనుంది. ఉల్లి , పూలతోటల సాగుకు ఉద్యానవన శాఖ ఎకరానికి రూ.8 వేల అర్థిక సహ యం అందిస్తుంది. టమటా , మామిడికాయల రవాణా కు వినియోగించే ప్లాస్టిక్ ట్రేలను 50శాతం రాయితీపై అందిస్తారు. ఉద్యాన పంటలు సాగును ప్రోత్సహించాడానికి రైతులకు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ దీపక్‌తివారి అదేశించారు. అసక్తి ఉన్న రైతులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఉద్యానవన శాఖ అధికరి సత్తర్ తెలిపారు.

## ఆరోగ్యవంతమైన జీవనాన్ని ఆనందంగా గడపాలి





**ప్రజాపక్షం/శామీర్‌పేట :** ఆరోగ్యకరమైన జీవనాన్ని ఆనందంగా గడపాలని ప్రజల ఆరోగ్యం, సామాజిక చైతన్యం సామూహిక భాగస్వామ్యాన్ని పెంపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని అలియాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ కమతం శిరీషాకృష్ణారెడ్డి అన్నారు. ఆదివారం ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం హ్యాపీ సండే కార్యక్రమాన్ని చేపట్టింది. ఈ సందర్భంగా అలియాబాద్‌లో జడ్‌పి పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రజల ఆరోగ్యం, సాంస్కృతిక వికాసం, సామాజిక అవగాహన పెంపొందించడమే ప్రధాన లక్ష్యంగా వివిధ కార్యక్రమాలు చేపట్టారు.అనంతరం మున్సిపల్ చైర్ పర్సన్ శిరీషా కృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రజల భాగస్వామ్యంతోనే సమాజాభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకట్‌రెడ్డి, భారతీయ యోగా సంస్థ జనరల్ సెక్రటరి, యోగా గురువు రాజేందర్‌రెడ్డి, అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా రోహిత్ రెడ్డి జన్మదిన వేడుకలు



**ప్రజాపక్షం/నవాబుపేట్ :** నవాబుపేట మండల కేంద్రంలో బిఆర్‌ఎస్ పార్టీ మండల పాలకవర్గం ఆధ్వర్యంలో తాండూరు మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై కేక్ కట్ చేసి ఒకరికి ఒకరు తినిపించుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ప్రజా సమస్యల పరిష్కారంలో ఎల్లప్పుడూ ముందుండే నాయకుడు పైలెట్ రోహిత్ రెడ్డి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో శాంత కుమార్, పురుషోత్తం, నరేందర్ రెడ్డి, మహేష్ రెడ్డి, కడిచర్ల సుధాకర్, శ్రీకాంత్ గౌడ్, శేఖర్, బద్రి, మల్లేష్, వినోద్, మాణిక్ రెడ్డి, తలరీ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## కళాకారులకు నైపుణ్యాన్ని పెంపొందించే లక్ష్యంగా శిక్షణ

తెలంగాణా ప్రజా నాట్యమండలి గౌరవ అధ్యక్షుడు వై.రాజేశ్వరరావు



**ప్రజాపక్షం/జవహర్‌నగర్ :** మేడ్చల్ మల్కాజిగిరి జిల్లావ్యాప్తంగా కళాకారులకు నైపుణ్యాన్ని పెంపొందించే లక్ష్యంగా జులై మొదటి వారంలో జవహర్‌నగర్‌లో జిల్లా స్థాయి పాటలు, నాటికల శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని మేడ్చల్ జిల్లా తెలంగాణా ప్రజానాట్యమండలి గౌరవ అధ్యక్షులు వై.రాజేశ్వరరావు తెలిపారు. జవహర్‌నగర్‌లో ప్రజానాట్యమండలి కౌన్సిల్ సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ సమాజంలో నిత్యం ప్రజలెదుర్కొనే సమస్యలు, నేటి రాజకీయ పరిణామాలపై కళల ద్వారా చైతన్యం తెస్తామన్నారు. పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలు, మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలు, మాదక ద్రవ్యాల ప్రభావం లాంటి సామజిక అంశాలు ఇందులో ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా నాట్యమండలి జిల్లా కార్యదర్శి వి.వెంకటాచారి, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు నిమ్మల నర్సింహ, వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రవీణ్, వైస్ ప్రెసిడెంట్ భాస్కర్, జిల్లా సహాయ కార్యదర్శి బాబు, ఉపాధ్యక్షులు రాములు, రమాతర్, సైదమ్మ, నరసమ్మ, మణమ్మ తదితరులు పాల్గొన్నారు.

## నూతన కార్యవర్గం ఎన్నిక

**ప్రజాపక్షం/చర్లపల్లి :** చర్లపల్లి డివిజన్ పరిధిలోని లక్ష్మి ఫ్రైడ్ కాలనీ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.అధ్యక్షులుగా ఎం శ్రావణ్ కుమార్‌రెడ్డి,ప్రధాన కార్యదర్శిగా కె గోవర్ధన్‌రెడ్డి,ఉపాధ్యక్షులుగా పి యుగంధర్‌రెడ్డి,జాయింట్ సెక్రెటరీ సంతోష్‌గుప్తా,కోశాధికారిగా నర్సింహారెడ్డి,సభ్యులుగా వెంకట్‌రెడ్డి,మల్లారెడ్డి,డి మల్లారెడ్డి,కో రాంమోహన్,జంగారెడ్డి, పి. భరత్ రెడ్డిలను ఎన్నుకున్నారు. ఎలక్షన్ ఆఫీసర్స్‌లుగా లక్ష్మారెడ్డి, రామకృష్ణారెడ్డి,లు వ్యవహరించారు.ఈ కార్యక్రమంలో సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## ఉప్పల్ బిఆర్‌ఎస్‌లో భగ్గుమన్న అసంతృప్తి

ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిపై సీనియర్ నేతల తిరుగుబాటు స్వరం

అధిష్ఠానం జోక్యం చేసుకోవాలని డిమాండ్



**ప్రజాపక్షం/ఉప్పల్ :** ఉప్పల్ నియోజకవర్గ బిఆర్‌ఎస్‌లో అంతర్గత విభేదాలు బహిర్గతమయ్యాయి. ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి వ్యవహార శైలిపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ ఉప్పల్ డివిజన్‌కు చెందిన పలువురు బిఆర్‌ఎస్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు సమావేశమై అధిష్ఠానం తక్షణమే జోక్యం చేసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సీనియర్ నాయకులు అరటికాయల భాస్కర్, సంతోష్ రెడ్డి, టంటం వీరేశ్, అన్య వెంకటేష్, సత్యపాల్ రెడ్డి, వేముల వెంకట్ రెడ్డి తదితరులు మాట్లాడుతూ పార్టీ శ్రేణులను కలుపుకుపోవడంలో ఎమ్మెల్యే పూర్తిగా విఫలమయ్యారని ఆరోపించారు. బిఆర్‌ఎస్‌ను బలోపేతం చేయాల్సిన ప్రజాప్రతినిధి కాంగ్రెస్ పార్టీకి రాజకీయంగా లబ్ధి చేకూరేలా వ్యవహరిస్తున్నారనే అభిప్రాయం క్షేత్రస్థాయిలో బలపడుతోందన్నారు. ఉప్పల్ డివిజన్‌లో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పాల్గొనడం లేదని, ప్రజల సమస్యలు, పార్టీ కార్యకర్తల ఇబ్బందులను పట్టించుకోవడం లేదని విమర్శించారు. దీంతో పార్టీ నాయకులు, కార్యకర్తలు తీవ్ర నిరాశకు గురై పార్టీని వీడే పరిస్థితులు ఏర్పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే పరిస్థితి కొనసాగితే ఉప్పల్‌తో పాటు ఇతర డివిజన్లలో కూడా పార్టీకి తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని హెచ్చరించారు. అభివృద్ధి కార్యక్రమాల్లో బిఆర్‌ఎస్ నాయకుల కంటే కాంగ్రెస్ నాయకులకే అధిక ప్రాధాన్యత లభిస్తోందని, నియోజకవర్గంలోని అన్ని డివిజన్లలో కాంగ్రెస్‌కు అనుకూల వాతావరణం కల్పించే విధంగా ఎమ్మెల్యే వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ డివిజన్ కమిటీలను రద్దు చేసినప్పటికీ, అధిష్ఠానం నిర్ణయాలను పక్కనబెట్టి తనకు అనుకూల వ్యక్తులకు డివిజన్ అధ్యక్ష పదవులు కట్టబెడుతున్నారని విమర్శించారు. పార్టీతో సంబంధం లేని వ్యక్తులకు ప్రాధాన్యత ఇవ్వడం వల్ల కార్యకర్తల మనోభావాలు దెబ్బతింటున్నాయని పేర్కొన్నారు. మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ నూతన కార్యాలయ భవన నిర్మాణ భూమిపూజ కార్యక్రమానికి ఏర్పాటు చేసిన బ్యానర్లలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రాలకు ప్రాధాన్యత ఇచ్చి, కెసిఆర్, కెటిఆర్ చిత్రాలను విస్మరించడం పార్టీ శ్రేణులకు తప్పుడు సంకేతాలు పంపే చర్య అని నాయకులు విమర్శించారు. రానున్న రోజుల్లో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డితో సంబంధం లేకుండానే పార్టీ బలోపేతం కోసం పనిచేస్తామని, ఎమ్మెల్యే వ్యవహార శైలిపై పూర్తి వివరాలను కెటిఆర్ దృష్టికి తీసుకెళ్తామని సీనియర్ నాయకులు స్పష్టం చేశారు. పార్టీని కాపాడాలనే ఉద్దేశంతోనే ఈ సమావేశం నిర్వహించామని పేర్కొంటూ, ఉప్పల్‌లో నెలకొన్న పరిస్థితులపై బిఆర్‌ఎస్ అధిష్ఠానం వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పాల్గొన్న పలువురు కార్యకర్తలు కూడా ఎమ్మెల్యే తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.

## ప్రతి ఆదివారం ప్రజాయాత్ర - ప్రజాసమస్యల పరిష్కారమే ఎజెండా

మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి



**ప్రజాపక్షం/బోడుప్పల్ :** మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పీర్జాదిగూడ డివిజన్ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకునేందుకు బిఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రజా పర్యటన నిర్వహించారు. మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొని పీర్జాదిగూడ ఓల్డ్ విలేజ్ గుట్ట, డబుల్ బెడ్రూమ్ సముదాయం ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి ప్ర జలతో మాట్లాడారు. ఈ సందర్భంగా కాలనీవాసులు తీవ్ర తాగునీటి సమస్యను నాయకుల దృష్టికి తీసుకువచ్చారు. వారానికి ఒకటి లేదా రెండు సార్లు మాత్రమే నీరు వస్తోందని, వచ్చినా తక్కువ ఒత్తిడితో సరఫరా కా వడంతో అవసరాలకు సరిపోవడం లేదని మహిళలు వా పోయారు. చాలామంది తాగునీటి కోసం ప్రైవేట్ ట్యాం కర్లపై ఆధారపడాల్సి వస్తోందని, దీంతో అదనపు ఆర్థిక భారం పడుతోందని తెలిపారు. అలాగే కొన్ని గల్లిలలో రోడ్డు నిర్మాణం, డ్రైనేజీ సమస్యలతో పాటు రోడ్ల మధ్య లో ఉన్న విద్యుత్ స్తంభాల వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని, వాటిని వెంటనే తొలగించాలని స్థానికులు కోరారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు బిల్లులు రాక నిలిచిపోయాయని అప్పులు తెచ్చి అద్దె కట్టుకునే పరిస్థితి వచ్చిందని పలువురు తమ గోడును వెళ్లబోసుకున్నారు. ఈ సందర్భంగా మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి మాట్లాడుతూ పీర్జాదిగూడ గుట్టపై సుమారు 50 ల ల లీటర్ల సామర్థంతో భారీ నీటి రిజర్వాయర్‌ను నిర్మిం చి భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని మౌలిక వసతులు కల్పించినప్పటికీ, ప్రస్తుతం ప్రజలకు సక్రమంగా నీటి సరఫరా అందకపోవడం బాధాకరమన్నారు. ఇంతటి మౌలిక సదుపాయాలు ఉన్నప్పటికీ ప్రజలు మంచినీటి కోసం ఇబ్బందులు పడాల్సి రావడం సంబంధిత అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని ఆయన విమర్శించారు. వెంటనే నీటి సరఫరా వ్యవస్థలో ఉన్న లోపాలను గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని, ప్రతి ఇంటికి క్రమం తప్పకుండా స్వచ్ఛమైన తాగునీరు అందేలా అధికారులు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ కొల్తూరి మహేష్ మాట్లాడుతూ, ప్రజా సమస్యలను నేరుగా తెలుసుకుని వాటి పరిష్కారం కోసం సంబంధిత అధికారులపై ఒత్తిడి తీసుకురావడమే ఈ ప్రజా పర్యటన ముఖ్య ఉద్దేశమని తెలిపారు. తాగునీ రు, రోడ్లు, విద్యుత్, డ్రైనేజీ, పారిశుద్ధ్యం వంటి సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి త్వరితగతిన పరిష్కారం అయ్యేలా కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు దొంతిరి హరిశంకర్ రెడ్డి, సీనియర్ నాయకులు లేతాకుల రఘుపతి రెడ్డి, మహిళా అధ్యక్షురాలు నిర్మల, మైనార్టీ అధ్యక్షులు జిలాని పాషా, ఆకుల మధుకర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# నిజాంపేట్‌లో భారీ భూ కుంభకోణం

- కోట్లాది రూపాయల విలువైన ప్రభుత్వ భూమి హాంఫట్
- చిన్న పాటి కోర్టు ఆర్డర్.. ఎన్‌ఎంసి, హెచ్‌ఎండిఎ అనుమతులు..
- ప్రారంభమైన నిర్మాణం.. ఎకరం ప్రభుత్వ భూమిని మింగేసేందుకు స్కెచ్
- స్పందించిన బాచుపల్లి మండల రెవెన్యూ అధికారులు
- ఇద్దరిపై కేసు నమోదు చేసిన తహసీల్దార్



**ప్రజాపక్షం/నిజాంపేట్ :** నిజాంపేట్‌లో భారీ భూ కుంభకోణానికి తెరలేపారు. ఏకంగా ఎకరం పైగా ప్రభుత్వ భూమిని మింగేసేందుకు భూ బకాసురులు పకడ్బందీ ప్లాన్‌ని రచించారు. చిన్న పాటి కోర్టు ఆర్డర్‌తో ఏకంగా హెచ్‌ఎండిఎ, అప్పటి నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ అనుమతులను చూపిస్తూ యథేచ్ఛగా నిర్మాణాలను ప్రారంభించారు. ఇదేమిటని ప్రశ్నిస్తే కోర్టు ఆర్డర్ ఉందని, ఇంటి నెంబర్లు ఉన్నాయంటూ బుకాయిస్తూ ప్రభుత్వ స్థలాన్ని కాజేసేందుకు పన్నాగం రచించారు. ఇది మరెక్కడో మారు మూల గ్రామం అనుకుంటే పప్పులో కాలు వేసినట్లే. మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా, కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, బాచుపల్లి మండలంలోని నిజాంపేట్‌లో భూ బకాసురుల కబ్జా కహాని. నిజాంపేట్ సర్వేనంబరు 233/1లోని దాదాపు రెండెకరాలకు పైగా ప్రభుత్వ భూమి ఉంది. ఇందులో గతంలో నిర్మించిన ఒకటి అర గదులను నిర్మించిన కొందరు వ్యక్తులు గ్రామ పంచాయతీ హయాంలో ఇంటి నెంబర్లను సంపాదించారు. అట్టి నిర్మాణాలను అప్పట్లోనే రెవెన్యూ అధికారులు కూల్చివేశారు. ఇంటి నెంబర్లని ఆధారం చేసుకున్న సదరు వ్యక్తులు ఏకంగా రెండెకరాలకు పైగా ఉన్న ప్రభుత్వ స్థలాన్ని కాజేసేందుకు భారీ ఎత్తున స్కెచ్ వేసుకున్నారు. ఇంటి నెంబర్లపై చిన్నపాటి కోర్టు ఆర్డర్‌ని తీసుకువచ్చారు కొందరు ప్రబుద్ధులు. కోర్టు ఆర్డర్‌ని చూపించి ఏకంగా అప్పటి నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్, హెచ్‌ఎండిఎ నుండి అనుమతులను పొందారు. ఇంకేముంది నిర్మాణపు పనులను చకచకా మొదలుపెట్టారు. కోట్లాది రూపాయల విలువ చేసే ప్రభుత్వ భూమిని అప్పనంగా మింగేస్తున్నా అధికారుల్లో చలనం లేకుండా పోయిందని స్థానికులు వాపోతున్నారు. కోట్లాది రూపాయలు విలువ చేసే ప్రభుత్వ స్థలాలను పథకం ప్రకారం మాయం చేసేందుకు భూ బకాసురులు పూనుకున్నారు. ఏకంగా అప్పటి మున్సిపల్ కార్పొరేషన్, హెచ్‌ఎండిఎ విభాగాల నుండి అనుమతులను సైతం తీసుకురావడం విశేషం. ప్రభుత్వ సర్వేనంబర్లలో ఏ విధంగా భవన నిర్మాణ అనుమతులను జారీ చేస్తున్నారని పలువురు ప్రశ్నిస్తున్నారు. అధికారుల మధ్య సమన్వయ లోపమా లేక మరేదైనా దురుద్దేశ్యంతో ఇలాంటి తప్పుడు అనుమతులను జారీ చేస్తున్నారా అంటూ విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వ స్థలమైన సర్వేనంబర్లు ఉంటే కనీసం రెవెన్యూ అధికారుల నుండి నివేదికలను తెప్పించుకుని అనుమతులను జారీ చేయాల్సిన ఎన్‌ఎంసి, హెచ్‌ఎండిఎ విభాగాల అధికారులు గుడ్డిగా అనుమతులను జారీ చేయడం అందిని విస్మయానికి గురిచేస్తుంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కోట్లాది రూపాయల విలువ చేసే ప్రభుత్వ భూమిని భూ బకాసురుల చెర నుండి కాపాడాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

### ప్రభుత్వ స్థలంలో హెచ్‌ఎండిఎ, ఎన్‌ఎంసిల అనుమతుల వివరాలు...

నిజాంపేట్ సర్వేనంబరు 233/1 లోని ఎకరానికి పైగా ఉన్న ప్రభుత్వ భూమిలో హెచ్‌ఎండిఎ, నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ నుండి అనుమతులను పొందిన వివరాలు ఇలా ఉన్నాయి. ప్రభుత్వ స్థలంలో చిన్న పాటి కోర్టు ఆర్డర్‌ని ఆసరాగా చేసుకుని ఏకంగా నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ నుండి మంజల వాణి, భర్త మంజల వేణుకుమార్ పేరుతో ఫైల్ నంబరు: 265592 /nzpt/0066/2023 180 చ.గజాలకు అనుమతులను పొందారు. అదేవిధంగా గౌరి సుధారాణి, భర్త గౌరి ప్రశాంత్ పేరుతో ఫైల్ నంబరు: 265552/ nzpt/ 0063/2023 180 చ. గజాలకు అనుమతిని పొందగా బి.సావిత్రి భర్త బి.రామకృష్ణయ్య పేరుతో ఫైల్ నంబరు: 265569/nzpt/0064/2023 136 చ.గజాలకు అనుమతులను పొందారు. కాగా ఏకంగా హెచ్‌ఎండిఎ నుండి వి.లక్ష్మీ నరసింహ స్వామి ఇతురుల పేరిట 342.93 స్క్వెర్ మీటర్స్‌పై పర్మిట్ నంబరు: 010907/ bp/hmda/2248/med/2022 స్టిల్ట్ ప్లస్ ఫ్లోర్ అనుమతులను తీసుకురావడం విశేషం. ప్రభుత్వ సర్వేనంబర్లలోని ప్రభుత్వ స్థలాల్లో ప్లాట్లుగా విభజించిన వాటికి బిల్డింగ్ అనుమతులను ఏవిధంగా జారీ చేస్తున్నారని ప్రస్తుతం నిజాంపేట్ సర్కిల్‌లో హాట్ టాపిక్‌గా మారింది. సామాన్యులు వందల చ.గజాల స్థలంలో నిర్మాణాన్ని చేపడితే అందుకు అనుమతులు ఉన్నాయా, ఇది ప్రభుత్వ స్థలమా, ఏన్నేళ్ల నుండి ఇక్కడ నివసిస్తున్నారని, విద్యుత్ తీగలు ఉన్నాయని ఇలా అనేక రకాలుగా ప్రశ్నలు గుప్పిస్తూ ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిప్పే అధికారుల కళ్లకు ప్రభుత్వ స్థలాన్ని కాజేసేందుకు వేసిన పథకం కనిపించలేదా అని పలువురు ప్రశ్నిస్తున్నారు.

### ప్రభుత్వ స్థలమైతే స్వాధీన పరుచుకుంటాం : బాచుపల్లి తహసీల్దార్ వాణిరెడ్డి

నిజాంపేట్ గ్రామంలో సర్వేనంబరు 233/1లోని ప్రభుత్వ స్థలంలో ప్రారంభమైన నిర్మాణాలపై బాచుపల్లి మండల తహసీల్దార్ వాణిరెడ్డిని వివరణ కోరగా నిజాంపేట్ సర్వేనంబరు 233/1లోని ప్రభుత్వ స్థలంలో కోర్టు ఆర్డర్‌ని తీసుకువచ్చి భవన నిర్మాణ పనులను ప్రారంభించారని, వెంటనే పనులను నిలిపివేశామని తెలిపారు. ప్రభుత్వ స్థలంలో ఏకంగా ప్లాట్లుగా చేసి అనుమతులను సైతం తీసుకువచ్చారని, కోర్టు ఆదేశానుసారం సర్వే చేసి ప్రభుత్వ స్థలమని తేలితే తక్షణమే నిర్మాణాన్ని తొలగించి స్వాధీన పరుచుకుంటామని వాణిరెడ్డి స్పష్టం చేశారు. ఇప్పటికే ప్రభుత్వ స్థలాన్ని చదును చేస్తున్న వ్యక్తితో పా టు మరొకరిపై కేసునమోదు చేశామని, 233/1లో ప్రభుత్వ స్థలమని తేలితే కఠిన చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు.

# హైదరాబాద్‌లో పెరుగుతున్న అగ్నిప్రమాదాలు

## ఐదేళ్లలో వందలాది ఘటనలు..

### రూ.కోట్ల ఆస్తి నష్టం



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో అగ్నిప్రమాదాలు ఆందోళనకర స్థాయిలో పెరుగుతున్నాయి. నివాస సముదాయాలు, వాణిజ్య భవనాలు, గోదాములు, పరిశ్రమలు, మార్కెట్ ప్రాంతాల్లో తరచూ మంటలు చెలరేగుతూ ప్రాణనష్టం, ఆస్తి నష్టానికి కారణమవుతున్నాయి. ఫైర్ శాఖ గణాంకాలు, ఆర్‌టీఐ ద్వారా వెలుగులోకి వచ్చిన వివరాలు చూస్తే పరిస్థితి తీవ్రంగా ఉన్నట్లు తెలుస్తోంది. సంవత్సరాల వారీగా అగ్నిప్రమాదాలను పరిశీలిస్తే 2023లో 767, 2024లో 801, 2025లో 835 ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. 2023తో పోలిస్తే 2025 నాటికి అగ్నిప్రమాదాలు సుమారు 9 శాతం పెరిగాయి. ఇదే స్థాయిలో ప్రాణ నష్టం కూడా పెరిగింది. 2023లో ఒక్క మరణం, 2024లో ఒక్కమరణం నమోదవగా, 2025లో మాత్రం అగ్నిప్రమాదాల కారణంగా 51 మంది ప్రాణాలు కోల్పోయారు. ఇది ఒక్క ఏడాదిలోనే భారీ పెరుగుదలగా అధికారులు పేర్కొంటున్నారు. ఇక ఆస్తి నష్టం విషయానికి వస్తే 2023లో రూ.1.96 కోట్లు, 2024లో రూ.22.27 కోట్లు, 2025లో రూ.32.38 కోట్లు అంటే రెండేళ్లలో ఆస్తి నష్టం దాదాపు 16 రెట్లు పెరిగింది.

**పాతబస్తీ అత్యంత ప్రమాదకర ప్రాంతం..**

2024లో గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో నమోదైన సుమారు 2,500 అగ్నిప్రమాదాల్లో 500కుపైగా ఘటనలు పాతబస్తీలోనే చోటుచేసుకున్నాయి. గౌలిగూడ ఫైర్ స్టేషన్ పరిధిలో అత్యధిక కేసులు నమోదయ్యాయి. అధికారుల పరిశీలన ప్రమాదానికి గల కారణాలను గుర్తించారు. షార్ట్ సర్క్యూట్లు, విద్యుత్ వైరింగ్ లోపాలు, సిగరెట్, బీడీ పీకలను నిర్లక్ష్యంగా పారేయడం, ఫైర్ సేఫ్టీ నిబంధనలు పాటించకపోవడం, గోదాములు, వాణిజ్య భవనాల్లో అత్యవసర నిష్క్రమణ మార్గాలు లేకపోవడం, అధిక ఉష్ణోగ్రతలు, వోల్టేజ్ హెచ్చుతగ్గులు వీటి వల్ల ప్రధానంగా ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. హైదరాబాద్‌లో జరిగిన భారీ అగ్నిప్రమాదాలు ఇలా ఉన్నాయి. 2023 స్వప్నలోక్ కాంప్లెక్స్ అగ్నిప్రమాదం పలువురు ప్రాణాలు కోల్పోయారు. 2025 గుల్జార్ హౌజ్ అగ్నిప్రమాదం 17 మంది మృతిచెందారు. నాంపల్లి ఫర్నిచర్ గోదాం అగ్నిప్రమాదంలో నలుగురి మృతి, ఇటీవలే అమీర్‌పేట్ హెల్మెట్ బజార్ అగ్నిప్రమాదం భారీ మంటలు చెలరేగగా ఫైర్ సిబ్బంది గంటలపాటు శ్రమించారు.

**నిపుణుల హెచ్చరిక ....**

హైదరాబాద్‌లో వేగంగా పెరుగుతున్న ఎత్తైన భవనాలు, పాత విద్యుత్ వ్యవస్థలు, ఫైర్ సేఫ్టీ నిబంధనల అమలులో నిర్లక్ష్యం అగ్నిప్రమాదాలకు ప్రధాన కారణాలుగా నిపుణులు పేర్కొంటున్నారు. భవనాల్లో తప్పనిసరిగా ఫైర్ ఆడిట్‌లు నిర్వహించాలని, అత్యవసర నిష్క్రమణ మార్గాలు, ఫైర్ అలారంలు, స్ప్రింక్లర్ వ్యవస్థలు ఏర్పాటు చేయాలని సూచిస్తున్నారు.

---

# ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో మౌలిక సదుపాయలు కల్పించాలి

### రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కొంతం మాధవరెడ్డి



**ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం :** ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు మౌలిక సదుపాయలు కల్పించాలని సిపిఐ సీనియర్ నాయకులు, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కొంతం మాధవరెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం ఇబ్రహీంపట్నం మండలం నాగన్‌పల్లి,పోల్కంపల్లి, నెర్రపల్లి, దండుమైలారం, ముకునూర్, రాయపోల్ గ్రామాలలో రైతు సంఘం సభ్యత్వంలో భాగంగా పర్యటించి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించి రైతు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా కొంతం మాధవ రెడ్డి మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాలలో అకాల వర్షాలకు ధాన్యం తడుస్తుందని, కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. తాలు, తరుగు, తేమ పేరుతో రైతులను ఇబ్బందులకు గురి చేయవద్దన్నారు. అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులకు న్యాయం చేయాలని కోరారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ధాన్యం తడువకుండా రక్షణ కల్పించి సకాలంలో ధాన్యాన్ని తరలించాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో రైతుసంఘం నాయకులు యాదయ్య, నరేందర్, వేణు, ఎస్.లక్ష్మయ్య, అంజయ్య, సాయిలు, రాజు, పెంటయ్య, షేక్‌అలీ, రాంచంద్రయ్య, భాస్కర్, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్ళాలి

### కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రాయికల్ శ్రీనివాస్



**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్:** ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్ళాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రాయికల్ శ్రీనివాస్ అన్నారు. ఆదివారం ఫరూఖ్‌నగర్ మండలం వెల్‌జర్ల గ్రామ సర్పంచ్ బాబు నాయక్ ఆధ్వర్యంలో నూతనంగా ఎన్నికైన కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రాయికల్ శ్రీనివాస్‌ను వివిధ గ్రామాల సర్పంచ్‌లు సన్మానించారు. ఈ సందర్భంగా రాయికల్ శ్రీనివాస్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి మంచి పేరు తీసురావడంతోపాటు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు చేరేలా సర్పంచ్‌లు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి వెంకట్‌రాంరెడ్డి, మాజీ ఎంపిపి ఇద్రీస్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాలరాజ్ గౌడ్, ఫరూఖ్‌నగర్ మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు చించోడు సర్పంచ్ ర్యాకల శ్రీనివాస్, వెల్‌జర్ల గ్రామస్తులు గణేష్ గౌడ్, జాంగారి రవి, కెవిఎం రమేష్, శ్రీనివాస్ యాదవ్, మహేష్ యాదవ్, వినయ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# పర్యావరణానికి ముప్పు కలిగించే చెత్త డంపింగ్ యార్డు మాకొద్దు

### ప్రతిపాదిత యార్డు స్థలంలో వంటావార్పుతో నిరసన



**ప్రజాపక్షం/కొత్తూరు:** పర్యావరణానికి ముప్పు కలిగించే చెత్త డంపింగ్ యార్డు మాకొద్దు..ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని బిఆర్‌ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం కొత్తూరు మండలం సిద్దాపూర్ చెత్త డంపింగ్ యార్డు ఏర్పాటు చేసే స్థలంలో రాజకీయ పార్టీలకు అతీతంగా వంటావార్పు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిపాధించిన చెత్త డంపింగ్ యార్డు వల్ల స్థానిక ప్రజల్లో పర్యావరణ, ఆరోగ్య సంబంధింత ఆందోళనలు వ్యక్తమవుతున్నాయని వివరించారు. ప్రభుత్వం ప్రజల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకొని నిర్ణయం తీసుకోవాలని కోరారు. గతంలో ఈ ప్రాంత అభివృద్ధి యువతకు ఉపాధి అవకాశాల కల్పన లక్ష్యంగా ఐటి రంగం, ఆహార ప్రాసెసింగ్ పరిశ్రమల ఏర్పాటుకు ప్రణాళికలు ఉన్నాయని తెలిపారు. ప్రస్తుతం అదే ప్రాంతంలో చెత్త డంపింగ్ యార్డు ఏర్పాటు ప్రతిపాధన రావడంపై స్థానిక ప్రజలు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారని వివరించారు. ప్రజల అభిప్రాయాలకు అనుగుణంగా నిర్ణయం తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో కడెంపల్లి శ్రీనివాస్ గౌడ్, ఎమ్మె సత్యనారాయణ, కడాల శ్రీశైలం, శ్రీనివాస్‌రెడ్డి, మాదారం కృష్ణ. జాడగూడెం యాదయ్య గౌడ్‌తోపాటు ప్రజలు, రైతులు పాల్గొన్నారు.

# పేదలకు సొంతింటి కల నెరవేర్చాలన్నదే ప్రభుత్వ లక్ష్యం



**ప్రజాపక్షం/కొందుర్గు:** పేదలకు సొంతింటి కల నెరవేర్చాలన్నదే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని జిల్లేడు చౌదరిగూడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చంద్రశేఖర్ వివరించారు. ఆదివారం జిల్లేడు చౌదరిగూడ మండల పరిధిలోని పెద్ద ఎల్కిచర్ల గ్రామంలో ఎర్ర మనోజ్, యాదయ్యలకు మంజూరైన ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి స్లాబ్ పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలన్నదే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని వివరించారు. మొదటి విడతలో మంజూరైన ఇందిరమ్మ ఇండ్లను లబ్దిదారులు ఎంతో ఉత్సాహంగా నిర్మించుకుంటున్నారని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి అర్హులకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయడం జరుగుతుందని వివరించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ వెంకట నర్సింహ్మారెడ్డి, బిసీసెల్ మండల అధ్యక్షుడు వెంకట్‌రాములు, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కుమార్, శ్రీనివాస్, సర్పంచ్ శివ, బందయ్య, అధిత్య, నర్సింలు, యాదయ్య, యాదగిరి, శ్రీశైలం, రాములు, నరేష్, రమేష్, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

---

# సామాజిక న్యాయాన్ని బొందపెట్టిన కాంగ్రెస్

### రాజ్యసభ సీట్లలో బిసిలకు అన్యాయం

### జాజుల శ్రీనివాస్ గౌడ్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాజ్యసభ ఖాళీల పరిధిలో సామాజిక న్యాయాన్ని కాంగ్రెస్ పార్టీ పూర్తిగా పొందబెట్టినని బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం రాజ్యసభ స్థానాలను భర్తీ చేస్తున్న ఖాళీలలో బిజెపి నుండి 11 లో ఓసిలకు 6, బిసిలకు 4, ఎస్‌టిలకు 1 కేటాయించిందని, కాంగ్రెస్ మాత్రం 7 సీట్లలో ఓసిలకు 4, ఎస్‌సిలకు 2, మైనార్టీలకు 1కేటాయించిందని, తెలుగుదేశం 3 లో, ఓసిలకు 2, బిసిలకు 1 కేటాయించిందని, ఇక జనసేన ఒకటిలో కూడా ఓసిలకు ఉన్న ఒకటి కేటాయించిందని ఆయన తెలిపారు. బిజెపి బిసిలకు నాలుగు కేటాయిస్తే, టిడిపి ఒకటి కేటాయిస్తే, కాంగ్రెస్ ఏడు సీట్లలో ఒక్కటి కూడా బిసిలకు కేటాయించకపోవడం చాలా దుర్మార్గమన్నారు. కాంగ్రెస్ పార్టీ మాటలకు, ఆచరణకు ఎక్కడ పొంతనలేదని రాజ్యసభ సీట్ల కేటాయింపు ప్రత్యక్ష ఉదాహరణని ఆయన పేర్కొన్నారు. బిసిలకు అన్యాయం చేస్తున్న పార్టీలను గుర్తించి, భవిష్యత్తులో వారిని రాజకీయంగా బొంద పెట్టడం ఖాయమని జాజుల శ్రీనివాస్ గౌడ్ హెచ్చరించారు.

# పెట్రో ధరలను నిరసిస్తూ 10న రాష్ట్రవ్యాప్త ఆందోళనలు

### సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇ.టి. నరసింహ పిలుపు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరల పెంపును నిరసిస్తూ ఈనెల 10న రాష్ట్రవ్యాప్తంగా చేపట్టే ఆందోళన కార్యక్రమాలను విజయవంతం చేయాలని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇ.టి. నరసింహ ప్రజలకు పిలుపునిచ్చారు. సిపిఐ నాగోల్ డివిజన్ సాయినగర్ జనరల్ బాడీ సమావేశం ఆదివారం సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కాంపల్లి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా నాగోల్ చౌరస్తా నుంచి సాయినగర్ పార్టీ కార్యాలయం వరకు సిపిఐ కార్యకర్తలు జెండాలు, డప్పులతో ర్యాలీ నిర్వహించారు. సభలో ఇ.టి. నరసింహ మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఇంధన ధరలు, గ్యాస్ సిలిండర్ ధరలు నిరంతరం పెంచుతూ సామాన్య, మధ్యతరగతి ప్రజల పై భారాలు మోపుతోందని విమర్శించారు. దీంతో నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి ప్రజల జీవనం కష్టతరమైందన్నారు. కార్పొరేట్ సంస్థల ప్రయోజనాల కోసం తీసుకుంటున్న విధానాల వల్ల రూపాయి విలువ పడిపోతూ ఆర్థిక వ్యవస్థ సంక్షోభంలోకి వెళ్తోందని అన్నారు. మత విద్వేషాలను రెచ్చగొట్టి ఎక్కువకాలం పాలన సాగించడం సాధ్యం కాదన్నారు. విద్యారంగాన్ని ఆర్‌ఎస్‌ఎస్ భావజాలం ప్రభావితం చేస్తోందని ఆరోపించారు. నీట్ పేపర్ లీక్ ఘటనలో కేంద్ర విద్యా శాఖ మంత్రి బాధ్యత వహించి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. సిపిఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి స్టాలిన్ మాట్లాడుతూ సాయినగర్ ప్రాంత సమస్యల పరిష్కారం కోసం సిపిఐ ముందుండి పోరాడుతుందని తెలిపారు. కార్యక్రమంలో సిపిఐ నాగోల్ డివిజన్, సాయినగర్ ఏరియా శాఖల కార్యదర్శులు పాల్గొన్నారు.

---

# జలమండలి కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యత

### తెలంగాణ జలమండలి ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు రాజిరెడ్డి

### జలమండలి ఉద్యోగ, కార్మికుల భారీ విజయోత్సవ ర్యాలీ




**ప్రజాపక్షం/హైదరాబాద్:** జలమండలి ఉద్యోగ, కార్మికుల సంక్షేమానికి జలమండలి గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో భారీ విజయం సాధించిన తెలంగాణ జలమండలి ఎంప్లాయిస్ యూనియన్ మొదటి ప్రాధాన్యత ఇస్తుందని (టిజెఇయు–ఐఎన్‌టియుసి అనుబంధం) ఐఎన్‌టియుసి రాష్ట్ర ముఖ్య ఉపాధ్యక్షుడు, తెలంగాణ జలమండలి ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు మొగుళ్ళ రాజిరెడ్డి చెప్పారు. జలమండలి గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో టిజెఇయు ఘనవిజయం సాధించిన సందర్భంగా హైదరాబాద్ ఖైరతాబాద్‌లోని జలమండలి కేంద్ర కార్యాలయం నుండి గాంధీభవన్ వరకు వందలాదిమంది జలమండలి ఉద్యోగ, కార్మికులు ఉత్సాహభరితమైన వాతావరంలో భారీ విజయోత్సవ ర్యాలీని నిర్వహించారు. ర్యాలీ ప్రారంభానికి ముందు జలమండలి గుర్తింపు కార్మిక సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైన మొగుళ్ళ రాజిరెడ్డి మాట్లాడుతూ కార్మికులకు చట్టపరమైన హక్కులు, భద్రత, సరైన వేతనాలు, మెరుగైన పని పరిస్థితులు కల్పించడనికి కృషిచేస్తానన్నారు. కార్మికుల జీవితాల్లో వెలుగులు నింపాలన్న ధృఢ సంకల్పంతో గత 13 ఏళ్లుగా పెండింగ్‌లోఉన్న దాదాపు అన్ని సమస్యలను కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డ తరువాత రెండున్నర ఏళ్ళ కాలంలో పరిష్కారంమయ్యాయని, ఇది చూసే జలమండలి ఉద్యోగ, కార్మికులు టిజెఇయు భారీ మెజారిటీతో గెలిపించారన్నారు. ర్యాలీలో ఐఎన్‌టియుసి ఇంచార్జి, మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, ఐఎన్‌టియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు ఆర్.డి.చంద్రశేఖర్, వై. నాగన్న గౌడ్, టిజెఈయు ప్రధాన కార్యదర్శి కె.రాఘవేంద్ర రాజ్, అసోసియేట్ ప్రెసిడెంట్ అల్లి శ్రావణ్ కుమార్, వాటర్ వర్క్స్ ఎంప్లాయిస్ యూనియన్ తెలంగాణ అధ్యక్షులు కె.రాజిరెడ్డి, నేతలు ఇ.చంద్రశేఖర్, ఎం.రాజా, బి.శంకర్ ప్రకాష్, బి.నర్సింగ్ రావు, కె.ఆనంద్ రెడ్డి, అజయ్ నాథ్, వినోద్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# పాలమూరు..రంగారెడ్డి ప్రాజెక్టులో లక్ష్మీదేవిపల్లి లేదు

### బిఆర్‌ఎస్ నేతల తీరుపై కాంగ్రెస్ శ్రేణులు ఆగ్రహం



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు నిర్మాణంలో లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ ఊసే లేదని, ఈ ప్రస్తావన మేమే తెచ్చామని బిఆర్‌ఎస్ నేతలు చెప్పుకోవడం విడ్డూరంగా ఉందని కాంగ్రెస్ నేతలు ఎద్దేవా చేశారు. ఆదివారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ అగ్రనేతలు మాట్లాడుతూ జూరాల నుండి తీసుకోవాల్సిన వరద జలాలను వదిలేసి శ్రీశైలం నుండి తీసుకోవడంతోనే అధిక ఆర్థిక భారం పడుతుందని వివరించారు. శ్రీశైలం జలాశయాల నుండి పాలమూరు..రంగారెడ్డి ఎత్తిపోతుల ప్రాజెక్టు వరకు మొత్తం 21ప్యాకెజీలను ఏర్పాటు చేశారని, అందులో కేవలం 19ప్యాకెజీలకు మాత్రమే ప్రభుత్వం డిపిఆర్ చేసిందని గుర్తు చేశారు. అనాడు అధికారంలో ఉన్న అప్పటి ఎమ్మెల్యే వై.అంజయ్య యాదవ్ ఎందుకు నోరు మోదపలేదో చెప్పాలని డిమాండ్ చేశారు. ఎన్నికల హామీగానే లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ పదేపదే చెప్పుకుంటూనే మరోవైపు లక్ష్మీదేవి రిజర్వాయర్ ప్యాకేజీ లేకుండా చేశారని మండిపడ్డారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో ఉన్న పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారధ్యంలో సంబంధిత ఇంజనీర్లతో సమీక్షలు చేస్తుంటే అది చూసి ఓర్వలేక ప్రతిపక్ష నేతలు నోరుందని ఇష్టం ఇచ్చినట్లు మాట్లాడటం సరైన పద్ధతి కాదని హెచ్చరించారు. పదేళ్ళ కాలంలో అధికారంలో ఉండి జిల్లాలో ఉన్న పెండింగ్ ప్రాజెక్టులకు ఎందుకు నిర్మించలేదో చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి దూసుకువెళ్తుంటే అది చూసి ఓర్వలేక ఇష్టం వచ్చినట్లు అసత్య ఆరోపణలు చేయడం సరైన పద్ధతి కాదని సూచించారు. లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మించేందుకు గాను భూసేకరణ చేయడానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రూ.583కోట్ల నిధులు కేటాయించడంతోపాటు సర్వే పనులు త్వరగా పూర్తి చేయాలని అధికారులను అదేశించినట్లు తెలిపారు. ఉమ్మడి జిల్లాలో ఉన్న ప్రాజెక్టులు 90 శాతం పనులు పూర్తి చేశామని ప్రతిపక్ష నేతలు చెప్పుకోవడం సిగ్గుండాలన్నారు. 90శాతం పనులు పూర్తి చేస్తే సుమారుగా 10లక్షల ఎకరాలకు సాగునీరు అందించే అవకాశం ఉంటుందన్నారు. కానీ అరగంట పాటు ఒకమోటర్ అన్ చేసి పనులు పూర్తి చేశామని చెప్పుకోవడం విడ్డూరంగా ఉందని అన్నారు. 105జీవోలో లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్‌ను ఎందుకు చేర్చలేదో చెప్పాలని డిమాండ్ చేశారు. లక్షకోట్లతో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు కంటే పాలమూరు..రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు, లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్లు పూర్తి అయ్యేవని, దాంతో మూడు ఉమ్మడి జిల్లాలకు సాగునీరు, తాగునీరు పుష్కలంగా లభించే అస్కారం ఉంటుందని వివరించారు. రెచ్చగొట్టే విధంగా వ్యవహరిస్తున్న బిఆర్‌ఎస్‌కు ప్రజలు గుణపాఠం చెప్పడం ఖాయమన్నారు. పదేళ్ళల్లో చేయలేని అభివృద్ధిని మూడేళ్ళల్లో చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని గుర్తుచేశారు. సమావేశంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్‌ఖాన్, డైరెక్టర్ కరుణాకర్, మండల పార్టీ అధ్యక్షుడు పురుషోత్తంరెడ్డి, నేతలు చెంది తిరుపతిరెడ్డి, రఘునాయక్, కౌన్సిలర్ దిలీప్, యాదగిరి యాదవ్, విశ్వం, కృష్ణారెడ్డి, ఖాధర్‌ఘోరీ పాల్గొన్నారు.

# సైక్లింగ్‌తో ఫిట్‌నెస్ సందేశం

### రైల్వే స్పోర్ట్స్ ఆధ్వర్యంలో 'సండేస్ ఆన్ సైకిల్'



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సికింద్రాబాద్ రైల్వే స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఆదివారం నిర్వహించిన 'సండేస్ ఆన్ సైకిల్' కార్యక్రమాన్ని దక్షిణ మధ్య రైల్వే ఐజి, ప్రిన్సిపల్ చీఫ్ సెక్యూరిటీ కమిషనర్, సౌత్ సెంట్రల్ రైల్వే స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షురాలు అరోమా సింగ్ ఠాకూర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా అధికారులు, క్రీడాకారులు, రైల్వే ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని సైక్లింగ్ నిర్వహించారు. ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవడం, శారీరక దృఢత్వాన్ని పెంపొందించడం, పర్యావరణ పరిరక్షణకు తోడ్పడే సైక్లింగ్‌ను ప్రోత్సహించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు. పాల్గొన్న వారంతా ఉత్సాహంగా సైక్లింగ్ చేస్తూ ఫిట్‌నెస్‌పై అవగాహన కల్పించారు. రైల్వేఉద్యోగులు, క్రీడాకారులలో ఆరోగ్య చైతన్యాన్ని పెంపొందించే దిశ గా ఇలాంటి కార్యక్రమాలు నిరంతరం నిర్వహిస్తామని అధికారులు పేర్కొన్నారు.

# 10న కలెక్టరేట్ ఎదుట ధర్నా

### సిపిఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య

**ప్రజాపక్షం/షాబాద్:** కేంద్రంలోని మోదీ ప్రభుత్వం పెంచిన గ్యాస్, డీజిల్, పెట్రోల్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 10న జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట జరిగే ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య ప్రజలకు పిలుపునిచ్చారు. ఆదివారం చేవెళ్ల సిపిఐ కార్యాలయంలో విలేకరులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరల పెంపుతో నిత్యావసర ధరలు విపరీతంగా పెరిగి సామాన్యులు, పేదలు ఇబ్బందులకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఇంధన ధరలు నిరంతరం పెంచుతూ సామాన్య ప్రజలపై భారాలు మోపుతోందని విమర్శించారు. పెట్రో ధరలను నిరసిస్తూ ఈ నెల 10న జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట జరిగే ధర్నా కార్యక్రమానికి జిల్లాలోని సిపిఐ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వద్ద సత్యనారాయణ, మంజుల, నాయకులు మక్బూల్, పాపయ్య పాల్గొన్నారు.



# చేప ప్రసాదం పంపిణీకి సర్వం సిద్ధం

- నేటి రాత్రి 9 గంటల నుంచి 24గంటల పాటు పంపిణీ • 8 టన్నుల చేప ప్రసాదం -1.50లక్షల చేప పిల్లలు
- నాంపల్లి పరిసరాల్లో ట్రాఫిక్ ఆంక్షలు • సిసి కెమెరాలు.. డ్రోన్లతో పోలీసు బందోబస్తు

**ప్రజాపక్షం / హైదరాబాద్ సిటీ:** ఆస్తమా, శ్వాసకోశ వ్యాధిగ్రస్తులకు ఏటా పంపిణీ చేసే ప్రసిద్ధ బత్తిని చేప ప్రసాదం పంపిణీకి అన్ని ఏర్పాట్లు చేశారు.మృగశిర కార్తెను పురస్కరించుకుని ఈ నెల ఎనిమిదవ తేదీ సోమవారం రాత్రి 9తొమ్మిది గంటలకు ప్రారంభమై మంగళ వారం రాత్రి తొమ్మిది గంటల(24గంటల పాటు) వరకు నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో ఈ ప్రసాదం పంపిణీ చేయనున్నారు. 176 సంవత్సరాలుగా బత్తిని సోదరులు ఈ చేప మందు ప్రసాదాన్ని ఇస్తున్నారు. ఈ సారి దాదాపు ఎనిమిది టన్నుల చేప ప్రసాదం అవసరమవుతుందని అంచనా. దీని కోసం 1.5లక్షల చేప పిల్లలను సిద్ధం చేశారు.దొంగతనాలు, పిక్ పాకెటింగ్ జరగకుండా షీ టీమ్స్‌ను ఏర్పాటు చేయడంతో పాటు సీసీ కెమెరాల ద్వారా నిరంతర నిఘా ఉండనుంది.దేశం నలుమూలల నుంచి వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి చేసింది.

**క్యూలైన్లలో కూలర్లు, ఫ్యాన్లు:** మృగశిర కార్తె ప్రవేశించినప్పటికి వేసవిని తలపించే ఎండతో పాటు తీవ్రమైన ఉక్కపోత నెలకొంది. దీని నుంచి భక్తులకు ఉపశమనం కల్పించడం కోసం ప్రత్యేక చర్యలు చేపట్టారు. క్యూలైన్లు ఉండే అన్ని ప్రాంతాల్లో ఫ్యాన్లు, కూలర్లు ఏర్పాటు చేశారు. నిరంతర విద్యుత్ సరఫరాతో పాటు తాగు నీటి ఎద్దడి లేకుండా విద్యుత్ శాఖ, జలమండలి సమన్వయంతో ఏర్పాట్లు చేశారు. ప్రతి సంవత్సరం వలే ఈసారి కూడా వచ్చే భక్తులకు స్వచ్ఛంద సంస్థలు ఉచితంగా ఆహారాన్ని, అల్పాహారాన్ని అందించనున్నాయి. చేప ప్రసాదం పంపిణీ, ఇతరత్రా సమాచారాన్ని ఎప్పటికప్పుడు తెలిపేందుకు మైకులను ఏర్పాటు చేశారు.

**అత్యవసర వైద్య వసతుల ఏర్పాటు:** చేప ప్రసాదం కోసం వచ్చే భక్తుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఎగ్జిబిషన్ గ్రౌండ్లోనే ప్రత్యేక మెడికల్ క్యాంపులు ఏర్పాటుచేశారు. అవసరమైన మందులు అందుబాటులో ఉంచారు. అగ్ని ప్రమాద నివారణకు ఫైర్ ఇంజన్ వాహనాలను సిద్ధం చేశారు. ముఖ్యంగా క్యూలైన్ల మధ్యలో అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు వీలుగా 'సీపీఆర్' బృందాలను ఉంచారు.మైదానంలో ఒక కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. అన్ని విభాగాల అధికారులు వాట్సప్ గ్రూప్ ద్వారా క్షణక్షణం సమన్వయం చేయనున్నారు.

**ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాటు:** చేప ప్రసాదం పంపిణీ సందర్భంగా వేదిక , పరిసర ప్రాంతాల రోడ్లపై మోస్తరు ట్రాఫిక్ రద్దీ ఏర్పడే అవకాశం ఉంది. దీని నివారించేందుకు ట్రాఫిక్ పోలీసులు అన్ని రకాల చర్యలు చేపట్టారు. ఎలాంటి అంతరాయం లేకుండా రాకపోకలు సజావుగా జరిగేందుకు సోమవారం ఉదయం ఆరు గంటల నుంచి మంగళవారం రాత్రి ఎనిమిది గంటల వరకు ట్రాఫిక్ మళ్లింపులు అమలు చేస్తున్నారు . ఫోర్ వీలర్ల కోసం గృహకల్ప, గగన్ విహార్, చంద్రవిహార్‌లలో పార్కింగ్ ఏర్పాట్లు చేశారు.అక్కడి నుంచి వారు ఎగ్జిబిషన్ గ్రౌండ్ గేట్ రెండవ గేటు వైపుకు వెళ్లాలి.బస్సులు, వ్యాన్లలో ఎం.జె. మార్కెట్ వైపు వచ్చే వారు గాంధీ భవన్ బస్ స్టాప్ వద్ద దిగాల్సి ఉంటుంది. నాంపల్లి వైపు నుండి వచ్చే వారు గృహకల్ప బస్ స్టాప్ వద్ద దిగి, అక్కడ నుండి ఎగ్జిబిషన్ గ్రౌండ్ రెండవ గేటు వైపు వెల్లాలి.ఎం.జె. మార్కెట్ వైపు నుండి వచ్చే వీఐపీ కార్ పాస్ గల వారు గాంధీ భవన్ వైపునకు వెళ్లి అదాబ్ హోటల్ లేన్ వద్ద ఎడమ మలుపు తీసుకుని ఒకటవ గేటు, సి.డబ్ల్యు.సి గేట్ మీదుగా వీఐపీ ఎంట్రీ గేట్ వైపుకు వెళ్లాలి. నాంపల్లి వైపు నుండి వచ్చే వారు గాంధీ భవన్ వద్ద 'యు టర్న్ తీసుకుని ఒకటవ నెంబరు గేటు,సి.డబ్ల్యు.సి గేట్ వైపు ఎడమ మలుపు తీసుకుని వీఐపీ ఎంట్రీ గేట్ వైపుకు వెళ్లి వీఐపీ పార్కింగ్ ఏరియాలో పార్క్ చేయాలి. ప్రభుత్వ వాహనాలు, బస్సులు మరియు వ్యాన్లను సి.డబ్ల్యు.సి. లోపార్కింగ్ ఏర్పాటు చేయాలి అలాగే ద్విచక్రవాహనాలు, ఆటోలు, ఇతర వాహనాలకు వేర్వేరుగా ఏర్పాట్లు చేశారు.

## 'సర్'పై అవగాహన పోస్టర్ ఆవిష్కరణ



**ప్రజాపక్షం/జూబ్లీహిల్స్:** ఈ నెల 14న యూసుఫ్‌గూడ సవేరా ఫంక్షన్ హాల్‌లో ఎస్ఐఆర్ పట్ల అవగాహన, మెంబర్‌షిప్ కార్యక్రమం జరగనుంది. మెంబర్‌షిప్ ఇంచార్జి, మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్‌రెడ్డి అధ్యక్షతన జరిగే కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కేటీఆర్ హాజరుకాబోతున్నారని.. ఈ క్రమంలోనే అవగాహన సదస్సు కార్యక్రమం పోస్టర్‌ను ఆదివారం సవేరా ఫంక్షన్ హాల్లో ఆవిష్కరించినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో మైనారిటీ నాయకులు సోహైల్, మాజీ కార్పొరేటర్లు దేదీప్య, రాజు పటేల్, శ్యాంరావు, డివిజన్ మాజీ అధ్యక్షుడు సంజీవ్, ప్రదీప్, అరుణ్, రాకేష్, జహీర్, విజయ్ కుమార్, ఖదీర్ భాయ్, లియకత్ అలీ, వినోద్, బిట్ల సుశీల్ కుమార్, అర్జున్, కన్యాకుమారి, సుధాకర్, సతీష్ దాస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## సమ్మర్ క్యాంప్ ముగింపు



**ప్రజాపక్షం/వెంగళరావునగర్:** మధురానగర్ సంక్షేమ సమితి ఆధ్వర్యంలో 45 రోజులపాటు నిర్వహించిన షటిల్ బ్యాడ్మింటన్ సమ్మర్ కోచింగ్ క్యాంపు ముగిసింది. కార్యక్రమానికి ప్రముఖ సినీ కళాకారుడు ప్రభాస్ శ్రీను ముఖ్యఅతిథిగా విచ్చేసి విజేతలకు బహుమతులు అందజేసారు. టోర్నమెంట్‌లో పాల్గొన్న ప్రతి బాల, బాలికలకు సంక్షేమ సమితి వారు సర్టిఫికెట్లు, మెడల్స్ అందజేసారు. కార్యక్రమంలో సంక్షేమ సమితి అధ్యక్షులు ఎన్వీ మనోహర్ రావు, ప్రధాన కార్యదర్శి కోడే సాంబశివరావు, కోశాధికారి సు గుణ, సంయుక్త కార్యదర్శి సి.హనుమంతరావు పాల్గొన్నారు.

## ఆరోగ్యం.. పర్యావరణానికి సైక్లింగ్ ఉత్తమం



మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు

**ప్రజాపక్షం/బంజారాహిల్స్:** ఆరోగ్యానికి, పర్యావరణానికి సైక్లింగ్ ఉత్తమ మార్గమని మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్య నాయుడు పిలుపునిచ్చారు. ఆరోగ్యకరమైన జీవనశైలి, పర్యావరణ పరిరక్షణ, సైక్లింగ్‌ను ప్రోత్సహించడం లక్ష్యంగా తలపెట్టిన మెగా సైక్లింగ్ రైడ్స్‌ను అయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పర్యావరణ అనుకూల రవాణాపై అవగాహన పెంచేందుకు హైదరాబాద్, న్యూఢిల్లీ, చండీఘడ్‌లలో భారీ సైక్లింగ్ ఈవెంట్లను నిర్వహించినందుకు నిర్వాహకులను అభినందించారు. ఈ సైకిల్ ర్యాలీలో పిల్లలు, యువకులు, మహిళలు, సీనియర్ సిటిజన్లు ఎంతో ఉత్సాహంగా పాల్గొనడం సంతోషాన్ని కలిగించిందన్నారు.

## గోషామహల్‌లో గులాబీ జెండా ఎగరాలి: తలసాని శ్రీనివాస్‌యాదవ్



**ప్రజాపక్షం/గోషామహల్:** రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో గోషామహల్‌లో గులాబీ జెండా ఎగురవేయాలని.. అందుకు నాయకులు, కార్యకర్తలు చిత్తశుద్ధితో చేయాలని మాజీమంత్రి, బిఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తలసాని శ్రీనివాస్ యాదవ్ పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం తెలంగాణ భవన్‌లో నియోజకవర్గం ఇంచార్జి నాగేందర్ గౌడ్ అధ్యక్షతన జరిగిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. పార్టీలో పైరవీలకు తావు లేదని, కష్టపడి పనిచేస్తూ ప్రజాదరణ ఉన్న వారికే సముచిత స్థానం, గౌరవం లభిస్తాయని స్పష్టం చేశారు. సమావేశంలో బిఆర్ఎస్ సీనియర్ నాయకులు గడ్డం శ్రీనివాస్‌యాదవ్, మహేందర్ పాల్గొన్నారు.

## విజేతలకు బహుమతుల ప్రదానం



**ప్రజాపక్షం/వెంగళరావునగర్:** మధురానగర్ సంక్షేమ సమితి ఆధ్వర్యంలో కాలనీలోని ఇండోర్ స్టేడియంలో రెగ్యులర్‌గా ఆడే బ్యాడ్మింటన్ సీనియర్ ఆటగాళ్లకు ఆదివారం పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో కిరణ్, కోటేశ్వర్ రావు ప్రథమ స్థానంలో, నరేందర్ రెడ్డి, అశోక్ రెడ్డి ద్వితీయ స్థానంలో నిలిచారు. విజేతలకు సంక్షేమ సమితి ఆధ్వర్యంలో బహుమతులు అందజేసారు. కార్యక్రమంలో సీనియర్ ఆటగాడు ప్రభాస్ శ్రీను, సంక్షేమ సమితి అధ్యక్షుడు మనోహర్‌రావు, ప్రధాన కార్యదర్శి కోడే సాంబశివరావు, కోశాధికారి సుగుణ, సంయుక్త కార్యదర్శి సి.హనుమంతరావు, కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు. ఈ పోటీలు గోపాల్ రెడ్డి, ఆదినారాయణ, సత్యనారాయణ రాజు ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. గిఎంపికలో ఎదగడం సంతోషకరమని అన్నారు. దినేష్ కుమార్ ఎదుగుదలకు తనవంతు సహకారం ఎల్లప్పుడు అందిస్తామని పేర్కొన్నారు.

## వీరభద్రేయుల సంక్షేమానికి సహకారం

**ప్రజాపక్షం/పటాన్‌చెరు :** పటాన్ చెరు నియోజకవర్గ పరిధిలోని వీరభద్రేయుల సంక్షేమానికి సం పూ ర్ణ సహకారం అందిస్తున్నాయని పటాన్చెరు శాసన సభ్యుడు గూడెం మహిపాల్ రెడ్డి అ న్నారు. ఇస్నాపూర్ వీరభద్రేయు సంక్షేమ సం ఘం ఆధ్వర్యంలో ముత్తంగి డివిజన్ పరిధిల గల భవన నిర్మాణ స్థల ంలో నూతనంగా ఏర్పాటు చేసిన బోరును ఆదివార ఉదయం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాల సం క్షేమం ఆర్థిక అభ్యునతి లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలిపారు. ఇస్నాపూర్ వీరభద్రేయుల సం క్షేమం కోసం ఇప్పటికే సొంత నిదులతో 200 గజాల స్థలం అందించడం జరిగిందని గుర్తుచేసారు. రాబోయే రోజుల్లోనూ అండగా ఉంటానని భరోసా అందించారు.

## పొగాకు వినియోగ నియంత్రణ లక్ష్యం



**ప్రజాపక్షం/సుల్తాన్‌బజార్:** నా బిడ్డ దేశం కోసం ఏదైనా మేలు చేయాలి అని ఆలోచించడంతోనే అసాధారణ విజయం సొంతం అయ్యింది.. అంటూ నేషనల్ టొబాకో కంట్రోల్ 'హీరో' అవార్డ్ గ్రహీత, పౌరసరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహశీల్దార్ మాచన రఘునందన్ మాతృమూర్తి విజయ ఆనందం వ్యక్తం చేశారు. మారుమూల కుగ్రామంలో జన్మించిన మాచన ఢిల్లీ స్థాయిలో గుర్తింపు పొందేలా పొగాకు ఉత్పత్తుల వాడకం నియంత్రణ కోసం తపిస్తున్న తీరుకు ప్రత్యక్ష సాక్షిగా నిలిచానని ఆమె అన్నారు. ఈ క్రమంలోనే మాచన చేస్తున్న అలుపెరుగని కృషి గురించి ఆమె ఎంతో ఆర్ద్రతతో వివరించారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అద్భుత ఫలితం రావడం మాకు పద్మ పురస్కారంతో సమానం అన్నారు. ఎంత సంపాదించాము.. ఎంత కూడబెట్టుకున్నాం అని ఆలోచించే కొందరికి భిన్నంగా మా వాడు దేశ వ్యాప్తంగా ఎన్నో సంస్థలను, ఎందరో వ్యక్తుల్లో పరివర్తన తీసుకురావడం సాధ్యమేనా? అని ఆశ్చర్య పోయేలాచేశారన్నారు. ప్రభుత్వ ఉద్యోగిగా పని చేస్తూనే.. జాతీయ స్థాయిలో ప్రతిష్ఠాత్మక నేషనల్ టుబాకో కంట్రోల్ 'హీరో' అవార్డ్‌ను కైవసం కోవడం అనితర సాధ్యమని విజయ కొనియాడారు. విద్యార్థులు, యువత పొగాకు ఉత్పత్తులకు బలి కాకుండా స్కూళ్లు, కాలేజీల వద్ద సిగరెట్‌ల విక్రయాలను నిషేధించాలనే అంశాన్ని ఇటీవల రాష్ట్రపతి వరకు సైతం తీసుకువెళ్లగలిగారు. ఈ మేరకు రాష్ట్రపతి భవన్ నుంచి, ఆయా రాష్ట్రాలకు స్కూళ్లు, కాలేజీల వద్ద సిగరెట్, బీడి, గుట్కా వంటి పొగాకు ఉత్పత్తుల విక్రయాలను నిషేధించేలా చర్యలు చేపట్టాలని ఆదేశాలు వెళ్లాయని ఆమె గుర్తుచేశారు.

## జూపార్క్‌కు పోటెత్తిన జనం



**ప్రజాపక్షం/బహదూర్‌పురా:** వేసవి సెలవుల నేపథ్యంలో ఆదివారం జూపార్క్ సందర్శకులతో కిక్కిరిసిపోయింది. రికార్డు స్థాయిలో 24.200 మంది జూపార్క్‌ను సందర్శించారు. గతంలో మాదిరిగానే ఊహించినట్లుగానే ఈ సంవత్సరం కూడా జంతు ప్రదర్శనశాలను సందర్శించేందుకు ఎక్కువ సంఖ్యలో సందర్శకులు ఆసక్తి చూపారు. పరిశుభ్రత, అంతర్గత రవాణా, పార్కింగ్ సౌకర్యం, తాగునీరు, మరుగుదొడ్లు వంటి సందర్శకుల సౌకర్యాలను పర్యవేక్షించేందుకు జంతు ప్రదర్శనశాల యాజమాన్యం అధికారులందరినీ విధుల్లోకి నియమించారు. అదనపు బుకింగ్ కౌంటర్‌ను కూడా తెరిచింది. తెలంగాణ పర్యాటక శాఖ 202526 గణాంకాల ప్రకారం, తెలంగాణలో అత్యధిక సంఖ్యలో (2 మిలియన్లకు పైగా) సందర్శకులను ఆకర్షించడంలో జంతు ప్రదర్శనశాల రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలిచింది. ఈసందర్భంగా జూ పార్క్ క్యూరేటర్ జె.వసంత మాట్లాడుతూ.. విహార యాత్ర గమ్యస్థానంగా జూపార్క్‌ను ఎంచుకున్నందుకు సందర్శకులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. మే నెలలో అత్యధిక రద్దీ నమోదవుతుందని.. విధుల పట్ల నిబద్ధతను కనబరిచిన జంతు ప్రదర్శనశాల సిబ్బందికి ఆమె ధన్యవాదాలు తెలిపారు.

## ఆధునిక మెరుగైన వైద్యం లక్ష్యం



నిమ్స్ డైరెక్టర్ రాహుల్ దేవరాజ్ స్పష్టం

**ప్రజాపక్షం/ఖైరతాబాద్:** నిజాం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(నిమ్స్) 19వ డైరెక్టర్‌గా యూరాలజీ విభాగాధిపతి ప్రొఫెసర్ రాహుల్ దేవరాజ్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. నిమ్స్‌లోని డైరెక్టర్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పూర్వ డైరెక్టర్ నగరి బీరప్ప అధికారికంగా బాధ్యతలను రాహుల్ దేవరాజుకు అప్పగించి శుభాకాంక్షలు తెలిపారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం రాహుల్ దేవరాజ్ మీడియాతో మాట్లాడారు. నిమ్స్ సంస్థను వైద్య సేవలు, వైద్య విద్య, పరిశోధన రంగాల్లో మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లేందుకు శ్రమిస్తానని స్పష్టం చేశారు. పేద, మధ్యతరగతి రోగులకు అత్యాధునిక, మెరుగైన, అందుబాటు ధరల్లో వైద్య సేవలను అందించడమే తన ప్రధాన లక్ష్యమని తెలిపారు. అనంతరం పూర్వ డైరెక్టర్ నగరి బీరప్ప మాట్లాడుతూ.. తన పదవీ కాలంలో నిమ్స్ అభివృద్ధి కోసం సంస్థ సిబ్బంది, అధ్యాపకులు, వైద్యులు అందించిన సహకారం మరువలేనిదన్నారు. క్యాటివ్ రిజిస్ట్రార్ శాంతి సిబ్బంది పాల్గొని నూతన డైరెక్టర్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

### సింహవాహిణి ఆలయ కమిటీ

## నూతన చైర్మన్ అరవింద్‌గౌడ్ ఎన్నిక



**ప్రజాపక్షం/చార్మినార్:** తెలంగాణ రాష్ట్రంలో ప్రసిద్ధి చెందిన చారిత్రాత్మక లాల్‌దర్వాజా సింహవాహిణి మహంకాళి ఆలయం కమిటీ నూతన చైర్మన్‌గా జి.అరవింద్‌కుమార్‌గౌడ్ ఎన్నికయ్యారు. ఆదివారం లాల్ దర్వాజా శివపార్వతి ఫంక్షన్ హాల్‌లో ఆలయ కమిటీ సర్వసభ్య సమావేశం ఆలయ కమిటీ మాజీ చైర్మన్ జి.కాశీనాథ్ గౌడ్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా అరవింద్ కుమార్ గౌడ్‌ను చైర్మన్‌గా సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే కమిటీలో... ప్రధాన కార్యదర్శి పోసాని సతీష్ ముదిరాజ్, కోశాధికారి హరీష్‌గౌడ్ నియమితులైనారు. ఈ సందర్భంగా అరవింద్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ, ఆషాఢ మాసంలో నిర్వహించే బోనాల ఉత్సవాలను ఘనంగా భక్తుల అభీష్టం మేరకు నిర్వహిస్తామని హామీ ఇచ్చారు. త్వరలోనే మరో సమావేశం నిర్వహించి పూర్తి స్థాయిలో కమిటీని ప్రకటిస్తామని పేర్కొన్నారు. సమావేశంలో ఆలయ కమిటీ మాజీ చైర్మన్లు జె.లక్ష్మీ నారాయణగౌడ్, కె.వెంకటేష్, ఎ.బద్రినాథ్‌గౌడ్, సి.శివ కుమార్ యాదవ్, పోసాని సురేందర్ ముదిరాజ్, కమిటీ సభ్యులు, బస్తీ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## టిమ్స్ మార్చురీ మార్చండి



పరిసర ప్రాంత కాలనీవాసుల విజ్ఞప్తి

**ప్రజాపక్షం/వెంగళరావునగర్:** ప్రతిష్టాత్మకంగా రూపొందిన సనత్‌నగర్ టిమ్స్ ఆసుపత్రి ప్రాంగణంలో శవాలను భద్రపరిచే మార్చురీ ప్రాంతాన్ని మార్చాలని పరిసర ప్రాంతవాసులు కోరుతున్నారు. టీమ్స్ ఆస్పత్రిలో నూతనంగా నిర్మించిన శవాలను భద్రపరిచే మార్చురీని వెంగళరావునగర్‌కాలనీ ప్రధాన రోడ్డును ఆనుకొని నిర్మించారు. మార్చురీ చుట్టుపక్కల సిద్ధార్థనగర్, మధురానగర్, కళ్యాణ్‌నగర్ కాలనీలతో పాటు జవహర్‌నగర్, వికాస్‌పురి కాలనీలు ఉన్నందున.. రోజు వారీగా వచ్చే మృతదేహాలు, మృతుల బంధువుల ఆర్తనాధాలు.. అంబులెన్స్‌ల రాకపోకలు ఆందోళన కలిగిస్తాయని స్థానికులు వ్యతిరేకిస్తున్నారు. గతంలో ఇదే తరహాలో ఉస్మానియా మార్చురీతో జనాలు ఇబ్బందులు పడ్డారని, చివరికి పక్కనున్న అఫ్జల్‌గంజ్ పోలీస్‌స్టేషన్‌లో సిబ్బంది కూర్చోలేని పరిస్థితి నెలకొందని వారు గుర్తుచేస్తున్నారు. ప్రజలకు ఇబ్బంది కలగని అనువైన ప్రాంతానికి తరలించాలని స్థానికులు కోరుతున్నారు.

### బాచుపల్లి బైన్ చెరువులో గుడిసెలను తొలగించారు..

## మరి పక్కా భవనాల సంగతేంటి..?

- బైన్ చెరువు ఎఫ్‌టిఎల్, బఫర్ జోన్‌లలో నిర్మించిన యాజమానుల్లో టెన్షన్.. టెన్షన్..
- ఎఫ్‌టిఎల్‌లో నిర్మాణాలు ఉంటాయా..? ఊడుతాయా..?



**ప్రజాపక్షం/ నిజాంపేట్:** బాచుపల్లి బైన్ చెరువులో గుడిసెలను తొలగించారు మరి పక్కా భవనాల సంగతేంటని పలువురు ప్రశ్నలను గుప్పిస్తున్నారు. చెరువు ఎఫ్‌టిఎల్‌లో తాత్కాలికంగా వెలసిన గుడిసెలను తొలగించిన అధికార యంత్రాంగం పకడ్బందీగా నిర్మించిన భారీ భవనాలను, విల్లాలను, షెడ్లను తెలగిస్తారా అన్న అనుమానాలు, వార్తలు బాచుపల్లిలో హాట్ టాపిక్‌గా మారాయి. మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా, కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, బాచుపల్లి మండలం, బాచుపల్లి గ్రామం బైన్ (బైరుని) పెద్ద చెరువు సర్వేనంబరు 64 లో 42.28 ఎకరాలు ఉండగా సర్వేనంబరు 7 లోని పట్టా భూమిలో 5.28 ఎకరాల స్థలంలో చెరువు విస్తరించి ఉంది. పూర్వం నుండి ఈ చెరువుని గ్రామస్థులు అన్ని రకాలుగా వాడుకునే వారని స్థానికులు చెబుతున్నారు. మత్స్యకారులు చేపలను సైతం పెంచుతూ వారి కుటుంబాల జీవనోపాదికి ఆధారంగా ఈ బైన్ చెరువు ఉపయోగపడుతుంది. రోజురోజుకి బైన్ చెరువు కుచించుకుపోవడం ప్రారంభమైంది. ఈ చెరువు చుట్టూ విల్లాలు, అపార్ట్‌మెంట్‌లు, కాలనీలు ఏర్పడడంతో చెరువు ఎఫ్‌టిఎల్, బఫర్ జోన్‌లలో సైతం నిర్మాణాలు తారాస్థాయిలోనే వెలిశాయి. చెరువు ఎఫ్‌టిఎల్ పరిధిలోనే కాకుండా బఫర్ జోన్ని వదిలేసి ముప్పై మీటర్ల వరకు స్థలాన్ని వదిలేయాలి. అట్టి స్థలంలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టకూడదు. కాగా 2020 సంవత్సరం లోనే ఐదంతస్థుల భవనాలు వెలిశాయని ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు గుర్తించారు. బైన్ చెరువు ఎఫ్‌టిఎల్ లో 1.30 ఎకరాల్లో దాదాపు ఇరవై పక్కా భవనాలు, యాభై తాత్కాలిక గుడిసెలు ఉన్నాయని, చెరువు బఫర్ జోన్ 3.35 ఎకరాల్లో సుమారు అరవై నిర్మాణాలు వెలిశాయని రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు గుర్తించారు. బైన్ చెరువు ఎఫ్‌టిఎల్, బఫర్ జోన్‌లో వెలసిన భవనాలకు, షెడ్లకు నిజాంపేట్ సర్కిల్ అధికారులు అనుమతులను రద్దు చేయాలని రెవెన్యూ అధికారులు నివేదికను పంపారు. బాచుపల్లిలోని పెద్ద (బైన్) చెరువు రోజురోజుకి కబ్జాకు గురవుతుండడంతో రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు ఇప్పటికే ఆక్రమణలను గుర్తించి జిల్లా కలెక్టర్, ఆర్‌డిఓలకు నివేదించారు. ఆక్రమణలను ఇలాగే వదిలేస్తే రాబోవు రోజుల్లో చెరువు పూర్తిగా కనుమరుగయ్యే ప్రమాదం నెలకొంది. ఇప్పటికే చెరువుపై ఆధార పడి చేపలను పెంచుకుని జీవనం సాగిస్తున్న మత్స్యకారుల పరిస్థితి ఆగమ్యగోచరంగా మారే దుస్థితి లేకపోలేదు. అంతేకాకుండా బాచుపల్లి చెరువు కనుమరుగైతే భూ గర్భ జలాలకు సైతం ముంపు వాటిల్లే ప్రమాదం నెలకొంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి బాచుపల్లి బైన్ చెరువు ఆక్రమణలను తొలగించి కాపాడాలని గ్రామస్థులు కోరుతున్నారు.

**బైన్ చెరువు ఎఫ్‌టిఎల్, బఫర్‌లలో నిర్మించిన యాజమానుల్లో టెన్షన్.. టెన్షన్..**

బాచుపల్లి బైన్ పెద్ద చెరువు ఎఫ్‌టిఎల్, బఫర్ జోన్లలో నిర్మించిన భవనాలు, షెడ్ల యాజమానుల్లో టెన్షన్ మొదలైంది. ఎప్పుడు ఎలాంటి చర్యలు ఉంటాయో అన్న భయాందోళనలో నిర్మాణ దారులు బిక్కుబిక్కుమంటూ కాలం వెల్లదీస్తున్నారు. తాజాగా శనివారం బాచుపల్లి బైన్ పెద్ద చెరువుని మరోసారి హైడ్రా, రెవెన్యూ అధికారులు సర్వే చేశారు. ముఖ్యంగా చెరువు అలుగు, కట్టుకాలువ ఎక్కడి నుండి ఎక్కడికి వెళ్తుందనే విషయాన్ని పూర్తి తెలుసుకున్నారు. అధికారుల వరుస సర్వేలతో ఎఫ్‌టిఎల్, బఫర్ జోన్‌లలో నిర్మించిన నిర్మిణ దారుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి.



**బైన్ చెరువు ఎఫ్‌టిఎల్, బఫర్‌లలో నిర్మాణాలను గుర్తించాం**
**బాచుపల్లి మండల తహశీల్దార్ వాణిరెడ్డి**

బాచుపల్లి బైన్ చెరువు ఎఫ్‌టిఎల్, బఫర్ జోన్‌లలో నిర్మించిన నిర్మాణాలను గుర్తించి ఇరిగేషన్, హైడ్రాకు నివేదించామని, చర్యలు తప్పనిసరిగా తీసుకుంటామని బాచుపల్లి మండల తహశీల్దార్ వాణిరెడ్డి స్పష్టం చేశారు. బాచుపల్లి బైన్ చెరువు ఎఫ్‌టిఎల్, బఫర్ జోన్‌లలో నిర్మాణాలు పదుల సంఖ్యలో ఉన్నాయని, ఇరిగేషన్, రెవెన్యూ సంయుక్తంగా నిర్వహించిన సర్వేలో నిర్మాణాలను గుర్తించామని, నిజాంపేట్ సర్కిల్ అధికారులు నిర్మాణాలకు జారీ చేసిన అనుమతులను సైతం రద్దు చేయాలని చెపినట్లు వాణిరెడ్డి వివరించారు. బైన్ చెరువు విషయంలో ఇరిగేషన్, హైడ్రా ఎలాంటి చర్యలు తీసుకుంటే అందుకు తాము సిద్ధంగా ఉంటామని ఆమె పేర్కొన్నారు.

## మృగశిర రైతన్నకు ఉత్సాహం తెచ్చింది!

ఎండలకు వీడ్కోలు, వర్షాలకు స్వాగతం

ఖరీఫ్ సాగుకు రైతన్నలు సన్నద్ధం

**ప్రజాపక్షం/మెదక్ :** రైతాంగం మొత్తం ఎంతో ఆ సక్తిగా ఎదురుచూసే మృగశిర కార్తీ నేడు సోమవా రం ప్రారంభమైంది. మృగశిర కార్తీ వరకు భా నుడు తన ప్రతాపాన్ని చూపిస్తూ తీవ్ర ఎండలతో ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తాడు. అయితే మృగశిర ప్రవేశంతో ప్రకృతిలో మార్పులు మొదలై, నైరుతి ఋతుపవనాల రాకకు మార్గం సుగమమవుతుం ది. గ్రామీణ ప్రాంతాల్లో మృగశిర వస్తే ఉరుము లు, మెరుపులతో మేఘాలు కదులుతాయి..రైతు ఆశలు చిగురిస్తాయి అని పెద్దలు నమ్ముతారు. ఈ కార్తీ నుంచి వర్షాలు కురుస్తాయనే ఆశతో రైతులు ఖరీఫ్ సాగు పనులకు సిద్ధమవుతారు. పొలాలను దున్నడం, విత్తనాలను సిద్ధం చేయడం, ఎరువుల ఏర్పాట్లు చేసుకోవడం వంటి పనులు మృగశిర రోజు ప్రారంభిస్తారు. మృగశిర కార్తీని వర్షాకాలానికి ఆహ్వానంగా భావిస్తారు. చల్లని గాలులు వీ యడం ప్రారంభమవుతుంది. ఆకాశంలో మే ఘా లు కనిపించడం, అప్పుడప్పుడు జల్లులు కురవడం రైతులకు కొత్త ఉత్సాహాన్ని ఇస్తుంది.

**మృగశిర కార్తీ ప్రత్యేకత..**

మృగశిర కార్తీ రోజున చేపలు తినడం తెలుగు ప్ర జల్లో చాలా కాలంగా కొనసాగుతున్న సంప్రదా యం. అలాగే కొన్ని ప్రాంతాల్లో ఇంగు బెల్లం తిన డం అనాదిగా వస్తున్న అచారం. వర్షాకాలం ప్రా రంభంలో శరీరానికి అవసరమైన పోషకాలు అం దాలని, ఆరోగ్యం బాగుండాలని కొరుకుంటూ చే పలు తింటారు. చేపల్లో ఉండే ప్రోటీన్లు, ఒమేగా3 కొవ్వు ఆమ్లాలు ఆరోగ్యానికి మేలు చేస్తాయి. అ లాగే ఈ కాలంలో వచ్చే వ్యాధుల నుంచి రోగనిరోధక శక్తి పెరగాలని భావిస్తూ చేపలు తినే సంప్రదా యం ఏర్పాడిందని చెబుతారు. కొన్ని ప్రాంతాల్లో మృగశిర నాడు చేపలు తింటే ఏడాది పొడవునా ఆరోగ్యం బాగుంటుంది అనే విశ్వాసం కూ డా ఉ ంది. దీంతో మార్కెట్లలో చేపల కొనుగోళ్లు భా రీగా పెరుగుతాయి.అందువల్ల చేపల మార్కెట్లు వినియోగదారులతో కిటకిటలాడుతుంటాయి.

**మృగశిర కార్తీతో పల్లెల్లో ఆశల పండుగ**

మృగశిర కార్తీతో పల్లెల్లో రైతు ఆశల పండుగ మొ దలౌతుంది. కొన్ని ప్రాంతాల్లో, గ్రామ దేవతలకు పూజలు చేస్తారు దీంతో గ్రామలలో పండగ వాతావరణం ఏర్పాడుతుంది. పొలంపై తొలి వర్షపు చినుకు పడితే పంటల భవిష్యత్తు కనిపిస్తుంది. వ్య వసాయం ఆధారంగా జీవించే తెలుగు సమాజం లో మృగశిర కార్తీ కేవలం ఒక నక్షత్ర ప్రవేశం కా దు. రైతు జీవితానికి పండుగ. ఎండలకు వీడ్కోలు పలుకుతూ, వర్షాలకు స్వాగతం చెప్పే సందర్భంగా రైతులందరికీ సమృద్ధిగా వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని ఆకాంక్షిద్దాం. రైతన్నలందరికి మృగశిర కార్తీ శుభాకాంక్షలు.

### గత ఆందోళనలతో పరిమితం కాని...

# ఇరుదేశాల భాగస్వామ్యాన్ని నిర్మిద్దాం

**భారత్ సంబంధాలపై నేపాల్ విదేశాంగ మంత్రి శిశిర్ ఖనాల్ ఆకాంక్ష**



**న్యూఢిల్లీ :** ఇరుపక్షాలు విశాల హృదయంతో, హేతుబద్ధమైన మనస్సుతో, పరస్పర గౌరవంతో సమావేశమైనప్పుడు 'పరిష్కరించలేనంత పెద్ద సమస్య, సంక్లిష్టమైన సమస్య ఏదీ ఉండదు కాబట్టి భారతదేశంతో ఉన్న సరిహద్దు వివాదాన్ని ద్వైపాక్షిక యంత్రాంగాల ద్వారా పరిష్కరించుకోవాలని నేపాల్ కోరుకుంటోంది' అని ఆదివారం నేపాల్ విదేశాంగ మంత్రి శిశిర్ ఖనాల్ అన్నారు. తద్వారా మూడో పక్షం జోక్యాన్ని న్యూఢిల్లీ తిరస్కరించడాన్ని ఆయన పరోక్షంగా సమర్థించారు. '21 శతాబ్దపు భౌగోళిక రాజకీయాలకు సంబంధించి వక్రీకరించిన, అతి సున్నితమైన కటకం ద్వారా న్యూఢిల్లీని చూడటానికి ఖాట్మండ్ నిరాకరిస్తోందని, బదులుగా స్పష్టమైన కళ్లతో నేపాల్ ఆర్థిక పరివర్తన అనే ఒకే పారదర్శక ఎజెండాతో భారతదేశాన్ని చూడాలని లక్ష్యంగా పెట్టుకుంది' అని ఖనాల్ చెప్పారు. నేపాల్ విదేశాంగ మంత్రి తన భారతదేశ సహచరుడు ఎస్.జైషన్‌తో వాణిజ్యం, కీలక సాంకేతికత, కనెక్టివిటీ, ఇంధనంతో సహా వివిధ రంగాలలో సంబంధాలను మరింత విస్తరించే మార్గాలపై దృష్టి సారించి, విస్తృత చర్చలు జరిపిన అనంతరం మీడియాతో మాట్లాడారు. ఇరుదేశాల మధ్య సరిహద్దు వివాదంపై నేపాల్ ప్రధానమంత్రి బాలేంద్ర షా ఇటీవల చేసిన వ్యాఖ్యల వల్ల రేగిన వివాదం నేపథ్యంలో శుక్రవారం నుంచి ఆయన మూడురోజుల న్యూఢిల్లీ పర్యటన జరిగింది.ఈ సమస్యను పరిష్కరించడానికి చైనా, యునైటెడ్ కింగ్‌డమ్‌ల ప్రమేయాన్ని కూడా బాలేంద్ర షా సూచించారు. ' కాగితంపై చేసిన వాగ్దానాలకు, క్షేత్రస్థాయిలో అందించిన భౌతిక వాస్తవికతకు మధ్య ఉన్న అంతరాన్ని పూడ్చటం, నైరూప్య రాజకీయ ప్రకటనల నుంచి దూరంగా జరిగి, జీవితాన్ని మార్చే ఫలితాలను అందించడం మా ప్రాథమిక బాధ్యత' అని ఆయన చెప్పారు.'గతంలోని ఆందోళనలకు పరిమితం కాకుండా, మన ఉమ్మడి భవిష్యత్తు ఆశలు, ఆశాజనకమైన అవకాశాలతో ముందుకు సాగే భాగస్వామ్యాన్ని మనం నిర్మిద్దాం' అని ఖనాల్ అన్నారు. సరిహద్దు సమస్యను ప్రస్తావిస్తూ నేపాల్ విదేశాంగ మంత్రి 'నిజమైన పరస్పర ఆధారపడటం అంటే ఉమ్మడి సరిహద్దులు 'నిరుత్సాహానికి అడ్డంకులుగా కాకుండా అత్యంత సమర్థవంతమైన వారధులుగా పనిచేయడమేనని సూచించారు. లిపులేఖ్, లింపియాధుర, కాలాపానీ ప్రాంతాలపై నేపాల్, భారతదేశాల మధ్య చాలాకాలంగా సరిహద్దు వివాదం ఉంది. ఈ భూభాగాలు ఉత్తరాఖండ్‌లో భాగమని భారతదేశం నిరంతరం వాదిస్తూనే ఉంది. బ్రిటీష్ గ్రంథాలయాలు, మ్యూజియంల నుంచి పత్రాలు, చారిత్రక వివరాలను పొందే సందర్భంలోనే వారి ప్రేయం ఉద్దేశించబడిందని నేపాల్ విదేశాంగ మంత్రి చెప్పారు. దేశాలు తమ సంబంధాలను ఉన్నత స్థాయికి తీసుకెళ్లి, రూపాంతరం చెందించడానికి దశాబ్దాలలో అత్యంత అనుకూలమైన అవకాశాన్ని 2026 సంవత్సరం కల్పించిందని ఖనాల్ చెప్పారు. లిప్‌లేఖ్ ప్రాంతం గుండా కైలాస మానస యాత్రపై నేపాల్ అభ్యంతరం గురించి అడగ్గా ఆ ప్రాంతం తమ దేశానికి సంబంధించిందని పేర్కొంటూ, నేపాల్‌ను సంప్రదించకుండా ఆ యాత్ర మార్గాన్ని ఉపయోగించుకోవడానికి భారత్–చైనాల మధ్య కుదిరిన అవగాహన పట్ల ఖాట్మండ్ ఆందోళన వ్యక్తం చేసిందని నేపాల్ విదేశాంగ మంత్రి శిశిర్ ఖనాల్ పేర్కొన్నారు. అదే సమయంలో భారతదేశంతో ఉన్న ద్వైపాక్షిక యంత్రాంగాల ద్వారా ఈ సమస్యకు పరిష్కారం కోరుకుంటున్నట్లు ఖనాల్ నొక్కిచెప్పారు. నేపాల్‌లోని కొత్త ప్రభుత్వానికి భారతదేశంతో బలమైన, లోతైన సంబంధాలు ఉన్నాయని ఖనాల్ వివరించారు.

# రీల్స్ చేయడం... పకోడీలు వేయడం..

**దేశ యువత ఇదే పని చేయాలని మోదీ చూస్తున్నారు...**

- సిబిఎస్ఇ లోపాలను బయటపెట్టడం యువత సాధించిన విజయం
- ప్రముఖ మీడియా సంస్థలు, పరిశోధనాత్మక జర్నలిస్టులు చేయలేని పని ఇద్దరు విద్యార్థులు చేశారు : రాహుల్ గాంధీ



**న్యూఢిల్లీ :** సిబిఎస్ఇ, కోఎఫ్ట్ మధ్య ఉన్న కుమ్మక్కును దేశం ముందు బట్టబయలు చేసిన సార్థక్ సిద్ధాంత్ అనే విద్యార్థిని, అతని సహచరుడు నిసర్గ అధికారిని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఆదివారం ప్రశంసించారు. యువత కేవలం రీల్స్ చేస్తూ, పకోడీలు వేయిస్తూ ఉండాలని ప్రధాని నరేంద్ర మోదీ కోరుకుంటున్నారని, కానీ ఈ ఇద్దరు యువకులు మాత్రం ప్రశ్నలు అడగడమే కాకుండా వాటికి సమాధానాలను కూడా కనుగొన్నారని ఆయన అన్నారు. 12వ తరగతి బోర్డు పరీక్షల కోసం 'ఆన్‌స్క్రీన్ మార్కింగ్ సిస్టమ్' (ఒఎస్ఎం) నిర్వహణకు వెండర్‌ను ఎంపిక చేసే టెండర్ ప్రక్రియలో అక్రమాలను ఎత్తిచూపిన 18 ఏళ్ల విద్యార్థి సార్థక్ సిద్ధాంత్‌తో గత వారం తాను జరిపిన సమావేశానికి సంబంధించిన వీడియోను గాంధీ ఎక్స్‌లో పంచుకున్నారు. ఆ వీడియోతో పాటు హిందీలో చేసిన పోస్ట్‌లో రాహుల్ 'సార్థక్ వయసు 18 ఏళ్లే అయినప్పటికీ, ఆలోచనా విధానం, ధైర్యం, సూత్రాల విషయంలో అతను ఎవరికీ తీసిపోడు. దేశంలోని ప్రముఖ మీడియా సంస్థలు, పరిశోధనాత్మక జర్నలిస్టులు చేయలేని పనిని అతను, అతని సహచరుడు నిసర్గ సాధించారు: వారు సిబిఎస్ఇ, కోఎఫ్ట్ మధ్య ఉన్న కుమ్మక్కును దేశం ముందు బట్టబయలు చేశారు. దేశానికి చెందిన ఒక 18 ఏళ్ల యువకుడు సిబిఐ కంటే వేగంగా, తెలివిగా వ్యవహరించి నిరూపించాడు. యువత సాధించిన ఈ విజయం నిజమైన అర్థంలో ప్రభుత్వానికి ఓటమి' అన్నారు. ప్రశ్నలు అడగకుండా లేదా కళ్లు తెరిచి చూడకుండా, మన యువత కేవలం రీల్స్ చేస్తూ, పకోడీలు వేయిస్తూ ఉండాలని మోదీజీ కోరుకుంటున్నారని మండిపడ్డారు. కానీ ఈ యువకులు ప్రశ్నలు అడిగారు, అలాగే సమాధానాలను కూడా కనుగొన్నారని లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు ప్రశంసించారు. ఇదే భారతదేశపు నిజమైన యువ శక్తి జిజ్ఞాస కలిగిన, అవగాహన ఉన్న, సమాచారం తెలిసిన శక్తి అని, దేశ భవిష్యత్తును తప్పుదారి పట్టించలేమని గుర్తు పెట్టుకోవాలని పిలుపునిచ్చారు. ఆన్‌స్క్రీన్ మార్కింగ్ విధానం వివాదం నేపథ్యంలో ప్రభుత్వం ఇద్దరు ఉన్నత సిబిఎస్ఇ అధికారులను బదిలీ చేసినప్పటికీ, ప్రతిపక్ష కాంగ్రెస్ దీనిని కంటితుడుపు చర్యగా, కప్పిపుచ్చే ప్రయత్నంగా కొట్టిపారేసింది. విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను తొలగించాలని, తక్షణమే స్వతంత్ర న్యాయ విచారణకు ఆదేశించాలని రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. ఒఎస్ఎం టెండరింగ్ ప్రక్రియలో జరిగిన అవకతవకల గురించి సమాచారాన్ని ఎలా కనుగొనగలిగారని రాహుల్‌గాంధీ ఆ వీడియోలో సిద్ధాంత్‌ను ప్రశ్నించారు. గత మంగళవారం సిద్ధాంత్, అతని కుటుంబాన్ని కలిసిన తర్వాత, రాహుల్ గాంధీ ఆ సమావేశానికి సంబంధించిన చిత్రాలను పోస్ట్ చేస్తూ, 'సార్థక్, మీ సూత్రాలకు కట్టుబడి ఉండండి' అని పేర్కొన్నారు. ఒఎస్ఎం టెండరింగ్ ప్రక్రియలో జరిగిన అవకతవకలపై సిద్ధాంత్ మంగళవారం పార్లమెంటరీ ప్యానెల్ ముందు ఒక ప్రజెంటేషన్ కూడా ఇచ్చారు.

## మెట్రోలో కర్ణాటక సిఎం ప్రయాణం



**న్యూఢిల్లీ :** కర్ణాటక ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు స్వీకరించిన తర్వాత డికె శివకుమార్ తొలిసారిగా తన సొంత నియోజకవర్గమైన కనకపురలో పర్యటించారు. సామాన్య ప్రయాణికులకు ఎలాంటి ట్రాఫిక్ సమస్యలు, ఇబ్బందులు తలెత్తకూడదనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి డికె శివకుమార్ విధాన సౌధ మెట్రోస్టేషన్ నుంచి కనకపుర మెట్రోస్టేషన్ వరకు మెట్రో రైలులో ప్రయాణించారు. ఏ విధమైన హంగూ ఆర్భాటాలు లేకుండా ఒక సామాన్యుడిలా మెట్రో ఎక్కిన ముఖ్యమంత్రిని చూసి తోటి ప్రయాణికులు ఒక్కసారిగా ఆశ్చర్యానికి గురయ్యారు. ఈ ప్రయాణంలో భాగంగా ఆయన రైల్లోని ప్రయాణికులతో చాలా సాదాసీదాగా, సరదాగా ముచ్చటిస్తూ వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. మెట్రో ప్రయాణం ముగిసిన తర్వాత కనకపుర స్టేషన్ వద్ద దిగి, అక్కడి నుంచి రోడ్డు మార్గంలో ముందుకు సాగారు. వినూత్నంగా ఆలోచించి ప్రజలకు ఇబ్బంది కలగకుండా మెట్రోను ఎంచుకున్న సిఎం డికె శివకుమార్‌పై బెంగళూరు ప్రజల నుంచి ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.

**గ్యాస్ ధర పెంపుపై నాడు రచ్చ చేశారు...**

## ఇప్పుడెందుకు రోడ్లపైకి రారు...

- బిజెపి నేతలను ప్రశ్నించిన కాంగ్రెస్
- మోదీ సర్కార్‌పై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మండిపాటు



**న్యూఢిల్లీ :** దేశీయ ఎల్‌పిజి ధరల పెంపుపై కాంగ్రెస్ మోదీ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించింది. యుపిఎ హయాంలో ధరల పెరుగుదలపై గట్టిగా నిరసన తెలిపిన బిజెపి నేతలు, ఇప్పుడు సిలిండర్లతో రోడ్లపైకి ఎందుకు రావడం లేదని ప్రశ్నించింది. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో 41 దేశాల నుండి ఇంధన వనరులను సేకరించేలా వైవిధ్య భరితమైన ఏర్పాట్లు చేస్తామని పార్లమెంటులో ప్రధాని నరేంద్ర మోదీ గొప్ప ప్రకటనలు చేశారని, ఆ ప్రకటనల పరిస్థితి ఏమైందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రశ్నించారు. నేటికీ గ్రామీణ ప్రాంతాల్లో ఎల్‌పిజి కొరత ఎందుకు కొనసాగుతోందని ఆయన నిలదీశారు. 'ఆకాశాన్ని తాకుతున్న దేశీయ ఎల్‌పిజి ధరలు సామాన్యుల వంటిళ్లను అతలాకుతలం చేసేలా ఉన్నాయి! గత మూడు నెలల్లో మోదీ ప్రభుత్వం దేశీయ ఎల్‌పిజి సిలిండర్ల ధరను రూ. 89 మేర పెంచింది. మాకు మూడు ప్రశ్నలు ఉన్నాయి: పశ్చిమాసియా సంక్షోభం నేపథ్యంలో 41 దేశాల నుండి ఇంధన వనరులను సేకరించేలా వైవిధ్యభరితమైన ఏర్పాట్లు చేస్తామని మోదీ... పార్లమెంటులో గొప్ప ప్రకటనలు చేశారు. ఆ ప్రకటనల పరిస్థితి ఏమైంది? గ్రామీణ ప్రాంతాల్లో నేటికీ ఎల్‌పిజి కొరత ఎందుకు కొనసాగుతోంది? ఉజ్వల పథకం కింద, 2025–26లో 5.56 కోట్ల కుటుంబాలకు ఒక్క రీఫిల్ కూడా లభించలేదు (లేదా కేవలం ఒక్కటి మాత్రమే లభించింది). వీరిలో 3.30 కోట్ల కుటుంబాలు ఒక్క సిలిండర్ రీఫిల్ కూడా తీసుకోలేదు. ఈ పరిస్థితి పశ్చిమాసియా సంక్షోభానికి ముందే ఉంది. ఇది మోదీ ప్రభుత్వం లాభాపేక్షతో వ్యవహరించడం వల్ల వచ్చిన ఫలితం కాదా?' అని ఖర్గే ఎక్స్ వేదికగా ప్రశ్నించారు. యుపిఎ హయాంలో మోదీ, బిజెపి నాయకులు ధరల పెరుగుదలపై పెద్ద ఎత్తున ఆందోళనలు చేసేవారని, మరి గత 12 ఏళ్లలో మోదీ ప్రభుత్వం దేశీయ ఎల్‌పిజి ధరలను రూ. 530 మేర పెంచిందన్నది వాస్తవం కాదా? మరి ఇప్పుడు బిజెపి నాయకులు ఎల్‌పిజి సిలిండర్లతో నిరసన తెలుపుతూ ఎందుకు రోడ్లపైకి రావడం లేదు అని ఆయన ప్రశ్నించారు. మరోవైపు, ప్రభుత్వ రంగ చమురు మార్కెటింగ్ సంస్థలు (ఒఎంసిలు) భారీ లాభాలను ఆర్జిస్తున్నప్పటికీ, ఎల్‌పిజి ధరలను పదేపదే ఎందుకు పెంచుతున్నారని కాంగ్రెస్ ఎంపి మనీశ్ తివారి కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. 'మూడు ప్రభుత్వ రంగ చమురు కంపెనీలు కలిసి 2025–26 ఆర్థిక సంవత్సరంలో రూ.77,280.65 కోట్ల మేర లాభపడ్డాయి. ఇది 2024–25 ఆర్థిక సంవత్సరంతో పోల్చితే 130 శాతం అధికం. 2025–26 నాలుగో త్రైమాసికంలో ఈ మూడు కంపెనీలు రూ.19,470 కోట్ల లాభాలను పొందాయి. గతేడాది ఇదే కాలంతో పోల్చితే, వాటి లాభం 40 శాతం మేర పెరిగింది. ఈ విధంగా చమురు మార్కెటింగ్ కంపెనీలు భారీ లాభాలు గడిస్తున్నప్పటికీ, పదేపదే వంట గ్యాస్ సిలిండర్ ధరలను గుట్టుచప్పుడు కాకుండా ఎందుకు పెంచుతున్నారు? 2026 మార్చి 7న వంట గ్యాస్ సిలిండర్ ధరను రూ.60 పెంచిన మీరు, ఇప్పుడు మరో రూ.29 పెంచారు. ఒకవైపు చమురు కంపెనీలు లాభాల్లో మునుగుతుంటే, ప్రజలు మాత్రం ఈ క్రూరమైన ధరల విధానం కింద నలిగిపోతున్నారు. ఇదేనా మీ పాలన?' అని కాంగ్రెస్ ఎంపి మనీశ్ తివారి నిలదీశారు.

## రాఘవ లారెన్స్ పొలిటికల్ ఎంట్రీ!

**11న కీలక ప్రకటన**



**న్యూఢిల్లీ :** తమిళ చిత్ర పరిశ్రమ నుంచి మరో స్టార్ హీరో రాజకీయ రంగప్రవేశానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టు ఊహాగానాలు జోరుగా సాగుతున్నాయి. ఎంతో మందికి ఉచిత వైద్యం అందిస్తూ రియల్ హీరోగా గుర్తింపు తెచ్చుకున్న రాఘవ లారెన్స్ ప్రత్యక్ష రాజకీయాల్లోకి వస్తున్నట్లు స్పష్టమైన సంకేతాలు ఇచ్చారన్న టాక్ జోరుగా వినిపిస్తోంది. ఆయన రాకతో తమిళనాడులో సరికొత్త రాజకీయ సమీకరణాలు మొదలవుతాయా? అన్నది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. కొన్ని రోజులుగా తమిళ రాజకీయ వర్గాల్లో రాఘవ లారెన్స్ పోటీపై ఓ ఆసక్తికరమైన ప్రచారం జరుగుతోంది. ఆ రాష్ట్రంలోని కీలక తిరుచ్చి ఈస్ట్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఆయన బరిలోకి దిగబోతున్నట్లు వార్తలు వస్తున్నాయి. ముఖ్యంగా.. తమిళ స్టార్ హీరో, తమిళగ వెట్రి కజగం(టివికె) పార్టీ అధినేత, సిఎం విజయ్ గతంలో తాను గెలిచిన తిరుచ్చి ఈస్ట్ స్థానాన్ని వదులుకున్న నేపథ్యంలో.. ఆ సీటు నుంచి లారెన్స్ పోటీ చేయడం ఖాయమనే ప్రచారం జోరందుకుంది. లారెన్స్‌కు విజయ్‌తో ఉన్న ఆత్మీయ సంబంధాల నేపథ్యంలో ఈ ఊహాగానాలకు మరింత బలం చేకూరింది. కాగా, తన పొలిటికల్ ఎంట్రీ, తిరుచ్చి ఈస్ట్ పోటీపై వస్తున్న వార్తలపై రాఘవ లారెన్స్ స్పందించారు. ఆయన తన అఫీషియల్ ఎక్స్ ఖాతాలో ఒక పోస్ట్ చేస్తూ.. 'నా రాజకీయ ప్రయాణం, తిరుచ్చి ఈస్ట్ నియోజకవర్గం నుంచి పోటీ చేయడం గురించి సోషల్ మీడియాలో, పొలిటికల్ సర్కిల్స్‌లో రకరకాల వార్తలు వస్తున్నాయి. వీటన్నింటికీ సంబంధించి, నా భవిష్యత్తు కార్యాచరణపై ఈనెల 11న ఓ కీలక ప్రకటన చేయబోతున్నాను. నా అభిమానులు, ప్రజలు అప్పటివరకు వేచి చూడాలని కోరుతున్నాను' అని పేర్కొన్నారు.

# అనుమానాస్పద విదేశీయులు వివరాల ఇవ్వాల్సిందే...

**'సర్' కొనసాగుతున్న వేళ రాష్ట్రాల ఎన్నికల యంత్రాంగానికి ఇసి ఆదేశం**




**న్యూఢిల్లీ :** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) సమయంలో విదేశీయులుగా అనుమానం ఉన్న వారి కేసులను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని ఎన్నికల సంఘం (ఇసి) తన రాష్ట్ర ఎన్నికల యంత్రాంగాన్ని ఆదేశించింది. అలాగే ఏ ఓటరు నుంచైనా ఓటరు నమోదు ఫారమ్‌లు తిరిగి రాకపోతే, బూత్ స్థాయి అధికారులు (బిఎల్ఒ) పొరుగున ఉన్న వారిని విచారణ చేయాలని సూచించింది. ఈ విధంగా సదరు ఓటరు అక్కడ ఉన్నారా? వేరే ప్రాంతానికి వెళ్లారా? మరణించారా? లేదా ఒకే పేరు రెండుసార్లు నమోదు అయ్యిందా? మొదలైన వివరాలను తెలుసుకొని నమోదు చేయాలని ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. ఎన్నికల సంఘం 'ఎస్ఐఆర్' నిర్వహణలో అనుసరించాల్సిన విధివిధానాలపై మే 14న రాష్ట్రాల ప్రధాన ఎన్నికల అధికారులకు వివరణాత్మకమైన మార్గదర్శకాలు జారీ చేసింది. అందులో 'ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు (ఇఆర్ఒలు) అనుమానిత విదేశీ పౌరుల కేసులను పౌరసత్వ చట్టం, 1955 కింద నియమితమైన అధికారుల దృష్టికి తీసుకువెళ్లాలి. ఈ విషయంలో అసిస్టెంట్ ఇఆర్ఒలు కూడా ఇఆర్ఒలాంటి అధికారాలనే కలిగి ఉంటారు అని స్పష్టం చేసింది. గతేడాది బిహార్ ఎన్నికల సంఘం ఎస్ఐఆర్ కోసం సిద్ధమవుతున్నప్పుడు, బంగ్లాదేశ్, నేపాల్, మయన్మార్ దేశాలకు చెందిన పౌరులను తమ క్షేత్రస్థాయి సిబ్బంది గుర్తించినట్లు అధికారులు పేర్కొన్నారు. అయితే వారి సంఖ్యను కానీ, ఆధారాలను కానీ ఎన్నికల యంత్రాంగం వెల్లడించలేదు. దీనిపై ప్రతిపక్ష పార్టీలు తీవ్ర విమర్శలు గుప్పించాయి. బిజెపి, దాని మిత్రపక్షాలకు అనుకూలంగా లేనివారిని ఓటర్ల జాబితా నుంచి తొలగించడానికే ఎన్నికల సంఘం ఇలాంటి ఆరోపణలు చేస్తోందని ఆరోపించాయి. ఈ నేపథ్యంలో మే 30న కేంద్ర ఎన్నికల సంఘం 16 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో మూడో విడత ఎస్ఐఆర్ ప్రక్రియను విడతలవారీగా ప్రారంభించింది. ప్రస్తుతం ఈ ఎస్ఐఆర్ ప్రక్రియ ఢిల్లీ, ఒడిశా, మిజోరం, సిక్కిం, మణిపూర్, ఉత్తరాఖండ్, ఆంధ్రప్రదేశ్, అరుణాచల్ ప్రదేశ్, హర్యానా, చండీగఢ్, తెలంగాణ, పంజాబ్, కర్ణాటక, మేఘాలయ, మహారాష్ట్ర, ఝార్ఖండ్, నాగాలాండ్, త్రిపుర, దాద్రా, నగర్ హవేలీ, దమన్ దీవ్‌లో జరుగుతోంది. కాగా, ప్రస్తుతం ఈ ఎస్ఐఆర్ ప్రక్రియ జరుగుతున్న పంజాబ్, ఝార్ఖండ్, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలు ప్రతిపక్షాల పాలనలో ఉన్నాయి. ఈ తాజా ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో 3.94 లక్షల మందికి పైగా బిఎల్ఒలు 36.73 కోట్ల మంది ఓటర్ల ఇళ్లకు వెళ్లి వివరాలు సేకరిస్తారు. గణన దశలో రాజకీయ పార్టీలు నియమించిన 3.42 లక్షల మంది బూత్ స్థాయి ఏజెంట్లు వారికి సహకరిస్తారు. హిమాచల్ ప్రదేశ్, జమ్ముకశ్మీర్, లఢాఖ్‌లలో మంచుతో కప్పబడిన ప్రాంతాల్లోని వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని 'సర్' షెడ్యూల్‌ను తరువాత ప్రకటిస్తారు. బీహార్, పశ్చిమ బెంగాల్, తమిళనాడు, కేరళ, పుదుచ్చేరి, ఉత్తర ప్రదేశ్, రాజస్థాన్, మధ్యప్రదేశ్, గుజరాత్, ఛత్తీస్‌గఢ్, గోవా, అండమాన్ నికోబార్ దీవులు, లక్షద్వీప్‌లలో సర్ ప్రక్రియ ఇప్పటికే ముగిసింది. అసోంలో 'ప్రత్యేక సవరణ' చేశారు.

**భారీగా ఓట్ల తొలగింపు**

ఎస్ఐఆర్ రెండో విడతలో 9 రాష్ట్రాలు, 3 కేంద్రపాలిత ప్రాంతాల ఉమ్మడి ఓటర్ల జాబితా నుంచి ఏకంగా 10.2 శాతం ఓట్లను తొలగించారు. ఇందులో మరణించిన వారే 60 లక్షల కంటే ఎక్కువ మంది ఉన్నారు. వాస్తవానికి గతేడాది అక్టోబర్ 27న ఈసీ రెండో విడత ఎస్ఐఆర్ ప్రకటించినప్పుడు ఈ 9 రాష్ట్రాలు, 3 కేంద్రపాలిత ప్రాంతాలు కలిపి మొత్తం ఓటర్ల సంఖ్య 50.99 కోట్లుగా ఉంది. ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తయిన తర్వాత ఈ సంఖ్య 45.81 కోట్లకు చేరింది. అంటే 5.18 కోట్ల కంటే ఎక్కువ మంది పేర్లు ఓటర్ల జాబితా నుంచి తొలగించింది.

# మోదీ సర్కార్ రాజకీయ మూల్యం చెల్లించక తప్పదు

**ధరల పెరుగుదల అదుపులో ఉందన్న ప్రభుత్వ వైఖరిపై ఎన్‌సిపి (ఎస్‌పి) చీఫ్ శరద్ పవార్ ఫైర్**



**కొల్హాపూర్ :** దేశంలో ధరల పెరుగుదలకు సంబంధించి కేంద్ర సర్కార్‌పై ఎన్‌సిపి (ఎస్‌పి) అధినేత శరద్ పవార్ విమర్శలు గుప్పించారు. నిత్యావసర వస్తువుల ధరలు తరచుగా పెరగడం సామాన్యుడిపై భారం మోపుతున్నందున, ప్రభుత్వం 'రాజకీయ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందన్నారు. ద్రవ్యోల్బణం కారణంగా దేశవ్యాప్తంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ధరల పెరుగుదల అదుపులో ఉందన్న ప్రభుత్వ వైఖరిపై మాజీ కేంద్ర మంత్రి ప్రశ్నించారు. ధరల పెరుగుదలపై బిజెపి తన పాత వైఖరిని విడిచిపెట్టిందని మహారాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు విజయ్ వడెట్టివార్ ఆరోపించారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు సామాన్య ప్రజల సమస్యలపై చూపినంత శ్రద్ధను అధికార పార్టీ ఇప్పుడు చూపడం లేదని ఆయన అన్నారు. తాజా ఎల్‌పిజి ధరల పెంపుపై ప్రశ్నించగా 'ద్రవ్యోల్బణాన్ని నియంత్రిస్తున్నామని ప్రధానమంత్రి అంటున్నారు. నియంత్రణ అంటే ప్రజలను దశలవారీగా షాక్‌కు గురిచేయడమే. దీనికి బాధ్యులైన వారు రాజకీయ మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుంది' అని పవార్ బదులిచ్చారు. గృహ వినియోగ ఎల్‌పిజి సిలిండర్ల ధరల తాజా పెంపుపై కాంగ్రెస్ శాసనసభాపక్ష నాయకుడు విజయ్ వడెట్టివార్ కూడా కేంద్ర, రాష్ట్రంలోని బిజెపి నేతృత్వంలోని ప్రభుత్వాలను విమర్శించారు. యుపిఎ హయాంలో వంటగ్యాస్ ధరలు పెంచినప్పుడల్లా బిజెపి నాయకులు నిరసనలు చేపట్టేవారని, కానీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇంధనం, ఎల్‌పిజి ధరలు పదేపదే పెరిగినా మౌనంగా ఉన్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత కొన్ని నెలలుగా వాణిజ్య ఎల్‌పిజి సిలిండర్ల ధరలు విపరీతంగా పెరిగాయని, ఇటీవలి సంవత్సరాలలో పెట్రోల్, డీజిల్, సీఎన్‌జీ ధరలు కూడా పలుమార్లు సవరించబడ్డాయని ఆయన పేర్కొన్నారు. ద్రవ్యోల్బణం గృహ బడ్జెట్‌లను తీవ్రంగా ప్రభావితం చేస్తూ, మధ్యతరగతి, ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలపై అదనపు భారాన్ని మోపుతోందని ఆ కాంగ్రెస్ నాయకుడు ఆరోపించారు.

**ఇండియా కూటమి భేటీలో పాల్గొనేందుకు**

## ఢిల్లీ వెళ్లిన మమత



**కోల్‌కతా :** సోమవారం ఇండియా కూటమి సమావేశం జరగనుండగా, ఒక రోజు ముందే తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ ఆదివారం ఢిల్లీకి వెళ్లారు. పార్లమెంటులోని పార్టీ ఎంపిలలో చీలిక రావచ్చనే ఊహాగానాల వస్తుండడంతో వ్యవహారాన్ని చక్కదిద్దేందుకు చర్యలు చేపట్టారు. మమతతో పాటు రాజ్యసభ ఎంపి డోలా సేన్, సీనియర్ లోక్‌సభ ఎంపి కళ్యాణ్ బెనర్జీ కూడా ఉన్నారు. పశ్చిమ బెంగాల్ అసెంబ్లీలో తమ శాసనసభ విభాగంపై నియంత్రణ కోల్పోయేలా చేసిన తిరుగుబాటు, పార్లమెంటరీ పార్టీకి కూడా వ్యాపించవచ్చనే సూచనలు పెరుగుతున్న నేపథ్యంలో, టిఎంసి జాతీయ ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీ శనివారమే ఢిల్లీకి వెళ్లారు. ప్రతిపక్ష ఇండియా కూటమి సమావేశం కోసం మమతా బెనర్జీ, ఆమె మేనల్లుడు అభిషేక్ ఆదివారం కలిసి ఢిల్లీకి ప్రయాణించాల్సి ఉండగా, డైమండ్ హార్బర్ ఎంపి ఒక రోజు ముందే వెళ్లారు. అసెంబ్లీలో ఇప్పటికే జరిగిన దానిని పార్లమెంటులో కూడా పునరావృతం చేయడానికి అసమ్మతి టిఎంసి నాయకులు, ఎంపిలు ప్రయత్నిస్తున్నారనే వార్తల నేపథ్యంలో, సోమవారం జరగనున్న ఇండియా కూటమి సమావేశానికి ముందు టిఎంసి అగ్ర నాయకత్వం తమ సొంత సభలోని పరిస్థితిని స్వయంగా సమీక్షించే అవకాశం ఉంది. 1998లో పార్టీ ఏర్పడినప్పటి నుండి మమతా బెనర్జీకి ఎదురైన అతిపెద్ద ఎదురుదెబ్బలలో ఒకటిగా, గత వారం టిఎంసి ఎమ్మెల్యేలలో మూడింట రెండు వంతుల కంటే ఎక్కువ మంది అంటే 80 మంది శాసనసభ్యులలో 58 మంది దాని అధికారిక శాసనసభ విభాగం నుండి విడిపోయి, బహిష్కృత ఎమ్మెల్యే రీటాబ్రత బెనర్జీ నాయకత్వంలో ప్రధాన ప్రతిపక్ష కూటమిగా గుర్తింపు పొందారు. పార్లమెంటు ఉభయ సభలలోని ఎంపిల మద్దతును సమీకరించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఈ పరిణామాల గురించి తెలిసిన వర్గాలు తెలిపాయి. తిరుగుబాటు పార్టీ ఎంపిలు కొద్ది రోజుల్లోనే తమ ఎత్తుగడ వేయవచ్చనే సూచనలు ఉన్నందున, మమతా బెనర్జీ ఢిల్లీలో ఉన్నప్పుడు తన వర్గాన్ని ఐక్యంగా ఉంచడానికి తీవ్రమైన చర్చలు జరగవచ్చని భావిస్తున్నారు.

**రాజస్థాన్‌లో 2024–2026 మధ్య...**

## పురుగుమందులు వాడిన 535 మంది రైతులు మృతి

**బాధిత కుటుంబాలకు రూ.510 కోట్ల సహాయం అందజేత**

**జైపూర్ :** శాసనసభలో ఒక ప్రశ్నకు అందించిన సమాచారం ప్రకారం...రాజస్థాన్ రాష్ట్రంలో 2024 జనవరి నుంచి 2026 జనవరి మధ్య పురుగుమందులు అసురక్షితంగా వాడిన ఫలితంగా 535 మంది రైతులు మరణించారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే అమిన్ కాగ్జీ అడిగిన ప్రశ్నకు వ్యవసాయ శాఖ ఇచ్చిన ఒక లిఖితపూర్వక సమాధానంలో ఆ కాలంలో ముఖ్యమంత్రి సంక్షేమం పథకం కింద మరణించిన రైతుల కుటుంబాలకు రూ.510 కోట్ల సహాయం అందించినట్లు తెలిపింది. పురుగుల మందు పిచికారీ చేసే సమయంలో అవసరమైన భద్రతా చర్యలు చేపట్టకపోవడం, పురుగుమందులను విచక్షణారహితంగా, అసురక్షితంగా ఉపయోగించడం వల్ల రైతులు, వ్యవసాయ కార్మికులు, ఇతర వ్యక్తులు అనారోగ్యానికి గురయ్యే అవకాశం ఉందని, కొన్ని సందర్భాలలో మరణించే అవకాశం కూడా ఉందని ఆ శాఖ తెలియజేసింది. జిల్లాల వారీగా డేటా ప్రకారం...బికనీర్‌లో అత్యధికంగా 57 మరణాలు నమోదయ్యాయి. ఆ తర్వాత చురు (56 మరణాలు) హనుమాన్‌గఢ్ (42), జోధ్‌పూర్ (38), శ్రీ గంగానగర్ (31), బేవార్ (31) మరణాలు సంభవించాయి. ధోల్పూర్, జైసల్మేర్, బార్మర్, సిరోహి, బన్స్‌వారా, దుంగర్‌పూర్, సలుమార్‌లలో ఎలాంటి మరణాలు నమోదుకాలేదు.కోట్‌పుట్లీ–బెహ్రోర్, బలోత్ర, జాలోర్, ఉదయ్‌పూర్ ఒక్కొక్కటి ఒక మరణాన్ని నమోదుచేశాయి.

**హింసాత్మక సంఘటనలకు ప్రభావితం కాకుండా...**

## యువతలో చైతన్యం కలిగించాలి

**మణిపూర్‌లోని పలు జిల్లాల గ్రామస్తులకు భద్రతా దళాల విజ్ఞప్తి**



**ఇంఫాల్ :** కాంగ్‌పోక్పి, ఉఖ్రుల్ జిల్లాలు సహా, ఇతర జిల్లాలలో జరిగిన హింసాత్మక సంఘటనలకు యువత ప్రభావితం కాకుండా ఉండేలా వారిలో చైతన్యం కలిగించాలని గ్రామ అధికారులు, పౌర సమాజానికి భద్రతా దళాలు విజ్ఞప్తి చేశాయి. కాంగ్‌పోక్పిలో తుపాకీ దాడిలో ముగ్గురు మరణించిన ఒక రోజు తర్వాత, మణిపూర్‌లోని ఉఖ్రుల్‌లో భద్రతా దళాలు కూంబింగ్ ఆపరేషన్ నిర్వహించాయి. ఈ క్రమంలో భద్రత దళాలు ఆ జిల్లాల పరిధిలో యువత పక్కదారి పట్టకుండా చైతన్యం పెంపొందించేందుకు ఈ చర్యలకు ఉపక్రమించాయి. 'కోట్లేన్‌లో ఇటీవల జరిగిన హింసాకాండ ఇతర ప్రాంతాలకు వ్యాపించకుండా నిరోధించేందుకు కుకీలు అధికంగా ఉండే కాంగ్‌పోక్స్ జిల్లాలో సరిహద్దులు పంచుకునే టాంగ్‌ఖుల్ నాగాలు అధిక సంఖ్యలో ఉండే ఉఖ్రుల్ జిల్లాలోని లీటా మహాదేవ్, సినాకేథెల్ చుట్టుపక్కల ప్రాంతాలు, హైవే ప్రాంతాలలో భద్రతా దళాలు శనివారం కూంబింగ్ ఆపరేషన్ చేపట్టాయి' అని పోలీసులు ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం కాంగ్‌పోక్పి జిల్లాలోని లోయిబోల్ ఖుల్లెన్ గ్రామంలో జరిగిన తుపాకీ దాడిలో ముగ్గురు పౌరులు మరణించిన నేపథ్యంలో ఈ పరిణామ క్రమం చోటుచేసుకుంది. రెండు వర్గాల గ్రామాల్లో గస్తీ నిర్వహించి, బంకర్లను గుర్తించి నిర్వీర్యం చేసినట్లు పోలీసులు తెలిపారు. వారి అవసరమైన మద్దతు కోసం గ్రామ అధికారులను, పౌర సమాజ సంస్థలను సంప్రదించడం జరిగింది. ఎలాంటి ముప్పునైనా నివారించడానికి ఆ ప్రాంతంలో భద్రతా దళాలు ఉంటాయని హామీ ఇవ్వబడింది అని పోలీసుల ప్రకటన తెలియజేసింది. ఇతర ప్రాంతాలలో జరిగే సంఘటనలకు ప్రభావితులై గ్రామాల సమీపంలో హింసకు పాల్పడవొద్దని తమ యువతకు అవగాహన కల్పించాలని కూడా వారిని కోరడం జరిగిందని పోలీసులు తెలిపారు.

### ఇరాన్ ఆస్తులు ఖర్చుపెట్టి

# గల్ఫ్ మిత్రదేశాల పునర్నిర్మాణం: ట్రంప్

**అంచనా వ్యయం తేల్చాలని స్కాట్ బెస్సెంట్ ఆదేశం**

**వాషింగ్టన్:** పశ్చిమాసియాలో యుద్ధ దాడులవల్ల నష్టపోయిన గల్ఫ్ మిత్ర దేశాల పునర్నిర్మాణానికి ఇరాన్ ఆస్తులను ఉపయోగించాలని అమెరికా ఆలోచిస్తోంది. గల్ఫ్ ప్రాంతంలో అమెరికా మిత్రదేశాలకు ఇరాన్ వల్ల కలిగిన నష్టం ఎంత? ఎంత ఖర్చు చేయాలి? అనే విషయాలు తేల్చి చెప్పాలని ఒక బృందానికి అమెరికా ఆర్థికమంత్రి స్కాట్ బెస్సెంట్ ఆదేశించారని విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ రాయిటర్స్ వార్తాసంస్థ పేర్కొంది. అమెరికా స్తంభింపజేసిన 24 బిలియన్ డాలర్ల ఇరాన్ ఆస్తులను విడుదల చేస్తేనే రెండు దేశాలమధ్యా ఒప్పందం ఖరారు అవుతుందని ఇరాన్ సర్వోన్నత నాయకుడు మొజ్తాబా ఖమేనీ సహాయకుడు మొహ్సెన్ రెజాయీ ప్రకటించిన మరునాడే ఈ పరిణామం సంభవించింది. దీంతో అమెరికా–ఇరాన్ మధ్య జరుగుతున్న యుద్ధ విరమణ చర్చల్లో ఒత్తిడి, ఉద్రిక్తత పెరగడానికి తాజా దాడులతో పాటు మరో కొత్త అజ్యాన్ని ట్రంప్ జత చేసినట్లయింది.



ఐతే ఏ రకమైన ఇరాన్ ఆస్తులను పునర్నిర్మాణానికి ఉపయోగించాలనే విషయాన్ని స్కాట్ బెస్సెంట్ స్పష్టంగా చెప్పలేదని, అమెరికా ఆర్థికశాఖ ఉపయోగించిన భాషను బట్టి చూస్తే, ఈ ఖర్చు స్తంభింపజేసిన ఆస్తులకే పరిమితం కాకపోవచ్చునని కూడా రాయిటర్స్ తెలియజేసింది. గతంలో జరిగిన నష్టాలకు కూడా ఇరాన్ ఆస్తులను ఉపయోగించుకోవాలని కూడా అమెరికా ఆలోచిస్తున్నట్లు ఆ వార్తాసంస్థ పేర్కొంది. ఇరాన్ వల్లనే పర్షియన్ గల్ఫ్‌లో దేశాల మౌలిక సదుపాయాలకు తీవ్ర నష్టం జరిగిందని, అందువల్ల ఇరాన్ ఆస్తులనే వాటికి ఉపయోగించాలని ట్రంప్ భావించారు. ఇరాన్ దాడులు వల్ల గల్ఫ్‌లో అమెరికా సమకూర్చిన భద్రతా వ్యవస్థపై మిత్రదేశాలలో అపనమ్మకం ఏర్పడంది. ఈ పరిస్థితుల్లో అమెరికా ఈ నిర్ణయం తీసుకుంది. పునర్నిర్మాణం కోసం గల్ఫ్ దేశాలకు ఇరాన్ ఆస్తులను తరలించే మార్గాలను కూడా అమెరికా అన్వేషిస్తోంది. రెండు దేశాలమధ్య వారం క్రితం కుదిరిన ఒక ముసాయిదా ఎంఓయు ప్రతిపాదనలో ఇరాన్ ఆస్తులను విడుదల చేయడంతోపాటు హోర్ముజ్ జలసంధిలో ఇరాన్ ఓడరేవులపై ఆంక్షలు ఎత్తివేయడం, తక్షణం యుద్ధం నిలిపివేయడం కీలక అంశాలుగా ఉన్నాయి. గడచిన మూడు నాలుగు రోజులుగా అమెరికా–ఇరాన్ మధ్య మళ్ళీ దాడులు జరుగుతున్నాయి. వీటికి ఈ రెండు దేశాలూ ఆత్మరక్షణ అని కొత్త పేరుకుపెట్టుకున్నాయి. వాస్తవానికి ఈ "ఆత్మరక్షణదాడులు" అనే పదాన్ని ట్రంప్ స్వయంగా తెరమీదకు తెచ్చారు. ఇరాన్ కూడా ఇప్పుడు గల్ఫ్‌లో అమెరికా మిత్రదేశాల్లో ఉన్న అమెరికా స్థావరాలపై దాడులు చేస్తూ అదే పదాన్ని ఉపయోగించుకుంటున్నది.

## మొజ్తాబా ఖమేనీకి పాకిస్థాన్ ప్రత్యేక లేఖ

**ఇరాన్ మంత్రి అరాఘ్చికి నఖ్వీ అందజేత**



**టెహ్రాన్:** పాకిస్థాన్ హోంశాఖామంత్రి మొహిసిన్ నఖ్వీ ఇరాన్‌లో పర్యటించారు. ఇరాన్ విదేశీ వ్యవహారాల మంత్రి అబ్బాస్ అరాఘ్చి, ఇరాన్ హోంశాకామంత్రి ఎస్కందర్ మోమెనీతో శనివారం రాత్రి సమావేశాలు జరిపారు. ఈ సందర్భంగా ఒక లేఖను అబ్బాస్ అరాఘ్చికి అందజేశారు. పాకిస్థాన్ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్, పాకిస్థాన్ సర్వసైన్యాధిపతి ఫీల్డ్ మార్షల్ సయ్యద్ ఆసిమ్ మునీర్ సంయుక్తంగా మొజ్తాబా ఖమేనీకి అందజేయాల్సిందిగా ఒక లేఖ ఇచ్చారు. ఆ లేఖను అరాఘ్చికి నఖ్వీ అందజేశారు. ఇటీవలికాలంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మొజ్తాబా ఖమేనీ చర్చల్లో కొంత క్రియాశీలంగా ఉంటున్నారని, అవకాశం వస్తే ఆయనతో సమావేశం కావడానికి తనకు అభ్యంతరం లేదని, ఆయనను కలుసుకోవాలని తాను కోరుకుంటున్నానని చెబుతున్నారు. ఈ పరిణామాలమధ్య ఒక లేఖ పాకిస్థాన్ పేరుతో ఇరాన్ చేరుకుంది. ప్రాంతీయ పరిణామాలు, అంతర్గత భద్రత తోపాటు ఇతర విషయాలను కూడా చర్చించినట్లు నఖ్వీ సోషల్ మీడియా పోస్టింగ్‌లో తెలియజేశారు. గల్ఫ్ ప్రాంతంలో మళ్ళీ అమెరికా–ఇరాన్ మధ్య యుద్ధ దాడులు ప్రారంభమైన పూర్వరంగంలో నఖ్వీ ఇరాన్‌లో పర్యటించారు. శుక్రవారంనాటు హోర్ముజ్ జలసంధిలో నాలుగు ఇరాన్ డ్రోన్లను అమెరికా సెంట్‌కామ్ కూల్చివేసింది. దాంతో కువైట్, బహ్రైన్‌లపై ఇరాన్ దాడులు చేసింది. ఈ దాడుల్లో ఆరు క్షిపణులను కూడా కూల్చివేసినట్లు సెంట్‌కామ్ ప్రకటించింది. గరుక్, ఖేష్మ్ ద్వీపంలోని ఇరాన్ తీర ప్రాంత నిఘా రాడార్లపై కూడా సెంట్‌కామ్ దాడులు చేసింది.

ఇరాన్‌పై అమెరికా–ఇజ్రాయెల్ 100 రోజుల క్రితం ప్రారంభించిన యుద్ధాన్ని ముగించేందుకు దౌత్య కార్యకలాపాలు నిర్వహించడానికి పాకిస్థాన్‌ను అమెరికా–ఇరాన్ ఒక అధికారిక మధ్యవర్తిగా గుర్తించాయి.

## ఆర్మేనియా రష్యా వైపా? ఇయు వైపా?

**భవితను నిర్దేశించే పోలింగ్ పూర్తి**

**ఎరెవాన్:** సంప్రదాయబద్ధంగా రష్యా పక్షం వహించాలా? లేక యూరోపియన్ యూనియన్‌లో చేరాలా? అనే విషయం తేల్చుకోలేక సంక్లిష్టమైన చౌరాస్తాలో నిలబడిపోయిన పశ్చిమాసియాదేశం ఆర్మేనియాలో పార్లమెంటుకు అత్యంత కీలకమైన ఎన్నికల పోలింగ్ ప్రక్రియ ఆదివారం జరిగిం.ది. ఈ ఎన్నికల ఫలితాలే ఆ దేశ భవిష్యత్తును నిర్ణయిస్తాయి. జాతీయ అసెంబ్లీగా పిలిచే ఆర్మేనియా పార్లమెంటులో 101 స్థానాలకు ప్రతినిధుల నుఎన్నుకోవడానికి ఆ దేశంలో 25 లక్షలమంది అర్హులైన ఓటర్లు ఉన్నారు. పాశ్చాత్య అనుకూల ప్రధానమంత్రి నికోల్ పాషిన్యాన్ 2018 నుండి 69 సీట్ల మెజార్టీతో అధికారంలో కొనసాగుతున్నారు. మరోసారి ఆయన గెలిచేందుకు, దేశంలో భారీ మార్పులు తీసుకువచ్చేందుకు ఉవ్విళ్ళూరుతున్నారు. దేశవ్యాప్తంగా ఏర్పాటు చేసిన 2,005 పోలింగ్ కేంద్రాలలో ఉదయం ఎనిమిది గంటలకు పోలింగ్ ప్రారంభమై రాత్రి ఎనిమిది గంటలకు ముగిసింది. పాషిన్యాన్ నాయకత్వానగల సివిల్ కాంట్రాక్ట్ కూటమి, ఆర్మేనియా కూటమి సహా 18 రాజకీయ పార్టీలు ఈ ఎన్నికల్లో పోటీ చేస్తున్నాయి. గత ఏడాది ఆవిర్భవించిన సామ్వేల్ కరపెట్యాన్ నాయకత్వానగల 'స్ట్రాంగ్ ఆర్మేనియా' పార్టీ కూడా ప్రముఖంగా పోటీలో ఉంది. ప్రభుత్వాన్ని కూల్చివేసేందుకు కుట్ర చేశారనే ఆరోపణలపై కరపెట్యాన్‌ను ప్రభుత్వం గృహనిర్బంధంలో ఉంచింది. ప్రస్తుత ప్రధానమంత్రి దేశాన్ని యూరప్‌వైపు నడిపించేందుకు యత్నిస్తున్నా రు. ఐతే యూరప్‌లో సభ్యత్వం తీసుకునే సమస్యపైనే ఉక్రేన్‌లో యుద్ధం ప్రారంభమైందన్న విషయాన్ని గుర్తుచేయడం ద్వారా పుతిన్ తాజాగా ఆర్మేనియాకు ఒక హెచ్చరిక చేశారు. 1991లో స్వాతంత్ర్యం పొందిన తర్వాత జూన్ ఏడో తేదీన మొదటిసారి ఆ దేశంలోపార్లమెంటు ఎన్నికలు అత్యంత కీలకంగా మారాయి. ఆర్థికంగా ఆర్మేనియా పూర్తిగా రష్యాపై ఆధారపడి ఉందన్న విషయం ప్రస్తుత ప్రధానమంత్రి నికోల్ షాహిన్యాన్‌కు తెలిసినప్పటికీ ఆర్మేనియాను యూరప్‌వైపు మళ్ళించాలనే ఆయన విధానానికి ఈ ఎన్నికలు ఒక పెద్ద పరీక్షగా మారాయి.ఆర్మేనియాపై రష్యా పట్టు కోల్పోతుందని ఆయన వర్గం చేస్తున్న ప్రచారం మధ్య రష్యా మద్దతుగల ప్రతిపక్ష నాయకుడు సామ్వెల్ కరపెట్యాన్ విస్తృత ప్రచారం చేస్తూ ప్రజల మద్దతు కూడగడుతున్నారు. షాహిన్యాన్ మాత్రం ఆర్మేనియా గుర్తింపును పునర్నిర్మించాలని యత్నిస్తున్నారు. 2023లో ఆర్మేనియా తన పర్వతప్రాంత కరాబాఖ్ భూభాగాన్ని అజర్‌బైజాన్‌కు కోల్పోయింది. ఈ భూభాగంకోసం 1990వ దశకంలో పోరాటం జరిగింది. ఈ అంశమే ఆర్మేనియా జాతీయ స్వాతంత్ర్య ఉద్యమంలో కీలకఅంశంగా, ఆనాడు ఈ ఉద్యమాన్ని ముందుకు నడిపించే అంశంగా మారిపోయింది. ఈ భూభాగాన్ని నిశ్చయంగా కోల్పోవడంతో జాతీయవాదానికి పునాది లేకుండా పోయిందనే వాదన మొదలైంది. ఈ ఎన్నికలకు ముందు గత ఏడాది ఆగస్టునెలలో వాషింగ్టన్‌లో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సమక్షంలో ఆర్మేనియా,అజర్‌బైజాన్ మధ్య ఒక శాంతి ఒప్పందం జరిగినప్పటికీ దానిపై సంతకాలు మాత్రం ఇంకా జరగలేదు. ఆర్మేనియాపై విధించిన దిగ్బంధనాన్ని ఎత్తివేసేందుకు అజర్‌బైజాన్,టర్కీలు చర్యలు తీసుకున్నాయి. ఆర్మేనియాలో ఎన్నికల తర్వాతే ఒక కొత్త రాజ్యాంగాన్ని రచించేందుకు ప్రజాభిప్రాయ సేకరణ కూడా జరగనున్నది.

### బంగ్లాదేశ్ సరిహద్దుల్లోకి

## బెంగాల్ నుండి మే నెలలో 166 మంది గెంటివేత

**నిర్మానుష్య ప్రదేశంలో స్తంభించిన 88 మంది..**

**ఢాకా:** పశ్చిమ బెంగాల్‌లో ఉన్న సరిహద్దుల నుండి భారత సరిహద్దు భద్రతా దళాలు బంగ్లాదేశ్‌లోకి మే నెలలో 166 మందిని గెం టివేసిందని ఆ దేశ పత్రికలు పేర్కొన్నాయి. ఈ విధంగా గెంటివేతకు గురైనవారంతా ఇప్పటికీ రెండు దేశాల సరిహద్దుల మధ్యా ఉన్న నిర్దేశిత నిర్మానుష్య ప్రదేశంలోనే ఉండిపోయారని కూడా బంగ్లాదేశ్ లీడింగ్ పత్రిక పేర్కొంది. ఐతే భారత్ సరిహద్దు భద్రతా దళాలు వివిధ పాయింట్ల నుండి బంగ్లాదేశ్‌లోకి వలస ప్రజలను గెంటివేసేందుకు చేసిన ప్రయత్నాలను బోర్డర్ గార్డ్ బంగ్లాదేశ్ (బిజిబి) ప్రతిఘటించాయని, ఈ వి ధంగా కనీసం 88 మంది ఎటూపాలుపోక ఎవరికీ చెందని ని ర్మానుష్య ప్రదేశంలో ఉండిపోయారని మీడియా పేర్కొంది. బంగ్లాదేశ్‌లోకి బలవంతంగా ప్రజలను సరిహద్దుల నుండి పంపించడం అంతర్జాతీయ నిబంధనలను ఉల్లంఘించడమేనని, ఈ చర్యలు ద్వైపాక్షిక సంబంధాలను దెబ్బతీస్తాయని ఈ విషయంలో భారత్‌పై ఒత్తిడి తీసుకురావాల్సిన అవసరం ఉందని డైలీ స్టార్ పత్రిక తన సంపాదకీయంలో పేర్కొంది. అటు బంగ్లాదేశ్‌లో ఇటు భారత్‌లోని ఆ దేశ సరిహద్దు రాష్ట్రం పశ్చిమ బెంగాల్‌లోనూ కొత్త ప్రభుత్వాలు కొద్ది నెలల తేడాతో కొలువుదీరాయి. పశ్చిమ బెంగాల్‌లో హిందూ మతోన్మాదపార్టీ బిజెపి పాలకులు అధికారంలోకి రాగా, బంగ్లాదేశ్‌లోని సరిహద్దు ప్రాంతాల నియోజకవర్గాల లో ఆదేశ ప్రతిపక్షంగా ఉన్న జమాత్–ఎ–ఇస్లామీ పార్టీ ప్రతినిధులు విజయాలు సాధించి ఆ దేశ పార్లమెంటు కు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఈ చర్యలను జమాత్–ఎ–ఇస్లామీ పార్టీనాయకుడు షఫికుర్ రెహ్మాన్ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. పశ్చిమ బెంగాల్‌లో ఉన్న బంగ్లాదేశీయులపై హిందూ మతోన్మాదపార్టీ దాడులు చేస్తోందని ఆయన ఆరోపిస్తుండగా, దేశ ప్రధానమంత్రి తారిఖ్ రెహ్మాన్ మాత్రం ఇంకా అలాంటి పరిస్థితులు రాలేదని ఇప్పటికే ఖండించారు. బంగ్లాదేశీయులు స్వేచ్ఛగా చొరబడటంవల్ల పశ్చిమ బెంగాల్‌లో స్థానికులకు ఉపాధి అవకాశాలు తగ్గిపోతున్నాయని, వారిని వెళ్ళగొడతామని బిజెపి ఇప్పటికే ప్రతిజ్ఞ చేసింది. భారత్–బంగ్లాదేశ్ సరిహద్దుల్లో తీవ్ర ఆందోళనకర పరిస్థితులు తలెత్తుతున్నాయి, దీనిపై ఎక్కువ శ్రద్ధ పెట్టడం అవసరం, ఒక్క శుక్రవారంనాడే మహిళలు,పిల్లలతో కూడా ఒక బృందాన్ని భారత సరిహద్దు బలగాలు జీరో లైన్ దాటించాయని, ఇవన్నీ దురుద్దేశపూర్వకంగా కనిపించడంలేదని, అసోం, బెంగాల్‌లలో బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత వలస ప్రజల వ్యతిరేక విధానాలు గట్టిపడ్డాయని, ఇవన్నీ నిర్దిష్ట సమూహాలకు వ్యతిరేకంగా జరిగే రాజకీయ ప్రచారంలో భాగంగా కనిపిస్తున్నాయని డైలీస్టార్ ఆరోపించింది.సువేందు అధికారి పదవీ బాధ్యతలు తీసుకున్న తర్వాత గుర్తించు,తొలగించు,బహిష్కరించు అనే విధానం ప్రకటించారని, అదుపులోకి తీసుకున్నవారిని సరిహద్దు బలగాలకు స్వాధీనం చేయాలని పోలీసులకు ముఖ్యమంత్రి ఆదేశించారని సంపాదకీయం పేర్కొంది. ప్రజల సమ్మతి లేకుండా ఒక భూభాగం నుండి మరో భూభాగంలోకి వారిని బలవంతంగా తరలించడం అంతర్జాతీయ చట్టాలకు విరుద్ధమని పేర్కొంది. చట్టబద్ధమైనవారిని కూడా బలవంతంగా తరలించడం ఒక పరిష్కారంగా ప్రభుత్వం భావిస్తోందని విమర్శించింది.



## తైవాన్ తూర్పు జలాల్లో మరింత పటిష్ఠంగా చైనా గస్తీ



**బీజింగ్:** తైవాన్ తూర్పు జలాలలో చైనా ఒక ప్రత్యేక చట్టాన్ని అమలులోకి తెచ్చి ఒక ఆపరేషన్ ప్రారభించింది. తైవాన్ తూర్పున ఉన్న సముద్ర జలాల్లో ఉన్న సరిహద్దులను నిర్ధారించచాలని జపాన్–ఫిలిప్పీన్స్ దేశాలు రెండూ ఏకపక్షంగా ఒక నిర్ణయాన్ని ప్రకటించడంతో చైనా తక్షణమే ఈ ప్రత్యేక చట్టాన్ని అమలులోకి తీసుకువచ్చింది. ఈ మేరకు ఒక ఆపరేషన్ ప్రారంభించింది. ఈ మేరకు భారీగా గస్తీ,నౌకల కదలికలపై నియంత్రణ పెంచుతారు. చైనా రవాణామంత్రిత్వశాఖ, సముద్ర భద్రతా పరిపాలనాసంస్థలు, చైనా సముద్ర నావిగేషన్ సహాయ కేంద్రం, తూర్పు చైనా సముద్ర రెస్క్యూ బ్యూరోల సమన్వయంతో ఈ ఆపరేషన్ ప్రారంభమైంది. చైనా సముద్ర పరిపాలనా చట్ట అమలు అధికార పరిధిని పూర్తితా వినియోగించుకోవడం, కీలక జలాల్లో లోతైన సముద్రయానం, ట్రాఫిక్ నియంత్రణ పరిధిని విస్తరించం ఈ ఆపరేషన్ ప్రధాన లక్ష్యం. ఐతే జపాన్–ఫిలిప్పీన్స్ చేసిన ప్రకటన చైనా ప్రాదేశిక సార్వభౌమాధికారాన్ని, సముద్ర జలాల సరిహద్దుల హక్కులను దెబ్బతీస్తుందని చైనా ప్రకటించింది. ఈ రెండు దేశాలు చేసిన ప్రకటన ప్రకారం నిర్ధారిత ప్రదేశం తైవాన్‌కు తూర్పున ఉంది. సముద్ర సరిహద్దులను ఏకపక్షంగా నిర్ధారిస్తామని జపాన్–ఫిలిప్పీన్స్ చేసిన ప్రకటన తమ హక్కులను ఉల్లంఘిస్తోందని అందువల్ల అనివార్యంగా ప్రత్యేక చట్ట ఆపరేషన్ అవసరమైనందని చైనా ప్రకటించింది. ఈ ఆపరేషన్ ప్రకారం లోతైన జలాల్లో నౌకల రాకపోకలపై గస్తీని బలోపేతం చేస్తారు. చైనా కీలక జలాల్లో నౌకల కదలికలను నియంత్రణ చేస్తారు.

## 'సర్'ను ఏడాది పాటు కొనసాగించాలి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలో ఈ నెల 25 నుంచి ప్రారంభం కానున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియను కనీసం ఒక ఏడాది పాటు కొనసాగించాలని టిజెఎస్ రాష్ట్ర అధ్యక్షులు, ఎంఎల్‌సి ప్రొఫెసర్ ఎం.కోదండరామ్ కేంద్ర ఎన్నికల సంఘాన్ని డిమాండ్ చేశారు.పలు రాష్ట్రాల్లో తగిన సమయం ఇవ్వకపోవడం వల్లనే ఆయా రాష్ట్రాల్లో పెద్ద సంఖ్యలో ఓటర్లు తమ ఓటు హక్కును కోల్పోయారని గుర్తు చేశారు. సమయం ఇవ్వకపోతే తెలంగాణ రాష్ట్రంలో కూడా లక్షలాది మంది ఓటర్లు ఇబ్బందులను ఎదుర్కొనే అవకాశం ఉన్నదని ఆందోళన వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లోని టిజెఎస్ కార్యాలయంలో 'ఎస్ఐఆర్' అం శం పైన ఆదివారం వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కోదండరామ్ ముఖ్యఅతిథి హాజరై మాట్లాడారు. ఎన్నికల సంఘం ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం మూడు నెలల సమ యం సరిపోదన్నారు. కనీసం ఒక సంవత్సరం పాటు ఈ ప్రక్రియను కొనసాగిస్తేనే ఓటర్లకు తగిన అవకాశం లభిస్తుందని సూచించారు. ఈ విషయాన్ని ఎన్నికల సంఘం సానుకూలంగా పరిశీలించాలని కోరారు. ఎస్ఐఆర్ ప్రక్రియ పట్ల పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయని, వివిధ కారణాలు చూపుతూ పౌరుల ఓటు హక్కును తొలగించే పరిస్థితులు తలెత్తకుండా ఎన్నికల సంఘం పూర్తి పారదర్శకతతో వ్యవహరించాలని కోదండరామ్ కోరారు. ఇప్పటి వరకు తమకు అందిన సమాచారం ప్రకారం రాష్ట్రంలో 68 శాతం మ్యాపింగ్ పూర్తయిందన్నారు. ఈ కార్యక్రమానికి టిజెఎస్ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షులు సయ్యద్ సలీం పాషా అధ్యక్షత వహించగా, ఎస్ఐఆర్ పక్రియపైన సామాజిక కార్యకర్తలు ఇర్ఫాన్ ఖాన్, అబ్దుల్ ఖాలిఖ్, మారియోస్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. టిజెఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు అంబటి శ్రీనివాస్, ధర్మార్జున్, బైరి రమేష్, నిజ్జన రమేష్ ముదిరాజ్, నాయకులు జస్వంత్ కుమార్, సత్యనారాయణ, ఎం. నరసయ్యగౌడ్, బట్టల రామచందర్, దార సత్యం, కొత్త రవి, తదితరులు పాల్గొన్నారు.




## కిషన్‌రెడ్డే అడ్డుకట్ట

(మొదటి పేజీ తరువాయి)

తర్వాత తమ కార్యాచరణ మారుతుందన్నారు. ఎన్నికలప్పుడే రాజకీయం ఉంటుందే తప్ప, సిఎంగా ప్రజల అభివృద్ధే లక్ష్యంగా ముందుకు వెళతానని రేవంత్‌రెడ్డి పునరుద్ఘాటించారు. తమ ప్రభుత్వం ఎలాంటి అభివృద్ధి పనులకు పూనుకున్నా ప్రతిపక్షాలు రాజకీయ లబ్ధి కోసం వేస్తున్న అడ్డుపుల్లలను అధిగమిస్తూ రాష్ట్రాన్ని ప్రగతి పథంలోకి తీసుకు వెళ్తానన్నారు. పరిపాలనా సౌలభ్యం లక్ష్యంగా ఒఆర్ఆర్ లోపల ఉన్న దాదాపు 1.34 కోట్ల మంది ప్రజలకు అన్ని విధాలా సౌకర్యాలు కల్పించే లక్ష్యంగా జిహెచ్ఎంసిని మల్కాజిగిరి, సైబరాబాద్‌ల పేరిట మూడు మున్సిపల్ కార్పొరేషన్లుగా విభజిస్తే ప్రతిపక్షాలు రాజకీయ లబ్ధి కోసమే అంటూ గగ్గోలు పెట్టాయని దుయ్యబట్టారు. వారి ఆరోపణల్లో ఎలాంటి నిజం లేదని సిఎం మరోసారి స్పష్టం చేసారు. మూసీ మురికి వల్లే ఉప్పల్ విలువ తగ్గిపోయిందని, నల్లగొండ జిల్లా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ఈ సమస్య శాశ్వత పరిష్కార దిశగానే మూసీ ప్రక్షాళన చేపట్టామన్నారు. ప్రక్షాళనతో ఎవరికీ ఎలాంటి నష్టం రాకుండా చూసే బాధ్యత తమ ప్రభుత్వానిదేన్నారు. మూసీ ప్రక్షాళన అంశాన్ని సైతం ప్రతిపక్షాలు అడ్డు పడుతున్నారని ఆయన తీవ్రంగా దుయ్యబట్టారు. రానున్న వంద రోజుల్లో నాగోల్ నుండి గౌరెల్లి వరకు మూసీ ప్రక్షాళన ఫేజ్–2లో భాగంగా పూర్తి చేసేందుకు అధికారులు ముందుకు సాగాలని ఆదేశించారు. ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్‌కు ప్రస్తుత బిఆర్ఎస్ ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సోదరుడు నాటి ఎమ్మెల్యే బండారి రాజిరెడ్డి పేరు పెట్టానని, ఈ ప్రాంతంలో ఆయన విగ్రహం సైతం ఏర్పాటుకు అనుమతిస్తున్నానని ఆయన చెబుతూ తనకు సిఎం హోదాలో తనకు ఎలాంటి రాజకీయ వివక్షత లేదనటానికి ఇదో ఉదాహరణ అని పేర్కొన్నారు. మల్కాజిగిరి పార్లమెంటు పరిధిలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల పూర్తి స్థాయి అభివృద్ధి కోసం ఎన్ని కోట్లయినా, ఎలాంటి పరిపాలనా అనుమతులైనా వెంటనే మంజూరు చేస్తానని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. తాను కొడంగల్ ఎమ్మెల్యేగా ఓటమి పాలైన సందర్భంలో మల్కాజిగిరి ఎంపిగా పోటీ చేసే అవకాశం కలిగినప్పుడు కష్టకాలంలో కాంగ్రెస్ పార్టీ ఉన్నప్పటికీ ఇక్కడి ప్రజలు తనను గెలిపించారన్నారు. అప్పటి పాలకుల సహకార లోపం కారణంగా తానేమీ చేయలేక పోయానని, ఇప్పుడు ముఖ్యమంత్రి హోదాలో అభివృద్ధి చేస్తూ ఇక్కడి ప్రజల రుణం తీర్చుకొంటానన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్‌రెడ్డి, ఐటి శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, రాజ్యసభ సభ్యులు వేంనరేందర్‌రెడ్డి, అద్దంకి దయాకర్‌రెడ్డి, శాసన సభ్యులు మల్‌రెడ్డి రంగారెడ్డి, గణేష్, ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, డిసిసి అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్, మాజీ ఎమ్మెల్యేలు మైనంపల్లి హన్మంతరావు, సుధీర్‌రెడ్డి, ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి పరమేశ్వరరెడ్డి, కాంగ్రెస్ నేతలు హరివర్ధనరెడ్డి, ఉప్పల్ మాజీ కార్పొరేటర్ రజిత, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మనుచౌదరి, మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**ముందస్తు అరెస్టులు**

ఉప్పల్‌లో ఆదివారం చేపట్టిన సిఎం రేవంత్ రెడ్డి పర్యటన నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా ఆదివారం ఉదయం బిజెపి, బిఆర్ఎస్, బిఆర్ఎస్ అనుబంధ సంఘాలు, విద్యార్థి సంఘాలు, ఉప్పల్ భగాయత్ సంక్షేమ సంఘం తదితర నేతలను 30 మందికి పైగా పోలీసులు అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్లకు తరలించారు.

## విదేశాల్లో బిఆర్ఎస్ పాలనలో జరిగిన అవినీతి, అక్రమాలపై కెటిఆర్ ప్రసంగించాలి

**చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం**

**ప్రజాపక్షం/హైదరాబాద్:** బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ విదేశాల్లో తెలంగాణ గురించి తప్పుడు ప్రచారం చేస్తున్నారని, రాష్ట్ర ప్రజలు ఆ పార్టీని ఇప్పటికే తిరస్కరించారని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం విమర్శించారు. రాష్ట్రంలో చెబుతున్న అబద్ధాలు సరిపోక మలేషియా వెళ్లి కూడా అసత్య ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. కెటిఆర్ విదేశాల్లో ప్రసంగాలు చేసే ముందు బిఆర్ఎస్ పాలనలో జరిగిన అవినీతి, అక్రమాలు, నియంతృత్వ ధోరణులపై ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సిఎల్‌పి మీడియా సెంటర్‌లో ఆదివారం ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఏర్పడిన సమయంలో రాష్ట్రం ఆర్థికంగా బలంగా ఉందని, అయితే బిఆర్ఎస్ పదేళ్ల పాలనలో భారీ అప్పుల పాలైందని ఆరోపించారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 80కి పైగా స్థానాలు గెలుచుకుని మరోసారి అధికారంలోకి వస్తుందని, రేవంత్ రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి అవుతారని ధీమా వ్యక్తం చేశారు. బిఆర్ఎస్‌కు ఈసారి ప్రతిపక్ష హోదా కూడా దక్కదని, ఆ పార్టీ సింగిల్ డిజిట్ సీట్లకే పరిమితమవుతుందని వ్యాఖ్యానించారు. తెలంగాణ ప్రజలు చైతన్యవంతులని, ఆత్మగౌరవాన్ని ఎప్పటికీ వదులుకోరని పేర్కొన్నారు. బిఆర్ఎస్ పాలనను ప్రజలు మరచిపోరని అన్నారు. ఈ సందర్భంగా మాజీ మావోయిస్టు నేత దేవ్‌జీని పరామర్శించేందుకు ఆసుపత్రికి వెళ్లి వచ్చినట్లు తెలిపారు. ఆయన తమ జిల్లాకు చెందిన నాయకుడని, అనారోగ్యంతో చికిత్స పొందుతున్నారని చెప్పారు.



## సింగరేణి మానుకోవాలి

(మొదటి పేజీ తరువాయి)

వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి సింగరేణికి రావలసిన రూ.56 వేల కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని, కొత్త గనుల ప్రారంభానికి చర్యలు చేపట్టాలని, నిలిచిపోయిన మెడికల్ బోర్డులను పునరుద్ధరించాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న డిపెండెంట్ ఉద్యోగాలు, ప్రమోషన్లు, క్లర్క్ పోస్టుల భర్తీ, డిస్మిస్ అయిన కార్మికులకు ప్రత్యేక అవకాశం కల్పించడం వంటి సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. గత నెల గోలేటి నుంచి కొత్తగూడెం వరకు నిర్వహించిన సింగరేణి జాత విజయవంతం కావడంలో సహకరించిన కార్మికులు, నాయకులు, కార్యకర్తలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం యూనియన్ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ మాట్లాడుతూ సింగరేణిలో కార్మిక వ్యతిరేక విధానాలు పెరుగుతున్నాయని విమర్శించారు. పెర్క్స్‌పై ఆదాయపు పన్నును యాజమాన్యమే భరించాలని, స్ట్రక్చర్ కమిటీ సమావేశాల్లో అంగీకరించిన డిమాండ్లను అమలు చేయాలని కోరారు. సహజ మరణం పొందిన కార్మికుని కుటుంబానికి రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్మికుల సంక్షేమానికి సంబంధించిన అన్ని పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని, మైనింగ్ స్టాఫ్ ప్రమోషన్ల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని నాయకులు కోరారు. సమస్యల పరిష్కారంలో యాజమాన్యం సానుకూలంగా స్పందించకపోతే ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా సోమవారం సాయంత్రం 4 గంటలకు సింగరేణి ప్రధాన కార్యాలయం ముందు యూనియన్ నాయకుడు కొమురయ్య కాంస్య విగ్రహ పునఃప్రారంభోత్సవ కార్యక్రమానికి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో అదనపు కార్యదర్శి మిర్యాల రంగయ్య, డిప్యూటీ జనరల్ సెక్రటరీలు సారయ్య, కందికట్ల వీరభద్రయ్య, వై.వి.రావు, ముస్కె సమ్మయ్య, సెంట్రల్ సెక్రటరీలు వంగ వెంకట్, వీరస్వామి, అన్ని ఏరియాల బ్రాంచ్ సెక్రటరీలు, సెంట్రల్ కౌన్సిల్ మెంబర్లు పాల్గొన్నారు.

## పేదలు కుదేలు

(మొదటి పేజీ తరువాయి)

పడుతోంది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నెల 12 నుంచి పాఠశాలలు పునఃప్రారంభం కానుండగా రాష్ట్ర ప్రభుత్వం ఎండల తీవ్రత దృష్ట్యా ఈ నెల 15 వరకు సెలవులు పొడిగించింది.ఇక పిల్లల చదువులకు, ఫీజులకు డబ్బులు కూడబెట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రైవేటు పాఠశాలల ఫీజుల నియంత్రణపై ప్రభుత్వపరంగా ఎలాంటి అజమాయిషీ లేకపో వడంతో కొన్ని యజమాన్యాలు నిలువు దోపిడీ చేస్తున్నాయి. ఏ ప్రైవేటు పాఠశాల చూసినా ఎల్ కే జీ విద్యార్థికి సంవత్సరానికి రూ. 20 వేలకు పైగా వసూలు చేస్తున్నాయి. అంతేగాకుండా యూనిఫాం, టైలు, బెల్టులు, పుస్తకాలు, నోట్ బుక్కులు వారివద్దే తీసు కోవాలని నిబంధనలు పెడుతున్నాయి. ఇవన్నీ కలు పుకుని ఒక్క ఎల్ కే జీ విద్యార్థికి బడికి పంపించా లంటే ఫీజులు కాక మరో రూ.10 వేలు చేతిలో పట్టుకోవాల్సిందే. ఇక సీబీఎస్ఈ, ఐఐటీ, ట్రిపుల్ ఐటీ, టెక్నో, ఈ టెక్నో అంటూ ఒక్కో తరగతికి ఒక్కోలా ఫీజులు వసూలు చేస్తారు. పదో తరగతి చదివే విద్యార్థికే ఇప్పుడు రూ. లక్షకు పైగా ఫీజు గుంజుతున్నారు. ఇలా చెప్పుకుంటూపోతే అడ్మిషన్ ఫీజులు, సాంస్కృతిక కార్యక్రమాలు, పరీక్ష రుసు ములు, పాఠశాల అభివృద్ధి, క్రీడల పేరిట వేల రూపాయలు వసూలు చేస్తున్నారు. దీంతో ఒక కుటుంబంలో ఇద్దరు పిల్లలు ఉంటే వారి పరిస్థితి మరీ అగమ్య గోచరంగా తయారైంది.

**పెరిగిన ఎరువుల ధరలు..**

తొలకరి వర్షాలు పడగానే రైతులు విత్తనాలు విత్తడం ప్రారంభిస్తారు. అంతకు ముందే రైతులకు ఎరువుల ధరలను పెంచి ప్రభుత్వం షాక్ ఇచ్చింది. అంతర్జాతీయ మార్కెట్ లో ముడి పదార్థాల ధరల పె రుగుదల నేపథ్యంలో కాంప్లెక్స్ ఎరువుల చిల్లర ధరలను భారీగా పెంచాయి. యూరియా, డీఏపీ ధరలు యధావిధిగానే కొనసాగిస్తుండగా ఇతర యూరియా ధరలను పెంచినట్లు ఫర్టిలైజర్ షాపు యజమానులు చెబుతున్నారు 20:20:0:13, 10:26:26, 17:17:17: వంటి కాంప్లెక్స్ ఎరువుల ధరలను బస్తా కు రూ.200500 వరకు పెంచారు. యూరియా బస్తా రూ.266.50, డీఏపీ బస్తా రూ.1350 కే లభి స్తోంది. భారీ సబ్సిడీ కారణంగా ఈ ధరలను పెంచ కుండా వదిలేశారు. భవిష్యత్తులో 20:20:0:13 బస్తాకు రూ.500 పెరిగే అవకాశం ఉందని, దీంతో దాదాపు రూ.1450 ఉన్న బస్తా రూ. 2వేల వరకు చేరుతుందని అంచనా వేస్తున్నారు. ఇలా పెరిగితే వరికి 3 బస్తాలు వాడే రైతులకు అదనంగా రూ. 1500 భారం కానుంది. ఇప్పటివరకు విత్తనాల ధరల్లో మాత్రం ఎలాంటి మార్పులు లేకపోవడంతో రైతులకు ఊరట లభిస్తోంది.

**పెరిగిన ధరలపై 10న ఆందోళన**

కేంద్ర ప్రభుత్వం భారీగా పెంచిన పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలతో పాటు పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలపై ఈ నెల 10న సిపిఐ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. మార్కెట్ లో నిత్యావసర వస్తువులను బ్లాక్ చేస్తూ ధరల పెరుగుదలకు కారణమవుతున్న బ్లాక్ మార్కెటింగ్ పై ప్రభుత్వం చర్యలు చేపట్టడం లేదని నాయకులు ఆరోపిస్తున్నారు. పెరిగిన ధరలతో పేదలు, సామాన్యులు జీవితం గడుపలేని పరిస్థితి ఏర్పడిందని, తక్షణమే ధరలను నియంత్రించాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ క్రమంలో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల కలెక్టర్ కార్యాలయాల ఎదుట నిరసన ధర్నా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

## రోడ్డెక్కనున్న కాంట్రాక్టర్లు

(మొదటి పేజీ తరువాయి)

వేలాది కోట్ల రూపాయలు పనులు జరిగాయి. ఈ పనులను నిర్వహించడంలో చిన్న, మధ్య, పెద్ద కాంట్రాక్టర్లు కీలక పాత్ర పోషించారు. అయితే నిధుల కొరత, రాష్ట్ర ఆదాయ వనరులు తగ్గడం, ఖర్చులు పెరగడం వల్ల అభివృద్ధి పనుల బిల్లుల చెల్లింపులు ఆలస్యమయ్యాయి. భారీ సంక్షేమ పథకాలు ప్రభుత్వం సంక్షేమ పథకాల కోసం పెద్ద మొత్తంలో నిధులు కేటాయించాల్సి రావడంతో అభివృద్ధి పనుల చెల్లింపులు వెనుకబడ్డాయని కాంట్రాక్టర్లు ఆరోపిస్తున్నారు.

**కాంట్రాక్టర్లపై తీవ్ర ప్రభావం**

ఒక పని చేపట్టే ముందు కాంట్రాక్టర్ బ్యాంకు రుణం తసుకుంటాడు. యంత్రాలు అద్దెకు తీసుకుంటాడు. నిర్మాణ సామాగ్రి కొనుగోలు చేస్తాడు కార్మికులు జీతాలు చెల్లిస్తాడు. అంటే ప్రభుత్వం చెల్లించే బిల్లులపైనే మొత్తం వ్యవస్థ ఆధారపడి ఉంటుంది.

ప్రభుత్వం నుంచి బిల్లులు రాకపోవడంతో బ్యాంకు రుణాలు యన్‌పిఏ దిశగా వెళ్తున్నాయి. వడ్డీలు పెరుగుతున్నాయి. చిన్న కాంట్రాక్టర్లు ఆర్థికంగా కుంగిపోతున్నారు. కొత్త టెండర్లలో పాల్గొనలేకపోతున్నారు. చిన్న కాంట్రాక్టర్లు పరిస్థితి మరింత దారులు పెద్ద కంపెనీలకు కొంత ఆర్థిక బలం ఉన్నా, గ్రామీణ ప్రాంతాల్లో పని చేసే చిన్న కాంట్రాక్టర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొంతమంది భూములు అమ్ముకున్నారు. వ్యక్తిగత ఆస్తులు తాకట్టు పెట్టారు.

**ప్రైవేట్ అప్పులు చేసినట్లు కాంట్రాక్టర్ల సంఘాలు చెబుతున్నాయి.**

గత కొన్ని నెలలుగా కాంట్రాక్టర్ల సంఘాలు వినతిపత్రాలు అధికారులతో సమావేశాలు ప్రజాప్రతినిధులకు ఫిర్యాదులు చేసినా ఆశించిన స్థాయిలో పరిష్కారం రాలేదని చెబుతున్నాయి. దీంతో చివరి ప్రయత్నంగా జూన్ 18న రాష్ట్రవ్యాప్త మహాధర్నా నిర్వహించాలని నిర్ణయించాయి. నో పేమెంట నో వర్క్ అంటే బిల్లులు చెల్లించకపోతే కొత్త పనులు చేయలేమని స్పష్టం చేస్తున్నారు. ప్రభుత్వ వర్గాలు మాత్రం రాష్ట్ర ఆర్థిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని దశలవారీగా బిల్లులు విడుదల చేస్తున్నామని చెబుతున్నాయి. అలాగే ఆదాయం పెరుగుతున్నా కొద్దీ బకాయిలు చెల్లిస్తామని అభివృద్ధి పనులు ఆగకుండా చర్యలు తీసుకుంటామని చిన్న కాంట్రాక్టర్లకు ప్రాధాన్యత ఇస్తామని సూచనలు ఇస్తున్నాయి.

**పెండింగ్ బిల్లులపై శ్వేతపత్రం విడుదల చేయాలి**

శాఖల వారీగా బకాయిల వివరాలు ప్రకటించాలి. చిన్న కాంట్రాక్టర్లకు తొలి ప్రాధాన్యత ఇవ్వాలి. బిల్లుల చెల్లింపులకు ప్రత్యేక నిధి ఏర్పాటు చేయాలి. భవిష్యత్తులో 6090 రోజుల్లోపు బిల్లులు చెల్లించే విధానం తీసుకురావాలి. తెలంగాణ అభివృద్ధిలో కాంట్రాక్టర్లు కీలక భాగస్వాములు, రోడ్లు, వంతెనలు, ప్రభుత్వ భవనాలు, సాగునీటి ప్రాజెక్టులు ఇవన్నీ వారి శ్రమ ఫలితమే అలాంటి కాంట్రాక్టర్లు తమ బిల్లుల కోసం రోడ్డెక్కి ధర్నాలు చేయాల్సిన పరిస్థితి రావడం రాష్ట్ర నిర్మాణ రంగం ఎదుర్కొంటున్న సంక్షోభానికి అద్దం పడుతుంది. 18 మహాధర్నా కేవలం బిల్లుల కోసం చేసే ఆందోళన మాత్రమే కాదు. రాష్ట్ర అభివృద్ధి పనులు సజావుగా కొనసాగాలంటే కాంట్రాక్టర్ల సమస్యలను ప్రభుత్వం అత్యవసరంగా పరిష్కరించాలని హెచ్చరికగా కూడా చూడాల్సిన అవసరం ఉంది.

# తొలి ఇన్నింగ్స్ డిక్లేర్ చేసిన టీమిండియా

న్యూ చండీగఢ్‌లోని ముల్లాన్‌పూర్ వేదికగా ఆఫ్ఘనిస్థాన్‌తో జరుగుతున్న ఏకైక టెస్టు మ్యాచ్‌లో శుభమన్ గిల్, కెఎల్ రాహుల్ సాధించిన శతకాలతో టీమిండియా భారీ స్కోర్ చేసింది. భారత్ తన తొలి ఇన్నింగ్స్‌లో 8 వికెట్ల నష్టానికి 564 పరుగులు చేసి ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది. శుభమన్ గిల్ (177 బంతుల్లో 126, 15ఫోర్లు, 1సిక్స్), కెఎల్ రాహుల్(100), సెంచరీలు సాధించగా మూడో స్థానంలో బ్యాటింగ్ చేయడానికి వచ్చిన సాయి సుదర్శన్ (81), రిషబ్ పంత్ (81), వాషింగ్టన్ సుందర్(52) అర్ధ శతకాలతో ఆకట్టుకున్నారు. భారత్, ఆఫ్ఘనిస్థాన్ జట్ల మధ్య ఏకైక టెస్టు మ్యాచ్‌లో తొలి ఇన్నింగ్స్‌ను 368/3తో రెండో రోజు ఆటను ప్రారంభించిన టీమిండియా లంచ్ బ్రేక్ సమయానికి 110 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 475 పరుగులు చేసింది. క్రీజులో వాషింగ్టన్ సుందర్(25 బంతుల్లో 14 నాటౌట్, 2 ఫోర్లు), మానవ్ సుతార్(20 బంతుల్లో 9 నాటౌట్, 2 ఫోర్లు)ఉన్నారు. తొలి రోజు భారీ ఆధిక్యంతో రెండో రోజు ఆటను ప్రారంభించిన టీమిండియా.. కాస్త తడబడింది. తొలి సెషన్‌లోనే వరుస ఓవర్లలోనే రిషభ్ పంత్(81), ధ్రువ్ జురెల్(19) పెవిలియన్ చేరారు. శనివారమే సెంచరీ చేసిన శుభమన్ గిల్ (177 బంతుల్లో 126, 15ఫోర్లు, 1సిక్స్) పరుగులు చేసి రెండో రోజు ఔటయ్యాడు. సలీమ్ సాఫి 4, రెహమాన్ షరీఫీ 1, హష్మతుల్లా షాహిది 1 వికెట్ పడగొట్టారు. అఫ్గానిస్థాన్ బౌలర్లలో సలీమ్ సాఫి 6 వికెట్లతో చెలరేగాడు. రెహమాన్ షరీఫీ, హష్మతుల్లా షాహిదీ తలొక వికెట్ పడగొట్టారు. కాగా, బ్యాటింగ్‌కు అనుకూలమైన పిచ్‌పై లభించిన అవకాశాన్ని యశస్వి జైస్వాల్ సద్వినియోగం చేసుకోలేకపోయాడు. సఫీ బౌలింగ్లో (24) పరుగులకే వెనుదిరిగాడు.



# టి–20 కెప్టెన్‌గా శ్రేయాస్ అయ్యర్

## వైస్‌కెప్టెన్‌గా తిలక్‌వర్మ, జట్టులోకి వైభవ్ సూర్యవంశీ



భారత టి20 జట్టులో అనూహ్య మార్పులు చోటు చేసుకున్నాయి. కొద్ది రోజులుగా వస్తున్న వార్తలను నిజం చేస్తూ భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని బిసిసిఐ కీలక నిర్ణయాలు తీసుకున్నది. సొంతగడ్డపై టీమ్‌ఇండియాకు టి20 ప్రపంచకప్ టైటిల్ అందించిన సూర్యకుమార్‌పై వేటు పడింది. సూర్య స్థానంలో ముంబైకే చెందిన శ్రేయాస్ అయ్యర్‌కు బోర్డు..కెప్టెన్సీ పగ్గాలు అప్పగించింది. అటు దేశవాళీ, ఐపిఎల్లో తన నాయకత్వ శైలితో పాటు నిలకడగా రాణిస్తున్న అయ్యర్ వైపు సెలెక్టర్లు మొగ్గుచూపారు. శనివారం బిసిసిఐ కార్యదర్శి దేవజిత్ సైకియా నేతృత్వంలో భేటీ అయిన సీనియర్ సెలెక్షన్ కమిటీ రానున్న ఐర్లాండ్, ఇంగ్లండ్‌తో టీ20 సిరీస్లతో పాటు ఆసియా గేమ్స్‌కు జట్లను ఎంపిక చేసింది. తనదైన బ్యాటింగ్‌తో జట్టు విజయాల్లో కీలకమవుతూ వస్తున్న హైదరాబాదీ తిలక్‌వర్మను వైస్‌కెప్టెన్సీ వరించింది. ఇటీవల ముగిసిన ఐపిఎల్లో పరుగుల వరద పారించిన 15 ఏండ్ల బీహార్ బుడ్డోడు వైభవ్ సూర్యవంశీ అందరూ ఊహించినట్లుగానే జాతీయ సీనియర్ జట్టులోకి పిలుపు అందింది. లీగ్‌లో అత్యధిక పరుగుల(776)తో టాప్ స్కోరర్‌గా నిలిచిన సూర్యవంశీ..సంచనాలకు కేరాఫ్‌గా నిలుస్తూ తప్పకుండా ఎంపిక చేయాల్సిన పరిస్థితి తీసుకొచ్చాడు. మరోవైపు ఐపిఎల్‌లో ఆయా ఫ్రాంచైజీల తరఫున రాణించిన తెలుగు ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్‌రెడ్డితో పాటు ప్రిన్స్‌యాదవ్‌కు జట్టులో చోటు దక్కింది. రానున్న సుదీర్ఘ షెడ్యూల్‌ను దృష్టిలో పెట్టుకుంటూ స్టార్ స్పీడ్‌స్టర్ బుమ్రా, ఆల్‌రౌండర్ హార్దిక్‌పాండ్యాకు విశ్రాంతినిచ్చిన సెలెక్టర్లు..ప్రపంచకప్ గెలిచిన జట్టులో సభ్యులైన కుల్దీప్‌యాదవ్, రింకూసింగ్‌ను తప్పించారు. ఆసియాగేమ్స్‌లో బుమ్రా బరిలోకి దిగనున్నాడు.

**వైభవ్ వచ్చేశాడు:** క్రికెట్ బుల్డోజర్ వైభవ్ సూర్యవంశీ జాతీయ సీనియర్ జట్టులో వచ్చేశాడు. దేశవాళీతో పాటు అండర్16, అండర్19, ఐపిఎల్లో ఇరుగదీస్తున్న ఈ 15 ఏండ్ల కుర్రాడి ప్రతిభకు ప్రపంచ క్రికెట్ ఫిదా అయిపోయింది. ప్రపంచ స్థాయి బౌలర్లను గల్లీబౌలర్లుగా మారుస్తూ సూర్యవంశీ ఐపిఎల్‌లో సృష్టించిన విధ్వంసం మాటలకందనిది. నీళ్లు తాగినంత సులువుగా ఫోర్లు, సిక్సర్లతో చెలరేగడంలో సూర్యవంశీ ఆరితేరాడు. ఈ నేపథ్యంలో రానున్న ఐర్లాండ్, ఇంగ్లండ్ సిరీస్‌లకు ఎంపికయ్యాడు. భారత క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్(16 ఏండ్లు 205 రోజులు) కంటే పిన్న వయసులోనే సూర్యవంశీ(15 ఏండ్ల 71 రోజులు) జాతీయ జట్టుకు ఎంపిక కావడం విశేషం. ఈనెల 26,28 తేదీల్లో టీమ్‌ఇండియా..ఐర్లాండ్‌తో రెండు టి20 మ్యాచ్‌లు ఆడనుండగా, జూలై 1 నుంచి ఇంగ్లండ్‌తో ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్ మొదలుకానున్నది.

**టి20 సిరీస్‌లకు జట్టు:** అయ్యర్(కెప్టెన్), అభిషేక్, సంజు శాంసన్, కిషన్, దూబే, తిలక్‌వర్మ (వైస్ కెప్టెన్), నితీశ్‌కుమార్, అక్షర్ పటేల్, సుందర్, చక్రవర్తి, బిష్ణోయ్, సిరాజ్, హర్షిత్ రానా, అర్షదీప్‌సింగ్, ప్రిన్స్‌యాదవ్, సూర్యవంశీ.

శ్రీలంకలో జరిగే రెండు నాలుగు రోజుల సిరీస్ కోసం బిసిసిఐ మరో జట్టును ఎంపిక చేసింది. లంకలో టీమ్‌ఇండియా టెస్టు సిరీస్ దృష్ట్యా ముందస్తుగా..యువ జట్టును సన్నాహక సిరీస్‌లో ఆడిస్తున్నారు.

**జట్టు:** జురెల్(కెప్టెన్), సుదర్శన్, ఆయూశ్‌పొండే, పడిక్కల్, గైక్వాడ్, హర్షదూబే, సారాంశ్ జైన్, గుర్నూర్ బ్రార్, అకిబ్ నబీ, యశ్ ఠాకూర్, కంబోజ్, జగదీశన్, అన్సారీ, అమన్ మొకడే, షేక్ రషీద్.

# ఆరోగ్యం

## జామలో కేన్సర్ నివారణ మాలిక్యూల్!



జామకాయలో కనుగొన్న 'సిగాడియల్' సంబంధిత మాలిక్యూల్ కాలేయ కేన్సర్ నివారణలో కీలక పాత్ర పోషించవచ్చని, దీన్ని తక్కువ ఖర్చుతో తయారు చేయగలిగితే చికిత్స అందరికీ చేరువవుతుందని ఇటీవల వివిధ మాధ్యమాల్లో వార్తలు వస్తున్నాయి. శాస్త్రీయ పురోగతి కోణంలో చూస్తే ఇది ఆసక్తికరమైన పరిణామమే. కానీ, అభూత కల్పనలను, అతిశయోక్తులను జతకలిపి, ఒక స్థూల ప్రతిపాదనను వైద్య ఆవిష్కరణగా పేర్కోవడం అనుచితం. ఇలాంటి నేచురల్ కంపౌండ్స్‌పై పరిశోధనలు సాధారణంగా ప్రారంభ దశలోనే ఉంటాయి. జామలో కనుగొన్న ఈ మాలిక్యూల్ కాలేయ కేన్సర్ కణాలపై ప్రభావం చూపిందని అంటున్నప్పటికీ, ఎక్కడా మనుషులపై ప్రయోగించిన దాఖలాలు లేవు. ఇవి ప్రస్తుతానికి ప్రయోగశాల స్థాయికే పరిమితమైన ఒక ప్రతిపాదన మాత్రమే. ఈ దశలో కణాలపై ప్రభావం కనిపించడం ఒకముఖ్యమైన మొదటి అడుగుగా పేర్కోవచ్చు. కానీ, అదే ప్రభావం మనుషుల శరీరంలో సురక్షితంగా, సమర్థంగా పనిచేస్తుందా అన్నది పూర్తిగా వేరే ప్రశ్న. క్లినికల్ ట్రయల్స్ లేకుండా నివారణ లేదా చికిత్స అనే పదాలు ఉపయోగించడం ముందస్తు నిర్ణయంగా మారుతుంది. సహజంగా వచ్చినది కాబట్టి సురక్షితం అనే అంచనా కూడా సరైనది కాదు. చాలా సహజ పదార్థాలు కూడా అధిక మోతాదులో విషపూరితంగా మారవచ్చు. కాబట్టి, ఈ మాలిక్యూల్‌ను ఔషధంగా ఉపయోగించాలంటే దాని డోస్, సైడ్ ఎఫెక్ట్స్, మెటబాలిజం వంటి అనేకానేక అంశాలపై సమగ్ర అధ్యయనం అవసరం. ఈ వార్తల్లో ప్రస్తావిస్తున్న 'టోటల్ సింథసిస్' పద్ధతి నిజంగా ప్రాముఖ్యమైనది. ప్రకృతిలో లభించే సమ్మేళనాలను ల్యాబ్‌లో తిరిగి తయారు చేయడం ద్వారా వాటిని పెద్ద పరిమాణంలో, నియంత్రిత నాణ్యతతో ఉత్పత్తి చేయవచ్చు. ఇది ఔషధ పరిశ్రమలో కీలక దశ. కానీ తక్కువ ఖర్చుతో తయారు చేయడం, కేన్సర్‌కు అత్యంత చౌకైన చికిత్స అనే ధోరణి తప్పు. ఔషధ అభివృద్ధిలో ట్రయల్స్, నియంత్రణ అనుమతులు, తయారీ ప్రమాణాలు వంటిఖర్చులు ఎక్కువగా ఉంటాయి. కాబట్టి, ఈ పరిశోధనను ఒక డ్రగ్ కాండిడేట్ డిస్కవరీగా చూడడం సబబు. అంటే, ఇది భవిష్యత్తులో ఔషధంగా మారే అవకాశమున్న ఒక అణువు. కానీ అది నిజంగా మందుగా మారాలంటే సంవత్సరాల పాటు పరిశోధన, పరీక్షలు అవసరం.

## సృష్టికి ప్రతిసృష్టి.. జీవించే రోబోట్‌ల తయారీ!



జెనోబాట్స్ అనే భావన జీవశాస్త్రం, యాంత్రిక సాంకేతికతల మధ్య ఉన్న సరిహద్దులను సవాలు చేస్తున్న ఒక కొత్త దిశ. ఇవి సంప్రదాయ రోబోట్లలా లోహం లేదా ప్లాస్టిక్‌తో తయారు కావు. ఇవి పూర్తిగా జీవ కణాలతో నిర్మించిన సూక్ష్మ స్థాయి జీవయంత్రాలుగా ఉంటాయి. ఆఫ్రికన్ క్లాడ్ ఫ్రాగ్ (జేనోపస్ లీవిస్) అనే కప్ప యొక్క స్టెమ్ సెల్‌లను ఉపయోగించి వీటిని తయారు చేస్తారు. పరిమాణంలో ఇవి ఒక మిల్లీమీటర్ కన్నా చిన్నవిగా ఉండి, పూర్తిగా బయోడిగ్రేడబుల్‌గా ఉండటం వీటి ప్రత్యేక లక్షణం. వీటి నిర్మాణంలో చర్మ కణాలు, గుండె కణాలు ప్రధాన పాత్ర పోషిస్తాయి. చర్మ కణాలు బాహ్య నిర్మాణాన్ని ఇవ్వగా, గుండె కణాలు కుదింపు శక్తి ద్వారా కదలికను కలిగిస్తాయి. ముఖ్యంగా, ఇవి నాడీ వ్యవస్థ లేదా జీర్ణవ్యవస్థ లేకుండానే పని చేయగలవు. సమన్వయ ప్రవర్తన కోసం తప్పనిసరిగా నాడీ వ్యవస్థ అవసరమా?: లేక కణాల సమూహం స్వయంగా ఒక విధమైన సమన్వయాన్ని సాధించగలదా?: అనే కీలక ప్రశ్నను ఈ ప్రయోగం తెరపైకి తెస్తున్నది. జెనోబాట్స్ రూపకల్పనలో కృత్రిమ మేధస్సు (ఎఐ) కీలక పాత్ర పోషిస్తుంది. సూపర్ కంప్యూటర్లు ఎవల్యూషనరీ అల్గోరిథంలు ఉపయోగించి వివిధ ఆకారాలను డిజైన్ చేస్తాయి, వాటిలో పనికి అనుకూలమైన నమూనాలను శాస్త్రవేత్తలు సూక్ష్మ శస్త్రచికిత్స ద్వారా నిర్మిస్తారు. ఈ విధానం జీవసృష్టిని యాంత్రికంగా ప్రోగ్రామ్ చేయగలమనే ఆలోచనను బలపరుస్తుంది, కానీ ఇదే సమయంలో జీవం అంటే ఏమిటి?: అనే ప్రాథమిక ప్రశ్నను కూడా తిరిగి పరిశీలించాల్సిన అవసరాన్ని కలిగిస్తుంది. వీటి సామర్థ్యాలు ఆసక్తికరంగా ఉన్నాయి. ఇవి నీటిలో కదలగలవు. చిన్న వస్తువులను తరలించగలవు. ఒకటి కంటే ఎక్కువ సంఖ్యలో ఇవి సమూహంగా పనిచేయగలవు. ఇటీవల గమనించిన ముఖ్య లక్షణం కినమాటిక్ సెల్ఫ్‌రిప్లికేషన్. అంటే, స్వతహాగా కణాలను ఒకచోట చేర్చి, కొత్త జెనోబాట్స్ ఏర్పడేలా చేయడం. ఇది సంప్రదాయ జీవక్రియలతో పోల్చితే భిన్నమైన ప్రతిరూపణ విధానం. అయితే, వీటి సామర్థ్యాలను అంచనా వేయడంలో జాగ్రత్త అవసరం. ఇవి సాధారణంగా కొన్ని రోజులు లేదా వారాల తర్వాత క్షీణిస్తాయి. కాబట్టి, దీర్ఘకాలిక స్వయం నిర్వహణ ఇంకా సాధ్యం కాలేదు. అలాగే, ప్రోగ్రామబుల్ లివింగ్ సిస్టమ్స్ అనే భావనలో నైతిక, భద్రతా ప్రశ్నలు కూడా ఉన్నాయి. భవిష్యత్తులో వీటిని లక్ష్యిత ఔషధ పంపిణీ, రక్తనాళాలలోని అడ్డంకులను తొలగించడం, సముద్రాలలోని మైక్రోప్లాస్టిక్ శుభ్రపరిచే ప్రక్రియల్లో ఉపయోగించే అవకాశాలు పరిశీలిస్తున్నారు. కానీ ప్రస్తుతం ఇవి ప్రధానంగా శాస్త్రీయ అవగాహనను విస్తరించే పరిశోధనా సాధనాలుగానే ఉన్నాయి.

## మీకు తెలుసా?:



ఎండోక్రైన్ సిస్టమ్ అనేది హార్మోన్లు విడుదల చేసే వ్యవస్థ. హార్మోన్లు శరీరంలో రసాయన దూతలుగా పనిచేస్తాయి. శరీరంలోని ప్రధాన గ్రంథి పిట్యూటరీ గ్రంథి, దీనిని 'మాస్టర్ గ్రంథి' అని కూడా పిలుస్తారు. మెడలో ఉండే గ్రంథి థైరాయిడ్ గ్రంథి; ఇది థైరాక్సిన్ హార్మోన్‌ను విడుదల చేస్తుంది. రక్తంలోని కాల్షియం స్థాయిని నియంత్రించేది పారా థైరాయిడ్ గ్రంథి. వృక్కాలపై ఉండే గ్రంథులు అడ్రినల్ గ్రంథులు. ఇవి అడ్రినలిన్ వంటి హార్మోన్లు విడుదల చేస్తాయి. రక్తంలో చక్కెర స్థాయిని నియంత్రించేది పాంక్రియాస్ లేదా అగ్న్యాశయం. ఇది ఇన్సులిన్ హార్మోన్‌ను విడుదల చేస్తుంది. మహిళల్లో ద్వితీయ లింగ లక్షణాలను నియంత్రించేది ఈస్ట్రోజన్, పురుషుల్లో అది టెస్టోస్టెరోన్. ఈస్ట్రోజన్ మరియు ప్రోజెస్టెరాన్ అండాశయాల నుండి విడుదలవుతాయి. స్పెర్మ్, టెస్టోస్టెరోన్ విడుదల చేసే గ్రంథులు. పాలు ఉత్పత్తి కావడానికి ప్రోలాక్టిన్ హార్మోన్ బాధ్యత వహిస్తుంది. ప్రసవ సమయంలో గర్భాశయ సంకోచాలకు ఆక్సిటోసిన్ కారణం. నిద్రజాగరణ చక్రాన్ని నియంత్రించే పైనీయల్ గ్రంథి మెలటోనిన్ హార్మోన్‌ను విడుదల చేస్తుంది. ఎదుగుదలకు అవసరమైనది గ్రోత్ హార్మోన్. అయోడిన్ లోపం వల్ల గోయిటర్ అనే వ్యాధి వస్తుంది. కాగా, గర్భధారణ కాలం సాధారణంగా సుమారు 9 నెలలు లేదా 280 రోజులు.

## పెట్రో ధరలు తగ్గేవరకూ పోరాటం

### సిపిఐ యాదాద్రి జిల్లా కార్యదర్శి యానాల దామోదర్‌రెడ్డి



**ప్రజాపక్షం/మోటకొండూర్ :** కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించే వరకు పోరాటాలు ఆగవని సిపిఐ యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శి యానాల దామోదర్‌రెడ్డి అన్నారు. సిపిఐ మోటకొండూరు మండల సమితి ఆధ్వర్యంలో చలో కలెక్టరేట్ ధర్నా పిలుపు మేరకు మోటకొండూరు మండల కేంద్రంలో కరపత్రం విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈనెల 10న జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా విజయవంతం చేయాలని కోరారు. కేంద్రంలో బిజెపి పాలనలో సామాన్యుల బతుకులు భారంగా మారిందని, వంట గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలతో పాటు పప్పులు ఉప్పు, నూనె కూరగాయల వంటి నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయన్నారు. కార్పొరేటర్ సంస్థలకు లక్షల కోట్ల రూపాయల పన్ను రాయితీలు ఇస్తూ బిజెపి ప్రభుత్వం సామాన్యులపై పన్నుల భారం వేస్తూ ధరలను నియంత్రణలో పూర్తిగా విఫలమైందని, ఆదాయాలు పెరగడం లేదు కానీ ఖర్చు మాత్రం రెట్టింపు అవుతున్నాయన్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి బోలగాని సత్యనారాయణ, జిల్లా కార్యవర్గ సభ్యులు చెక్క వెంకటేష్, సిపిఐ మండల కార్యదర్శి గాదగాని మాణిక్యం, మండల సహాయ కార్యదర్శి ఆలేటి బాలరాజు, బీరకాయల మల్లేష్, బొలగాని అశోక్, రేగు పాండు, జీవికలపల్లి గణేష్, ఏఐవైఎఫ్ అధ్యక్షులు కార్యదర్శులు బీరకాయల మధు, గొట్టిపాముల సునీల్, గిరబోయిన సుదర్శన్, గట్టి కొప్పుల శ్రీధర్ పాల్గొన్నారు.

## కార్పొరేట్లకు అండగా మోదీ

### సిపిఐ వనపర్తి జిల్లా కార్యదర్శి విజయ రాములు



ప్రజాపక్షం/అమరచింత : దేశ సంపదను సృష్టించేది కార్మిక కర్షక వర్గమైతే దేశ సంపద మాత్రం సంపన్న వర్గాల చేతిలో ఉండిపోయిందని సిపిఐ జిల్లా కార్యదర్శి కె.విజయ రాములు అన్నారు. అమరచింత మండల కేంద్రంలోని సిపిఐ కార్యాలయంలో జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్రమోదీ ప్రభుత్వం కార్పొరేట్లకు అండగా ఉంటూ, సామాన్య మధ్య తరగతి వర్గాలపై మోయలేని పన్నుల భారాలు మోపుతూ ఇబ్బందులు పెడుతున్నాడన్నాడు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల ఫలితంగా ప్రజల జీవన విధానం విధ్వంసం అవుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలు 6 గ్యారంటీలు, 420 హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 10న జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కలెక్టరేట్ ముట్టడికి ప్రజలు తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి ఏ.అబ్రహం, పట్టణ కార్యదర్శి రవీందర్, ఎఐటియుసి రాష్ట్ర నాయకులు పి.సురేష్, నాయకులు ఇబ్రాయిల్, లక్ష్మీనారాయణ, నిస్సార్, సాలు, ఆర్ఎన్. కుమార్, రఘు తదితరులు పాల్గొన్నారు.

## అంతరాలు లేని సమాజ నిర్మాణమే

# కమ్యూనిస్టుల లక్ష్యం



### సిపిఐ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్‌రెడ్డి

### వేములవాడలో ముగిసిన సిపిఐ రాజకీయ శిక్షణా శిబిరం

**ప్రజాపక్షం/ వేములవాడ టౌన్ :** అంతరాలు లేని సమాజ నిర్మాణమే లక్ష్యంగా, వర్గ రహిత సమాజ స్థాపనే ధ్యేయంగా కమ్యూనిస్టు శ్రేణులు పనిచేయాలని మాజీ ఎమ్మెల్యే, సిపిఐ సీనియర్ నాయకులు చాడ వెంకట్ రెడ్డి పిలుపునిచ్చారు.వేములవాడలో మూడురోజులుగా జరుగుతున్న కరీంనగర్, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, జగిత్యాల జిల్లాల సిపిఐ కౌన్సిల్ సభ్యుల రాజకీయ శిక్షణా శిబిరాలు ఆదివారంతో ముగిశాయి. విప్లవ పార్టీల అవశ్యకత సిపిఐ నిర్మాణం, ప్రజా సంఘాల నిర్మాణంపై సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బాగం హేమంత్‌రావు, పార్టీ ఎదుర్కొంటున్న సవాళ్లు, అధిగమించే మార్గాలు అంశంపై చాడ వెంకట్‌రెడ్డి మాట్లాడారు. ఆదివారం జరిగిన ముగింపు కార్యక్రమానికి హాజరై చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ కమ్యూనిస్టులు శాస్త్రీయ దృక్పథం కలిగి ఉండాలని, బూర్జువా, పెట్టుబడిదారుల పతనమే పంతంగా పనిచేయాలని వెంకట్‌రెడ్డి పిలుపునిచ్చారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు లక్షల కోట్ల రూపాయల పన్నుల రాయితీలు ఇస్తూ వారికి కొమ్ముకస్తుందని, పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు పెంచి ప్రజల జీవనప్రమాణలపై పెనుభారం వేస్తుందన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం విచ్చల విడిగా వంట గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు పెంచడాన్ని నిరసిస్తూ ఈనెల 10న సిపిఐ ఆధ్వర్యంలో జరిగే ఆందోళనలను విజయవంతం చేయాలని చాడ వెంకట్‌రెడ్డి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కలవేన శంకర్, ఆయా జిల్లాల కార్యదర్శులు పంజాల శ్రీనివాస్, తాండ్ర సదానందం, మంద సుదర్శన్, చెన్న విశ్వనాథం, వేములవాడ నియోజకవర్గ ఇంచార్జీ కదారి రాములు, సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పొనగంటి కేదారి, గోషిక మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు 'యూనియన్ కొమురయ్య' కాంస్య విగ్రహ పునఃప్రతిష్ఠాపన

### హాజరుకానున్న ఎమ్మెల్యే కూనంనేని

### యూనియన్లకు అతీతంగా తరలిరావాలి


### సీతారామయ్య, రాజ్‌కుమార్‌ల పిలుపు



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయం ఎదుట సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ మాజీ ప్రధాన కార్యదర్శి, స్వాతంత్ర్య సమరయోధులు మనుబోతుల కొమురయ్య (యూనియన్ కొమురయ్య) కాంస్య విగ్రహాన్ని సోమవారం యూనియన్ గౌరవ అధ్యక్షులు, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ప్రతిష్ఠించనున్నట్లు ఆ యూనియన్ కేంద్ర కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వాసిరెడ్డి సీతారామయ్య, కొరిమి రాజ్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సింగరేణిలో ఎనిమిది గంటల పనివిధానాన్ని సాధించిన ఘనత కొమురయ్యదేనన్నారు. విచ్చలవిడిగా కొనసాగుతున్న కాంట్రాక్టు విధానాన్ని కొమురయ్య పోరాటాల ఫలితంగానే వెనక్కు పంపించగలిగాడని, ఆనాడు బావుల్లో పనిచేసే మహిళా కార్మికులకు సర్ఫేస్ ఉద్యోగాలు కల్పించడంలో, పది సంవత్సరాలలోపు పిల్లలతో పనిచేయించుకునే విధానాన్ని వ్యతిరేకించాడని, రేగే, జాదవ్ కమిటీల ద్వారా, ముజుందాస్, దాస్‌గుప్తా, రఘునాథ్ రెడ్డి అవార్డుల ద్వారా, పలు జాతీయ వేతన ఒప్పందాలు, సమ్మె పోరాటాల ద్వారా కార్మికులకు ఎన్నో హక్కులు సాధించిపెట్టిన ఘనత కేవలం కొమురయ్యకే దక్కుతుందని పేర్కొన్నారు. సింగరేణి కార్మికవర్గం కోసం, ఈ ప్రాంత ప్రజలకోసం ఆయన అందించిన సేవలకు మరింత గుర్తింపు తెచ్చేందుకు కాంస్య విగ్రహాన్ని పునఃప్రతిష్ఠిస్తున్నామని, కార్యక్రమానికి సిపిఐ, ఎఐటియుసి నాయకులు కార్యకర్తలు, అన్ని వర్గాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని వారు కోరారు.

## పాలకులు మారినా పరిష్కారం కాని కార్మికుల సమస్యలు

### ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల దాసు



**ప్రజాపక్షం/మంచిర్యాల :** పాలకులు మారినా కార్మికుల సమస్యలు పరిష్కారం కావడం లేదని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల దాసు విమర్శించారు. మంచిర్యాల పట్టణ నాలుగో మహాసభ ఆదివారం స్థానిక సిపిఐ కార్యాలయంలో జరిగింది. సమావేశంలో మేకల దాసు మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కొరకు కార్మికులు పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, నాయకులు కలిందర్ అలీ ఖాన్, మిట్టపల్లి పౌలు, దేవి పోచన్న, యూసఫ్ పాల్గొన్నారు. సమావేశంలో మంచిర్యాల పట్టణ నూతన కమిటీని ఎన్నుకున్నారు. పట్టణ అధ్యక్షురాలిగా బి.విజయలక్ష్మి, ఉపాధ్యక్షుడిగా పోరండ్ల సంపత్, ప్రధాన కార్యదర్శిగా మధు, కార్యదర్శిగా పానుగంటి సత్యనారాయణ, సభ్యులుగా కుసుమ, అరుణ, హరీష్, ప్రశాంత్, రాకేష్, రజినీ, కె. పద్మ ఎంపికయ్యారు.

## హక్కుల సాధనకు ఐక్య పోరాటమే మార్గం

### ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం



**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం :** కార్మికుల హక్కుల సాధనకు ఐక్య పోరాటాలే మార్గమని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం పిలుపునిచ్చారు. యాదాద్రి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఆదివారం ఐక్య భవన నిర్మాణ కార్మిక సంఘాలు చేపట్టిన సమ్మెకు ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధిలో భవన నిర్మాణ కార్మికుల పాత్ర కీలకమని, కానీ వారి జీవితాలు మాత్రం ఇంకా దుర్భరంగా కొనసాగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మండుటెండల్లో, వర్షాల్లోనూ శ్రమిస్తున్న కార్మికులకు సరియైన భద్రతా చర్యలు వైద్య సదుపాయాలు అందకపోవడం దురదృష్టకరమన్నారు. నిర్మాణరంగంలో ప్రతిరోజు ప్రమాదాలు జరుగుతున్నప్పటికీ బాధిత కుటుంబాలకు సరియైన నష్టపరిహారం అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సంక్షేమ బోర్డులో నమోదు చేసుకున్న ప్రతి కార్మికుడికి పెండింగ్‌లో ఉన్న బీమా, ప్రసూతి సహాయం, విద్యా సహాయం పెన్షన్ వంటి పథకాలను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా కూలీ రేట్లు పెంచాలని, ప్రతి నిర్మాణ కార్మికుడికి హెల్త్ ప్రమాద బీమా తప్పనిసరిగా అమలు చేయాలని కోరారు. పని స్థలాల్లో భద్రత ప్రమాణాలు పాటించకపోవడంతో అనేకమంది కార్మికులు ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం పేర్కొన్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బచ్చనగోని గాలయ్య, సిఐటియు జిల్లా నాయకుడు దోనూరు నర్సిరెడ్డి, సిపిఐ మండల కార్యదర్శి దుబ్బాక భాస్కర్, ప్రజానాట్యమండలి నాయకులు పల్లె గోపాల్ రెడ్డి, ఎఐటియుసి మండల అధ్యక్షుడు దుబ్బాక సంజీవ, సిఐటియు మండల అధ్యక్షుడు కొంగరి మారయ్య, జనగాం శంకరయ్య, నెల్లికంటి జంగయ్య, పూల మాని శంకర్, సుక్క యాదయ్య, జనగాం ఎట్టయ్య, సిరిపంగి గాలయ్య, దుబ్బాక పెద్దులు, వస్కుల దుర్గయ్య మరియు కార్మికులు పాల్గొన్నారు.



# హిట్లర్ అంటే సిఎం రేవంత్‌రెడ్డికి ఆదర్శం

## బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రపంచంలోనే అత్యంత నియంత హిట్లర్ అంటే సిఎం రేవంత్‌రెడ్డికి ఆదర్శమని, అందుకే ఆయన రాష్ట్రంలో అరాచకాలు చేస్తున్నారని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు మండిపడ్డారు. రాష్ట్రంలో అక్రమ నిర్మాణాల కూల్చివేతల కోసం ఏర్పాటు చేసిన 'హైడ్రా' పనితీరుకు జర్మనీ నియంత ఆడాల్ఫ్ హిట్లర్ చర్యలే స్ఫూర్తి అని సిఎం బహిరంగంగా ఒప్పుకున్నారని, తద్వారా సిఎం నిరంకుశ, ఫాసిస్ట్ మనస్తత్వం ప్రస్తుతం దేశం మొత్తానికి అర్థమైందని ఎద్దేవా చేశారు. తెలంగాణ ప్రజలకు సిఎం రేవంత్‌రెడ్డి నియంత నైజం అని ముందే తెలిసినప్పటికీ సిఎం మాటలతో ఆయన ఆలోచనలను దేశం మొత్తానికి స్పష్టమైందని ఆదివారం ఒక ప్రకటనలో కెటిఆర్ పేర్కొన్నారు. తమ బిఆర్ఎస్ పదేళ్ల పరిపాలనను డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ అందించిన రాజ్యాంగ స్ఫూర్తితో, మహాత్మా గాంధీ చూపిన అహింసా మార్గంలో, తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ కన్న కలల ఆశయాల ప్రాతిపదికన నడిపించామని కెటిఆర్ పేర్కొన్నారు.

**'నీట్' పరీక్షల కుంభకోణం, పేపర్ లీకేజీకి కేంద్ర ప్రభుత్వమే పూర్తి బాధ్యతవహించాలి**

దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్న 'నీట్' పరీక్షల కుంభకోణం, పేపర్ లీకేజీకి కేంద్ర ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు డిమాండ్ చేశారు. లోపభూయిష్టమైన వ్యవస్థ వల్ల నష్టపోయిన విద్యార్థులకు భరోసా కల్పించేందుకు కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్రను కేంద్ర మంత్రి పదవి నుంచి తొలగించాలని ఆయన ప్రధానిని కోరారు. మలేషియా అధికారిక పర్యటనకు వెళ్లే ముందు హైదరాబాద్‌లో 'నీట్ బాధితులు, లాంగ్ టర్మ్' విద్యార్థులతో ప్రత్యేకంగా సమావేశమైనట్టు కెటిఆర్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాత్రింబవళ్లు కష్టపడి చదివి, 520 మార్కులకుపైగా సాధించినా, పేపర్ లీక్ కావడం వల్ల తమ శ్రమ అంతా వృథా అయిందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేసినట్టు ఆయన తెలపారు. విద్యార్థుల తరఫున బిఆర్ఎస్ చివరి వరకు పోరాడుతుందని కెటిఆర్ భరోసానిచ్చారు.

# "ఆపరేషన్ ఖజానా"

భూగర్భంలో దాచిన డంప్‌ల కోసం జిపిఆర్ సహాయం

భూమి అడుగున ఉన్న నిర్మాణాలు, బంకర్లు, ప్లాస్టిక్ డ్రమ్‌లను గుర్తిస్తుంది

అడవుల్లో జల్లెడ పడుతున్న కేంద్ర, రాష్ట్ర పోలీసు బలగాలు

ఆపరేషన్లలో రూ.1.01 కోట్ల నగదు లభ్యం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** దేశవ్యాప్తంగా మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో దాచిపెట్టిన ఆయుధాలు, పేలుడు పదార్థాలు, నగదు నిల్వలను గుర్తించి స్వాధీనం చేసుకునేందుకు కేంద్ర భద్రతా దళాలు అత్యాధునిక సాంకేతికతను వినియోగిస్తున్నాయి. ఇస్రో ఉపగ్రహ చిత్రాలు, గ్రౌండ్ పెనెట్రేటింగ్ రాడార్ వ్యవస్థలు, డ్రోన్లు, ఇంటెలిజెన్స్ నెట్‌వర్క్‌ల సహాయంతో చేపడుతున్న ప్రత్యేక ఆపరేషన్‌కు భద్రతా వర్గాలు అనధికారికంగా 'ఆపరేషన్ ఖజానా'గా పేరు పెట్టినట్లు సమాచారం. ఛత్తీస్‌గఢ్‌లోని అబుజ్‌మాద్, బీజాపూర్, సుక్మా, నారాయణ్‌పూర్ అడవుల్లో మావోయిస్టులు భూమిలో లోతుగా తవ్వి ఆయుధాలు, పేలుడు పదార్థాలు, నగదు నిల్వలను డంపుల రూపంలో దాచిపెడుతున్నట్లు భద్రతా సంస్థలు గుర్తించాయి. ఇటీవల నిర్వహించిన విస్తృత కూంబింగ్ ఆపరేషన్లలో రూ.1.01 కోట్ల నగదు, ఎకె47 రైఫిళ్లు, ఎస్ఎల్ఆర్‌లు, బిజిఎల్ షెల్స్, డెటోనేటర్లు సహా భారీ ఆయుధ సంపత్తిని స్వాధీనం చేసుకున్నారు. భూగర్భంలో దాచిన డంపులను గుర్తించడం సవాలుగా మారడంతో భద్రతా దళాలు గ్రౌండ్ పెనెట్రేటింగ్ రాడార్ సాంకేతికతను వినియోగిస్తున్నాయి. భూమి అడుగున ఉన్న అసాధారణ నిర్మాణాలు, బంకర్లు, ప్లాస్టిక్ డ్రమ్‌లు, నిల్వ కేంద్రాలను ఈ వ్యవస్థ గుర్తించగలదు. ఉపగ్రహ చిత్రాలు, డ్రోన్ ఫుటేజీ, స్థానిక ఇంటెలిజెన్స్ సమాచారాన్ని సమన్వయం చేస్తూ అనుమానాస్పద ప్రాంతాలను గుర్తిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఇస్రో అందిస్తున్న హై రిజల్యూషన్ ఉపగ్రహ చిత్రాలు అడవుల్లోని మావోయిస్టుల కదలికలు, రహస్య స్థావరాలు, తరచుగా ఉపయోగించే మార్గాలను గుర్తించడంలో కీలకంగా మారాయి. గత కొన్నేళ్లుగా ఈ సాంకేతిక సహకారం వల్ల మావోయిస్టుల దాచిన స్థావరాలను గుర్తించే సామర్థ్యం గణనీయంగా పెరిగినట్లు భద్రతా వర్గాలు పేర్కొంటున్నాయి. మావోయిస్టులు కూడా భద్రతా దళాల నిఘాను తప్పించుకునేందుకు భూగర్భ సొరంగాలు, బంకర్లు నిర్మిస్తున్నట్లు విచారణల్లో బయటపడింది.

బీజాపూర్ ప్రాంతంలో ఇటీవల భూమిలో లోతుగా నిర్మించిన బంకర్లను గుర్తించి ధ్వంసం చేశారు. ఈ బంకర్లు ఆయుధ నిల్వలు, ఆశ్రయ కేంద్రాలు, ఐఈడీ తయారీ సామగ్రి నిల్వలకు ఉపయోగిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. అంతేకాకుండా, మావోయిస్టుల కమ్యూనికేషన్ వ్యవస్థలపై కూడా సాంకేతిక నిఘా పెంచినట్లు సమాచారం. వాకీటాకీలు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాల ద్వారా వారి కదలికలను ట్రాక్ చేసే ప్రయత్నాలు గతంలో ఫలితాలను ఇచ్చినట్లు దర్యాప్తు సంస్థలు గుర్తించాయి. భద్రతా దళాల అంచనా ప్రకారం అడవుల్లో ఇంకా అనేక డంపులు, పేలుడు పదార్థాల నిల్వలు దాగి ఉండే అవకాశం ఉంది. దీంతో మావోయిస్టుల ఆర్థిక వనరులు, ఆయుధ సరఫరా వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేయడమే లక్ష్యంగా 'ఆపరేషన్ ఖజానా' తరహా సాంకేతిక ఆధారిత శోధన చర్యలు మరింత వేగవంతం కానున్నాయి.

# కుటుంబ ఆరోగ్య సర్వే–6 సంపూర్ణ జాతీయ నివేదిక త్వరలో ప్రకటిస్తాం

ఖర్గే విమర్శలపై ఆరోగ్య మంత్రిత్వశాఖ స్పందన

**న్యూఢిల్లీ :** జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే–6 నివేదిక లోపభూయిష్టంగా ఉందని, తల్లీ, బిడ్డల పోషకాహారాలకు సంబంధించిన అనేక సూచికలను మోదీ ప్రభుత్వం ఈ నివేదిక నుండి తొలగించిందని కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే చేసిన తీవ్ర విమర్శలపై కేంద్ర ఆరోగ్యమంత్రిత్వశాఖ ఆదివారం స్పందించింది. ఈ నివేదిక ఇంకా పూర్తికాలేదని, ఇది కేవలం మొదటి దశ నివేదిక మాత్రమేనని, ఈ నివేదిక సమగ్రంగా లేదని, చిత్తశుద్ధితో కూడిన జాతీయ సర్వేలతో,పాలనాపరమైన గణాంకాల ద్వారా పర్యవేక్షణ ఇంకా కొనసాగుతోందని, ఈ పర్యవేక్షణ పూర్తిచేసిన తర్వాత జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే(ఎన్ఎఫ్‌హెచ్ ఎస్)–6 సమగ్ర నివేదికను త్వరలో ప్రకటిస్తామని కేంద్ర మంత్రిత్వశాఖలో సీనియర్ అధికారులు వివరణ ఇచ్చారు. ఎన్ఎఫ్‌హెచ్ఎస్–6 నివేదికలో అనేక వాస్తవ పత్రంలో తల్లీ బిడ్డల ఆరోగ్యం,పోషకాహారాలకు సంబంధించిన అనేక సూచికలను మోదీ ప్రభుత్వం విస్మరించిందని, ఈ నివేదికలోని గణాంకాల ద్వారా మోదీ తన పాపాల ముసుగు తొలగించారని, తల్లీ, బిడ్డల ఆరోగ్య సంరక్షణ,పోషకాహారం విషయంలో వారికి ద్రోహం చేశారని ఖర్గే విమర్శించారు. తన పాపాలను కప్పిపుచ్చుకోవడానికి బిజెపి ఐదు దశల సూత్రాన్ని పాటించిందని విమర్శించారు. సబ్‌కా సాథ్, అమృత్ కాల్ అని ప్రకటించుకున్న బిజెపి ప్రజలతో మోదీకి ఉన్న ప్రజా సంబంధాలను ఏ విధంగానైనా కాపాడుకోవాలనే ఉద్దేశంతో కథనాలను తారుమారు చేసిందని విమర్శించారు. ఈ ఘాటు విమర్శలను తట్టుకోలేకపోయిన కేంద్ర ప్రభుత్వం ఎన్ఎఫ్‌హెచ్ఎస్–6 జాతీయస్థాయీ పూర్తి నివేదికను తర్వాత ప్రకటిస్తామని వివరణ ఇచ్చింది. దేశంలో పెరుగుతున్న జనాభా, మానవ వనరుల నాణ్యతా ప్రమాణాలు, జీవనశైలి, వారి ఆరోగ్య ప్రమాణాలు,రక్తహీనత,నిర్మూలన, ఆరోగ్య రక్షణ వంటి విషయాలను ఈ సర్వే నివేదిక సంపూర్ణంగా ప్రతిబింబాల్సి ఉండగా అనేక ప్రామాణిక సూచనలను నివేదికలో పేర్కొనలేదని ఖర్గే విమర్శించారు. భారతదేశంలో ప్రతి కుటుంబాన్ని కలిసి, పరిస్థితులకు అనుగుణంగా సమాచారం సేకరించి ఈ నివేదికను తయారు చేయాల్సి ఉంటుంది. మనదేశంలో తయారు చేసే అతిపెద్ద,కీలకమైన నివేదిక ఇదే.



# జోజిలా టన్నెల్ బ్రేక్‌త్రూకు సర్వం సిద్ధం

జూన్ 9న నితిన్ గడ్కరీ చేతుల మీదుగా కీలక ఘట్టం

ప్రపంచంలోనే అత్యంత ఎత్తులో నిర్మితమవుతున్న పొడవైన సింగిల్-ట్యూబ్ ద్విముఖ రహదారి సొరంగం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** జమ్మూకాశ్మీర్, లడఖ్ కేంద్ర పాలిత ప్రాంతాలను ఏడాది పొడవునా అనుసంధానించనున్న ప్రతిష్ఠాత్మక జోజిలా టన్నెల్ ప్రాజెక్టు మరో చారిత్రాత్మక మైలురాయిని చేరుకుంది. 13.153 కిలోమీటర్ల పొడవైన ప్రధాన టన్నెల్ తుది నూతన ఆవిష్కరణ (బ్రేక్‌త్రూ) కార్యక్రమం ఈనెల9న జరగనుండగా, కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు.ప్రపంచంలోనే అత్యంత ఎత్తులో నిర్మితమవుతున్న అత్యంత పొడవైన సింగిల్‌ట్యూబ్ ద్విముఖ రహదారి సొరంగంగా గుర్తింపు పొందిన జోజిలా టన్నెల్, సోనమార్గ్ సమీపంలోని బాల్తాల్ నుంచి ద్రాస్‌కార్గిల్ ప్రాంతంలోని మీనమార్గ్ వరకు విస్తరించింది. సముద్ర మట్టానికి సుమారు 11,578 అడుగుల ఎత్తులో నిర్మితమవుతున్న ఈ టన్నెల్, భారీ మంచు కారణంగా ఏడాదిలో అనేక నెలలు మూసివేయాల్సి వచ్చే జోజిలా పాస్‌కు శాశ్వత ప్రత్యామ్నాయంగా నిలవనుంది. నేషనల్ హైవేస్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్‌హెచ్ఐడిసిఎల్) ఆధ్వర్యంలో హైదరాబాద్‌కు చెందిన మేఘా ఇంజినీరింగ్ అండ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్ (ఎంఈఐఎల్) ఈ ప్రాజెక్టును నిర్మిస్తోంది. హిమాలయ ప్రాంత భౌగోళిక పరిస్థితులకు అనుగుణంగా న్యూ ఆస్ట్రియన్ టన్నెలింగ్ మెథడ్ (ఎన్ఎటిఎం) సాంకేతికతతో పనులు చేపట్టారు.ప్రాజెక్టు పూర్తయిన తర్వాత శ్రీనగర్‌లడఖ్ మధ్య 365 రోజులపాటు రవాణా సౌకర్యం అందుబాటులోకి రానుంది. ద్రాస్, కార్గిల్, లేహ్ ప్రాంతాలకు సరుకుల రవాణా, అత్యవసర సేవలు సులభతరం కావడంతో పాటు సైనిక దళాల రవాణా సామర్థ్యం కూడా మరింత బలోపేతం కానుంది. పర్యాటకం, వాణిజ్యం, ప్రాంతీయ ఆర్థికాభివృద్ధికి ఈ ప్రాజెక్టు కీలకంగా మారనుంది.2020 అక్టోబర్‌లో ప్రారంభమైన ఈ ప్రాజెక్టు నిర్మాణంలో తీవ్ర శీతాకాలం, హిమపాతాలు, క్లిష్ట భౌగోళిక పరిస్థితులు వంటి అనేక సవాళ్లను ఎదుర్కొన్నారు. గత ఐదేళ్లలో ఐదు ప్రధాన హిమపాత ఘటనలు సంభవించినప్పటికీ నిర్మాణ పనులు కొనసాగించడంలో ఎంఈఐఎల్ విజయవంతమైంది.

సుమారు 1,200 మంది కార్మికులు ఈ ప్రాజెక్టు నిర్మాణంలో పాల్గొనగా, వారిలో 80 శాతం మంది స్థానికులే ఉన్నారు.మొత్తం 30.894 కిలోమీటర్ల పొడవున్న జోజిలా ప్రాజెక్టులో ప్రధాన టన్నెల్‌తో పాటు నిల్‌గ్రార్ జంట టన్నెల్లు, వంతెనలు, కట్‌అండకవర్ నిర్మాణాలు, స్నో గ్యాలరీలు, వెర్టికల్ షాఫ్ట్‌లు ఉన్నాయి. భారతదేశంలోనే అత్యంత పొడవైన వెర్టికల్ షాఫ్ట్‌లు కూడా ఈ ప్రాజెక్టులో భాగంగా నిర్మించారు.భారత ఇంజినీరింగ్ సామర్థ్యానికి ప్రతీకగా నిలిచిన జోజిలా టన్నెల్ తుది బ్రేక్‌త్రూ, దేశ మౌలిక సదుపాయాల రంగంలో మరో చారిత్రాత్మక విజయంగా నిలవనుందని అధికారులు పేర్కొంటున్నారు.

# ఖమ్మంకు ఆంధ్రా ఇసుక..

తెలంగాణ అధికారుల సహకారంతో..

బోనకల్ సరిహద్దుల నుంచి జిల్లాలోకి ప్రవేశం

మామూళ్ల వల విసురుతున్న ఇసుక సిండికేట్





**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఇసుక పిరమైంది. కొనే వారికి కన్నీళ్లని, అక్రమార్కులకు కాసులను కురిపిస్తోంది. ఇప్పుడు ఇసుక అక్రమ రవాణా లాభసాటి వ్యాపారంగా మారింది. ఇదే అదునుగా కొందరు బరితెగించారు. ఖమ్మం జిల్లాలో ప్రైవేటు నిర్మాణాలకు ఇసుక కొరత ఏర్పడింది. గోదావరి పరివాహక ప్రాంతంలోని ఇసుక ర్యాంపుల నుంచి వస్తే తప్ప స్థానిక రేవుల నుండి ఇసుక లభ్యం కావడం లేదు. ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలకే లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణాజిల్లాకు చెందిన కొందరు ఇసుక వ్యాపారులు ఖమ్మం జిల్లాలోని సరిహద్దు ప్రాంత పోలీసులు, రెవెన్యూ అధికారులకు మామూళ్ల వల విసిరి యథేచ్ఛగా ఇసుకను తరలిస్తున్నారు. కంచికచర్లలోని ఓ సిండికేట్ ఖమ్మం జిల్లా పోలీసులను, అధికారులను నియంత్రిస్తూ పది నుంచి 15 టిప్పర్ల ద్వారా ప్రతి రోజు ఒక్కో టిప్పర్ నుంచి ఒకటి లేదా రెండు ట్రిప్పుల ఇసుకను ఖమ్మం నగరంతో పాటు పరిసర ప్రాంతాలకు సరఫరా చేస్తున్నట్లు తెలుస్తుంది. పగలు, రాత్రి అనే తేడా లేకుండా ఈ టిప్పర్లు యథేచ్ఛగా తిరుగుతున్నాయి. దీనికి తోడు కృష్ణాజిల్లా వత్సవాయి మండలం లింగాల సమీపంలోని మున్నేటి నుం చి కూడా ట్రాక్టర్ల ద్వారా బోనకల్, చింతకాని మండలాల ద్వారా ఖమ్మం జిల్లాలోకి ఇసుక ట్రాక్టర్లు ప్రవేశిస్తున్నాయి. వీటిని కూడా ఆపే నాథుడు లేకపోవడంతో యథేచ్ఛగా సరఫరా జరుగుతుంది. ఇసుక ట్రాక్టర్లకు సంబంధించి కొందరు అధికారులకు నెల వారి మామూళ్లు ఇ స్తున్నట్లు ఆరోపణలు వినపడుతున్నాయి. టిప్ప ర్ యజమానులు కూడా మామూళ్ల కప్పం క ట్టిన తర్వాతే జిల్లాలోకి ప్రవేశిస్తున్నట్లు తీవ్ర ఆరోపణలు వినవస్తున్నాయి. కంచికచర్ల నుంచి ఇసుక సరఫరా చేస్తున్న సిండికేట్‌కు చెందిన టిప్పర్లు అతివేగంగా ప్రయాణించడం ద్వారా ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇటీవల ఖమ్మం జిల్లా చింతకాని మండలం పందిళ్లపల్లిలో టి ప్పర్ అతివేగంగా వచ్చి ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో ఓ పంచాయతీ వార్డు సభ్యుడు మృతిచెందగా మరోకరికి తీవ్ర గాయాలయ్యా యి. సరిహద్దుల వద్ద గల పోలీస్, రెవెన్యూ అధికారులు పట్టించుకోకపోవడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడుతుంది. అక్రమ ఇసుక రవాణాపై కొందరు పోలీస్ అధికారులు చిత్తశుద్ధితో వ్యవహరిస్తున్నా పోలీస్ శాఖ నుంచే ఇసుక అక్రమ రవాణాదారులకు సమాచారం అందుతుందని దీనితో అక్రమార్కులు పోలీస్ ఉన్నతాధికారులకు, సర్కిల్ స్థాయి అధికారులకు చిక్కడం లేదన్న ఆరోపణలు వినవస్తున్నాయి. మొత్తంగా ఇసుక అక్రమ రవాణా కొందరికి కాసులు కురిపిస్తుంది. ఆంధ్రా నుంచి ఇసుక అక్రమ రవాణా తెలంగాణ అధికారుల సహకారానికి సంబంధించి పూర్తి స్థాయి విచారణ జరిపితే అనేక విషయాలు వెలుగు చూసే అవకాశం ఉంది. ఇసుక సిండికేట్లకు సహకరిస్తున్నదెవరు? నెలవారి మామూళ్లు అందిస్తున్న ముఠా ఎవరు? అన్న దానిపై కూడా పూర్తి స్థాయి విచారణ జరగాల్సిన అవసరం ఉంది.

# టెండర్ విధానాన్ని రద్దు చేసేదాకా పోరాడుతాం



**ప్రజాపక్షం/ వరంగల్:** రాష్ట్ర ప్రభుత్వం టెండర్ విధానాన్ని రద్దుచేసి చేనేత కార్మికులు నేసిన బెడ్ షీట్స్, కార్పెట్స్ టెస్కో ద్వారా ఖరీదు చేయాలని తెలంగాణ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు డిమాండ్ చేశారు. వరంగల్ పట్టణంలోని గోపాలస్వామి గుడి సెంటర్ లో కొండా లక్ష్మ ణ్ బాపూజీ విగ్రహం వద్ద ఆదివారం రెండవ రోజు నిరసన దీక్షలు నిర్వహించారు. కార్యక్రమానికి ఆప్కో మాజీ డైరెక్టర్ దేవులపల్లి సత్య నారాయణమూర్తి అధ్యక్షత వహించగా ఈ దీక్షలను తెలంగాణ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చేనేత కార్మికులు వారం రోజులుగా మగ్గాలు బంద్ పెట్టి రెండు రోజులుగా నిరసన దీక్షలు చేపట్టిన ప్రభుత్వం స్పందించకపోవడం దుర్మార్గమన్నారు. ప్రభుత్వ విధానాలతో ఇప్పటికే తీవ్రమైన సంక్షోభంలో ఉన్న చేనేత పరిశ్రమను రక్షించేందుకు, కార్మికులకు పనులు కలిగించేందుకు చర్యలు చేపట్టాల్సింది పోయి ఉన్న కొద్దిపాటి ఉపాధినే లేకుండా చేసేందుకే ప్రభుత్వం టెండర్ విధానాన్ని తెచ్చిందన్నారు. దీనితో కార్మికుల పరిస్థితి పెనం మీద నుండి పొయ్యిలో పడ్డ చందంగా తయారైందన్నారు. డిమాండ్స్ సాధించేదాకా కార్మికులంతా ఐక్యంగా సంఘటితంగా తెగించి పోరాడాలన్నారు. మాజీ శాసనసభ్యుడు వన్నాల శ్రీరాములు ప్రసంగిస్తూ ఎన్నికల హామీలను అమలు పరచకుండా చేనేత కార్మికులను ప్రభుత్వం మోసం చేస్తున్నదన్నారు. మాజీ మేయర్ డాక్టర్ రాజేశ్వరరావు ప్రసంగిస్తూ వరంగల్ లో నేతన్నలు నేసే దరీస్ ప్రపంచంలోనే ఎంతో ప్రసిద్ధిగాంచాయన్నారు. చేనేతను ప్రోత్సహించాల్సిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదన్నారు. పరిశ్రమ రక్షణకు, హక్కుల సాధన కోసం చేస్తున్న పోరాటానికి సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈకార్యక్రమంలో బిసి ఇంటలెక్చువల్ ఫోరం నాయకుడువీరస్వామి, పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షులు రవీందర్, వొడ్నాల నరేందర్, గోరంట్ల రాజు, మాజీ కార్పొరేటర్స్ కుసుమ సతీష్, యెలుగం చిన్న భద్రయ్య, దామెర సర్వేశ్, బేతి అశోక్, చేనేత నాయకులు అడిగొప్పల సంపత్ ,యెలుగం వెంకటమలు, యెలుగం సాంబయ్య, దువ్వల రాజేందర్, ఓంప్రకాష్, కొలిపాక మధునయ్య, మాషబత్తుల కుమారస్వామి, యెలుగం చిన్న వీరస్వామి, మాటేటి రాములు, బూర వేణు, కూచన లక్ష్మీ నారాయణ, కోట మల్లయ్య ,వలుస కిరణ్, కూరపాటి సంపత్,మహిళ కార్మికుల తదితరులు పాల్గొన్నారు.

# ఏడాదిలో సాగునీటి ప్రాజెక్టులు పూర్తి

నియోజకవర్గంలోని ప్రతి ఎకరానికీ సాగునీరు అందించడమే ప్రధాన లక్ష్యం

మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్

**ప్రజాపక్షం/గొల్లపల్లి:** ధర్మపురి నియోజకవర్గంలోని ప్రతి ఎకరానికి సాగునీటిని అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని ఏడాదిలోపు నియోజకవర్గంలోని పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేసి ప్రతి ఎకరానికి సాగు నీరు అందించడమే ప్రధాన లక్ష్యమని రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్ అన్నారు. ఆదివారం జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలంలో మంత్రి సుడిగాలి పర్యటన చేసి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేయడంతో పాటు ముఖ్యమంత్రి సహాయ నిధి, కల్యాణ లక్ష్మి చెక్కులను మంత్రి పంపిణీ చేశారు. గొల్లపల్లి మండలంలోని చిల్వకోడూర్ గ్రామంలో రూ. 7.65 లక్షల వ్యయంతో పెద్ద చెరువు తూము మరమ్మత్తు పనులకు మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి మాట్లాడుతూ నియోజకవర్గంలో గత ప్రభుత్వ పాలనలో అనేక సాగు నీటి ప్రాజెక్టు పెండింగ్ లో ఉన్నాయని వాటిని పూర్తి చేయకపోవడంతో రైతులు సాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారని మంత్రి అన్నారు. నియోజకవర్గంలోని పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయడానికి రూ. 1,000 కోట్లు అవసరమని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి తెలపడంతో నియోజకవర్గంలోని పెండింగ్ ప్రాజెక్టుల పూర్తికి మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి అంగీకరించినట్లు మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్ తెలిపారు. నియోజకవర్గంలోని పత్తిపాక రిజర్వాయర్, అక్కపల్లి లిఫ్ట్, మేడారం రిజర్వాయర్ నుండి కొత్తపల్లి వరకు కాలువ పనులతో పాటు మిగిలిన పెండింగ్ ప్రాజెక్టులు ఏడాదిలో పూర్తి చేస్తామని మంత్రి తెలిపారు. ముఖ్యమంత్రి సహాయ నిధి, కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ, కళ్యాణ లక్ష్మి , సీఎం సహాయనిధి చెక్కులు నిరుపేద ల పాలిట వరం లాంటివని మంత్రి లక్ష్మ ణ్ కుమార్ అన్నారు.గొల్లపల్లి మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని వివిధ గ్రామాలకు సంబంధించి 78 మంది లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి ద్వారా మంజూరైన రూ.26 లక్షల 12 వేల ఐదు వందల విలువగల చెక్కులతో పాటు 17 మంది ఆడ బిడ్డలకు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ ద్వారా మంజూరైన రూ.17 లక్షల విలువ గల చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు.

# పేపర్ లీక్ అంటే ఏమిటో మీ నిర్వచనం చెప్పండి

ఎన్‌టిఎను ప్రశ్నించిన పార్లమెంటరీ కమిటీ

నీట్‌–ఓఎస్ఎం సమస్యలపై సమగ్ర నివేదికలు సమర్పించండి

ఓఎస్ఎం కోసం అనర్హులకు మళ్ళీ ఎందుకు కాంట్రాక్టు ఇచ్చారు?

ఉన్నత విద్యాశాఖకు ఇచ్చిన ఎన్‌టిఎ వార్షిక నివేదికలేవి?

10వ తేదీలోపు లిఖితపూర్వక సమాధానాలకు డిమాండ్

**న్యూఢిల్లీ:** పేపర్ లీక్ అంటే ఏమిటో మీ నిర్వచనం చెప్పాలని నేషనల్ టెస్టింగ్ ఏజన్సీ (ఎన్‌టిఎ) అధికారులను పార్లమెంటరీ దర్యాప్తు కమిటీ ప్రశ్నించింది. 2018 నుండీ ఇప్పటివరకూ నిర్వహించిన పరీక్షలలో ఇంకేమైనా ప్రశ్నాపత్రాలు ఇంతకుముందు పరీక్షలకు ముందుగానే బయటకు వచ్చాయా? అనే ప్రశ్నకు కూడా సమాధానం చెప్పాలని కోరింది. జాతీయ పరీక్షా సంస్థతోపాటు సిబిఎస్ఇ నిర్వహించిన ఓఎస్ఎం (ఆన్‌–స్క్రీన్ మార్కింగ్ సిస్టమ్) లపై ర్యాంకుల తారుమారు విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడటం వంటి తీవ్ర గందరగోళ వాతావరణం మధ్య పార్లమెంటరీ కమిటీ దర్యాప్తులో భాగంగా ఈ ప్రశ్నలు అడిగినట్లు సంబంధిత వర్గాలు ఆదివారం తెలియజేశాయి. అదేవిధంగా ఎన్‌టిఎ,సిబిఎస్ఇ అధికారులను కమిటీ సభ్యులు ప్రశ్నలతో ఇంతకుముందే ఉక్కిరిబిక్కిరి చేశారు. ఓఎస్ఎం కోసం అనర్హులకు తిరిగి ఎందుకు కాంట్రాక్టు ఇచ్చారు? సమాధానాలు చెప్పాల్సిందిగా ఆదేశాలు జారీ చేశారు. జూన్ పదో తేదీలోపు ఎన్‌టిఎ, సిబిఎస్ఇలు పార్లమెంటరీ కమిటీ అడిగిన ప్రశ్నలకు,డిమాండ్లకు లిఖితపూర్వకంగా, వివరంగా సమాధానాలు ఇవ్వాల్సి ఉంది. ఐతే దీనిపై ఎన్‌టిఎ, సిబిఎస్ఇలు ఇంకా అధికారికంగా స్పందించలేదు.

ఎలాంటి ప్రశ్నాపత్రాలు పరీక్షలకు ముందుగానే బయటకు పొక్కలేదని ఎన్‌టిఎ అధికారులు గతవారం పార్లమెంటరీ కమిటీ ఎదుట హాజరై గట్టిగా వాదించారు. ఊరికే ఊహాత్మకమైన ముందస్తు అంచనా ప్రశ్నాపత్రం చెలామణీలోకి వచ్చిందని అధికారులు వాదించినట్లు వర్గాలు తెలిపాయి. విద్య,మహిళలు,బాలలు,యువకులు,క్రీడలకు సంబంధించిన ఈ పార్లమెంటరీ కమిటీకి కాంగ్రెస్‌పార్టీ ఎంపి దిగ్విజయ్‌సింగ్ నాయకత్వం వహిస్తున్నారు. నీట్ పశ్నాపత్రాల లీకేజీ సమస్యతో పాటు సిబిఎస్ఇ నిర్వహించిన ఆన్‌–స్క్రీన్ మార్కింగ్ విధానంలో పెద్ద ఎత్తున జరిగిన గందరగోళం, మెరిట్ విద్యార్థుల ర్యాంకులు గణనీయస్థాయిలో పడిపోయిన వివాదం గురించి కూడా ఈ విచారణ జరుగుతోంది.ఈ రెండు రకాల జాతీయస్థాయి పరీక్షలలో జరిగిన అవకతవకలపై ఎన్‌టిఎ,సిబిఎస్ఇ సహా ఉన్నతస్థాయి ప్రభుత్వ అధికారులను కూడా దర్యాప్తులో భాగంగా పార్లమెంటరీ కమిటీ విచారణ నిమిత్తం తన వద్దకు పిలిపించింది.

2024లో నీట్‌–యుజి ప్రశ్నాపత్రం(సిబిఐకి దర్యాప్తు కాకుండా)లో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలపై ఏదైనా దర్యాప్తు చేశారా? అని పార్లమెంటరీ కమిటీ ఎన్‌టిఎ అధికారులను ప్రశ్నించింది. అదేవిధంగా సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సిబిఎస్ఇ), ఎన్‌టిఎల నుండి ఓఎస్ఎం నీట్ పరీక్షల సమస్యలపై లిఖితపూర్వక సమాధానాలు ఇవ్వాలని కోరింది. గడచిన మూడు సంవత్సరాలలో ఎన్‌టిఎలో ఉన్న సిబ్బంది సంఖ్య ఎంత? వారు సరిపడినంత మంది ఉన్నారా? 2022 నుండి తిరిగి కొత్త వారిని ఉద్యోగాల్లో నియమించే చర్యలు తీసుకున్నారా? అని కూడా ఎన్‌టిఎ అధికారులను కమిటీ ప్రశ్నించింది. గడచి మూడు సంవత్సరాలుగా ఉన్నత విద్యాశాఖకు ఎన్‌టిఎ సమర్పించిన వార్షిక నివేదికలను కూడా తక్షణం తమకు ఇవ్వాలని కూడా కమిటీ డిమాండ్ చేసింది. అదేవిధంగా రాధాకృష్ణన్ కమిటీ నివేదికలో ఇచ్చిన 101 సిఫార్సులకు సంబంధించి ప్రతి సిఫార్సుపైనా తీసుకున్న చర్యలు, కార్యాచరణపై సమగ్ర నివేదిక ఇవ్వాలని కూడా నిలదీశారు. ఇస్రో మాజీ ప్రధానాధిపతి కె.రాధాకృష్ణన్ నాయకత్వంలో ఒక ఉన్నత స్థాయీ నిపుణుల కమిటీ 2024 జూన్ నెలలో కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సులు ఇచ్చింది.

పరీక్షలను ఎంత పగడ్బందీగా దాపరికం లేకుండా ప్రజాస్వామ్యబద్ధంగా నిర్వహించాలి, గణాంకాల భద్రత, సంబంధిత ప్రోటోకాల్, ఎంత సజావుగా, సక్రమంగా నిర్వహించాలి, పరీక్షల ప్రక్రియ, పనితీరు వ్యవస్థలో ఉండాల్సిన అంచెలు,చేపట్టాల్సిన సంస్కరణలపై కమిటీ సిఫార్సులు ఇచ్చింది. అదేవిధంగా సిబిఎస్ఇ జూన్ ఎనిమిదో తేదీ నాటికి పార్లమెంటరీ కమిటీకి లిఖితపూర్వక సమాధానాలు వివరంగా సమర్పించాలి. ఎన్‌టిఎ కూడా జూన్ 10వ తేదీ నాటికి అడిగిన ప్రశ్నలన్నింటికీ లిఖితపూర్వక సమాధానాలు ఇవ్వాలి. కోరిన పత్రాలను, నివేదికలను సమర్పించాలి. పార్లమెంటరీ కమిటీ చేసిన డిమాండ్లపై ఎన్‌టిఎ, సిబిఎస్ఇలు అధికారికంగా ఇంకా స్పందించాల్సి ఉంది.

ఓఎస్ఎం వ్యవస్థ కోసం జారీ చేసిన ప్రతిపాదిత వివిధ విజ్ఞప్తుల మధ్య మార్పులు జరిగాయని చెబుతున్నారని, అదేమిటో చెప్పాలని, అదేవిధంగా పరీక్షల నిర్వహణ కోసం సిఓఇఎంపిటి సంస్థకు కాంట్రాక్టు ఇచ్చేముందు దాని గత చరిత్ర గురించి ఏదైనా పరిశీలన చేశారా? లేదా? ఎడ్యుకేషన్ టెక్‌కు లేదా గతంలో గ్లోబల్ ఎరీనా పేరుతో టెక్నాలజీస్ డైరెక్టర్లకు సంబంధం ఉందన్న విషఁం సిబిఎస్ఇకి తెలుసా?లేదా? 2019లో తెలంగాణలో ఇంటర్మీడియట్ పరీక్షలు జరిగినప్పుడు మూల్యాంకనంలో సాఫ్ట్‌వేర్ వైఫల్యం జరిగింది, ఈ లోపభూయిష్టమైన విధానాలు జరిగిన సాఫ్ట్‌వేర్ ఫెల్యూర్స్ గురించి సిబిఎస్ఇకి తెలుసా?లేదా? కాంట్రాక్టును కేటాయించే విషయంలో ఈ అంశాలను పరిగణనలోకి తీసుకున్నారా లేదా? గతంలో తప్పుచేసిన బిడ్డర్లను అనర్హులుగా ప్రకటించకుండా, ఆ నిబంధనలను ఎందుకు తొలగించారు? దీనికి ప్రేరేపణ ఏమిటి? అని సిబిఎస్ఇని పార్లమెంటరీ కమిటీ నిలదీసింది. బిడ్డర్ కంపెనీ కనీస టర్నోవరును రూ.50 కోట్లుగా ఎందుకు నిర్దేశించారని ప్రశ్నించింది.

ఆర్ఎఫ్‌పి నిబంధనలను ఎందుకు మార్పు చేశారో చెప్పండి అని నిలదీసింది. సమాధాన పత్రాలను దిద్దేటప్పుడు ఓఎస్ఎంలో కంప్యూటర్ తెరమీద సరిగా అక్షరాలు కనిపించలేదని ఫిర్యాదులు వచ్చాయని, స్కానింగ్ రిజల్యూషన్‌ను 300 డిపిఐ నుండి 200 డిపిఐకి ఎందుకు కుదించారో కూడా సమాధానం చెప్పాలని నిలదీసింది.

కాగా, ఓఎస్ఎం వ్యవస్థకోసం గత ఏడాది ఫిబ్రవరి, మే, ఆగస్టు నెలల్లో జారీ చేసిన ఆర్ఎఫ్‌పిలకు సంబంధించిన పత్రాలు సమర్పించాలని కోరినప్పటికీ పార్లమెంటరీ కమిటీకి సిబిఎస్ఇ వాటిని సమర్పించలేదని సంబంధిత వర్గాలు చెప్పాయి.

## పక్కా ప్రణాళికతో బ్యాటరీ కంపెనీలో దొంగతనం

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** పోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలో ఆకాష్ మెటల్ ఇండస్ట్రీస్ నారాయణగిరి బ్యాటరీ కంపెనీలో శనివారం కంపెనీలో దొంగతనం జరిగినట్లు కేసు నమోదు అయింది. స్టేషన్ హౌస్ ఆఫీసర్ కె భాస్కర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం కంపెనీలో పని చేసే సూపర్వైజర్స్ నల్లగట్ల శశికుమార్, రాపోలు భాస్కర్ వీరిద్దరూ కలిసి ప్రణాళికాబద్ధంగా వ్యూహం రచించి కంపెనీలో వారి కింద పనిచేసే కార్మికులని ఉపయోగించుకొని చాలాకాలంగా కంపెనీలో గల సీసం దిమ్మెలను కంపెనీ ప్రహరీ గోడ అవతలికి విసిరివేసి తర్వాత వేరే ఆటోలో వేసుకొని వెళ్లి బయట అమ్ముతున్నారు. గత రెండు మూడు నెలల నుండి సుమారుగా 25 మెట్రిక్ టన్నుల సీసంను స్టాక్ లో తగ్గినట్లుగా యాజమాన్యం గుర్తించి నిఘా పెట్టీ పరిశీలించగా శనివారం కంపెనీ బయట సీసం దిమ్మెలను గమనించి కంపెనీలోని వారందరినీ విచారించగా సూపర్వైజర్స్‌గా పని చేస్తున్న నిందితులిద్దరూ దొంగతనం చేసినట్లుగా ఒప్పుకున్నారు. పోచంపల్లి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని ప్రస్తుతం సూపర్వైజర్స్ ఇద్దరిని కూడా అదుపులోనికి తీసుకొని విచారిస్తున్నట్లు తెలిపారు.

## కల్యాణ మహోత్సవంలో ఎమ్మెల్యే




**ప్రజాపక్షం/రామన్నపేట :** రామన్నపేట మండలం శోభానాద్రిపురం గ్రామంలో నిర్వహించిన శ్రీ మల్లికార్జున స్వామి & శ్రీ కంఠమహేశ్వర స్వామి వారి కల్యాణ మహోత్సవ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ & నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే కు ఘన స్వాగతం పలికిన అనంతరం, స్వామి వారిని దర్శించుకొని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామ ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## లక్షలు వెచ్చించి నిర్మించిన ప్రభుత్వ భవనం నిరుపయోగం



**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం :** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో ప్రభుత్వం అధికారుల విశ్రాంతి కోసం లక్షల రూపాయలతో నిర్మించిన ప్రభుత్వ భవనం కొంత కాలంగా స్థానిక తహసిల్దార్ లు విశ్రాంతి భవనముగా వినియోగించేవారు. తర్వాత దాని వినియోగంపై పూర్తిగా నిర్లక్ష్యం వహించడంతో ప్రస్తుతం ఆ భవనం పాడుబడిన స్థితికి చేరుకుంది. ఆ భవనానికి తాళాలు వేసి ఏళ్ల తరబడి ఖాళీగా ఉండడంతో గోడలు చెదిరిపోతుండగా కిటికీలు ధ్వంసం అవుతున్నాయి. చెత్త చెదారంతో భవనం నిర్జన ప్రాంతాన్ని తలపిస్తుంది. గోడలు పగుళ్లు కనిపించడం ప్రజాధనం వృధా అవుతున్నది అనడానికి నిదర్శనంగా నిలుస్తుంది. ప్రభుత్వం నిరుపయోగంగా ఉన్న ప్రభుత్వ భవనాలను వినియోగంలోకి తీసుకురావాలని ఆదేశాలు ఉన్న స్పందన కరువైంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి భవనాన్ని వినియోగంలోకి తీసుకురావాలని లేకపోతే ప్రభుత్వ కార్యాలయాల వినియోగం కోసం వినియోగించుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ప్రజాధనాన్ని కాపాడే బాధ్యత అధికారులపై ఉందని, చర్యలు చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## సాగర్‌లో మూడేళ్ల తర్వాత బాలికల ఉన్నత పాఠశాల పునః ప్రారంభం



**ప్రజాపక్షం/నందికొండ:** గత మూడు సంవత్సరాలుగా మూతపడిన హిల్ కాలనీలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల తిరిగి ప్రారంభం కానుంది. 2026–27 విద్యా సంవత్సరం నుంచి పాఠశాలలో విద్యాబోధన పునరుద్ధరించనున్నట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు.ప్రభుత్వ ఆదేశాలు, జిల్లా కలెక్టర్, జిల్లా విద్యాశాఖ అధికారి, మండల విద్యాధికారి సూచనల మేరకు పాఠశాలలో తెలుగు, ఇంగ్లీష్ మాధ్యమాల్లో బోధన నిర్వహించనున్నారు. బాలికలకు నాణ్యమైన విద్య అందించాలనే లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు పేర్కొన్నారు. విద్యార్థుల నమోదు ప్రక్రియను విస్తృతంగా చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రొఫసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా సోమవారం నుంచి ఉపాధ్యాయులు ఇంటింటికీ వెళ్లి తల్లిదండ్రులను కలుసుకుని పాఠశాల విశేషాలను వివరించనున్నారు. గతంలో ఈ పాఠశాలలో చదివిన విద్యార్థినులతో పాటు కొత్తగా ప్రవేశాలు పొందే బాలికలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి తరిగి రాములు, ప్రభుత్వ ఆదర్శ పాఠశాల ప్రధానోపాధ్యాయులు శేషు, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ధనం మాట్లాడుతూ, బాలికల విద్యాభివృద్ధికి ఈ పాఠశాల పునఃప్రారంభం కీలకంగా మారనుందని తెలిపారు.

## లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలి :ఎస్‌పి




**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** ఈనెల 20న జరిగే జాతీయ లోక్‌అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎస్‌పి కె.నరసింహ కోరారు. ఈనెల 20వ తేదీన జరగనున్న జాతీయ మెగా లోక్ అదాలత్ ఉన్నందున రాజీపడదగిన కేసులలో, క్రిమినల్ కంపౌండబుల్ కేసులు, సివిల్ తగాదా కేసులు, ఆస్తి విభజన కేసులు, కుటుంబపరమైన కేసులు, డ్రంకన్ డ్రైవ్ కేసులు, మోటారు ట్రాన్స్‌పోర్టు రోడ్డు నిబంధనలు ఉల్లంఘన కేసులు, వైవాహిక జీవితానికి సంబంధించిన కేసులు, బ్యాంకు రికవరీ, చెక్‌బౌన్స్ ఇలా రాజీపడదగిన కేసుల్లో కక్షిదారులు రాజీ చేసుకోవచ్చని తెలిపారు. రాజీయే రాజ మార్గమన్నారు. న్యాయశాఖ ఇచ్చిన అవకాశాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎవరైనా తమ కేసుల్లో రాజీకావాలనుకునేవారు సంబంధిత పోలీస్ అధికారులను సంప్రదించాలని, లోక్‌అదాలత్ ద్వారా బాధితులకు సత్వరమే న్యాయం జరుగుతుందని తెలిపారు.

# కౌన్సిలర్ల 'హుకూం'!

- వార్డు ప్రజలు పనుల కోసం నేరుగా వస్తే చేయొద్దు
- ఏ పనులైనా మేము చెబితేనే చేయాలి
- ఎన్నికల ఖర్చులు పూడ్చుకునేందుకు ఎన్నెన్నో చిత్రాలు

> సూర్యాపేట మున్సిపాలిటీలో నూతనంగా ఎన్నికైన కొందరు కౌన్సిలర్లు తమ పరిధిని దాటి ప్రవర్తిస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వీరు ఎన్నికై నాలుగు నెలలు కూడా ఇంకా పూర్తి కాలేదు. ప్రజాసేవ చేసే భాగ్యం తమకు దక్కడం ఎంతో సంతోషంగా ఉందని చెప్పుకునే కౌన్సిలర్లు తమ వార్డు పరిధిలో ప్రతి దానిలో వేలు పెడుతున్న పరిస్థితి. తమ పనుల కోసం నేరుగా మున్సిపల్ కార్యాలయానికి వచ్చే వారి పనులు అధికారులు చేయొద్దని ఏ పనులైనా మేము చెప్పిన తర్వాతే చేయాలంటూ హుకుం జారీ చేస్తున్నారని అధికారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అన్ని పనులు మీరే చేసుకుంటూ పోతే మేము ఎన్నికల్లో పెట్టిన ఖర్చు ఎలా పూడ్చుకోవాలంటూ బహిరంగంగానే చెబుతూ ఎన్నెన్నో చిత్రాలకు తెర లేపుతున్నారు.

**ప్రజాపక్షం/సూర్యాపేట :** సూర్యాపేట మున్సిపాలిటీ మొత్తం 48 వార్డులుగా విస్తరించి ఉంది. ఫిబ్రవరి 13న మున్సిపల్ ఎన్నికలు జరగగా 16వ తేదీన ఎన్నికైన కౌన్సిలర్లు ప్రమాణ స్వీకారం చేశారు. ఏడాదికి పైగా మున్సిపాలిటికి పాలకవర్గం లేకపోవడంతో ఆయా వార్డుల్లో ప్రజాసమస్యలు పేరుకుపోయాయి. నూతన పాలకవర్గం కొలువు తీరడంతో తమ సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని ప్రజలు ఎంతో సంతోషించారు. కానీ ప్రజలు ఓట్లు వేసి గెలిపించిన తరువాత కొంతమంది కౌన్సిలర్లు ఆదాయ వనరుల కోసం ప్రజలను, మున్సిపల్ అధికారులు, సిబ్బందిని ఇబ్బందులకు గురిచేస్తున్నారని గగ్గోలు పెడుతున్నారు. సూర్యాపేట మున్సిపాలిటిలో గతంలో విలీనమైన గ్రామాల పరిధితోపాటు, పాతబస్తీల పరిధిలో ప్రాతినిధ్యం వహిస్తున్న కొందరు కౌన్సిలర్లు తమ పరిధి దాటి ప్రవర్తిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. తమకు చెప్పకుండా ఎవరికి కూడా నూతన గృహ నిర్మాణ అనుమతులు, ఇంటి నంబర్లు కేటాయించవద్దని టౌన్ ప్లానింగ్, రెవెన్యూ విభాగం అధికారులపై తీవ్ర ఒత్తిడి తెస్తున్నారు. ఓ కౌన్సిలర్ కుమారుడు, మరో ఇద్దరు కౌన్సిలర్ల భర్తలు తమను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని అధికారులు, ఉద్యోగులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇది ఎలా కుదురుద్దని అధికారులు చెబితే మేము చెప్పినట్లు మీరు చేయాలి... నీవు ఇక్కడ పని చేయాలనుకుంటున్నావా అసలు నా గురించి నీకు తెలుసా అంటూ కార్యాలయంలోకి వచ్చి బహిరంగంగానే బెదిరింపులకు పాల్పడుతున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా కౌన్సిలర్లు ప్రవర్తిస్తున్న తీరుతో అధికారులు, ఉద్యోగులు మేము పనిచేయలేమనే పరిస్థితికి వచ్చారు. ఇదిలా ఉంటే ఆయా వార్డుల్లో పనిచేసే శానిటేషన్ సిబ్బంది ప్రతిరోజు ఉదయమే తమ ఇంటికి రావాలని తాము హాజరు తీసుకున్న తర్వాతే పనికి వెళ్లాలని, పని ముగిసిన తర్వాత కూడా కనపడి పోవాలంటూ ఆదేశాలు జారీ చేయడంతో విస్మయానికి గురవుతున్నారు. శానిటేషన్ సిబ్బంది సంబంధిత అధికారి, వార్డు సూపర్‌వైజర్ ఆదేశాలు, పర్యవేక్షణలో పనిచేయాల్సి ఉండగా వారిని పక్కకు పెట్టి నేరుగా తమపై పెత్తనం చెల్లాయిస్తున్నారని పారిశుద్ధ్య సిబ్బంది వాపోతున్నారు. ఇదిలా ఉంటే నూతన గృహ నిర్మాణం ఎవరు చేపట్టినా, వెంచర్లు ఏవరు చేసినా అక్కడికి తన అనుచరులు, కౌన్సిలర్ గద్దల్లా వాలి ఇంటికి అనుమతులు ఉన్నాయా ఉంటే అన్నీ మాకు చూపించండి అంటూ అధికారుల్లా వారిపై ప్రశ్నల వర్షం కురిపించడం వారు కొద్దిగా తగ్గి మాట్లాడితే పనులు ఆపివేయడం లాంటి పనులు చేస్తూ వారిని తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారు. అంతో ఇంతో ఇస్తే తప్ప వదలని పరిస్థితి.




**ఎన్నికల ఖర్చులు పూడ్చుకునేందుకు ఎన్నెన్నో చిత్రాలు**

ప్రజల బాగోగులతోపాటు వార్డు అభివృద్ధికి పాటుపడాల్సిన కొందరు కౌన్సిలర్లు ఇటు ప్రజలను అటు అధికారులను ఇబ్బంది పెడుతుండడంతో ఇదేందని కొంతమంది ప్రశ్నిస్తే మా ఎన్నికల ఖర్చును ఏలా పూడ్చుకోవాలంటూ బహిరంగంగానే ఎదురు ప్రశ్నిస్తున్నారు. కేవలం మేము మురుగు కాల్వల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించేందుకు, వీధులను శుభ్రం చేయించేందుకే పరిమితమయ్యామని మేము జీవనం ఏలా సాగించాలని మాకు కడుపు, సంసారం ఉందని అడ్డా మీదికి కూలీ పనికి పోయే వారు రోజుకు వెయ్యి రూపాయలు సంపాదిస్తున్నారని రెండు రోజుల క్రితం ఓ కౌన్సిలర్ మున్సిపల్ కార్యాలయంలో ఓ అధికారి ముందు తన అక్కసును బహిరంగంగా వెల్లగక్కడం అందరిని ఆశ్చర్యానికి గురిచేసింది. ఎన్నికల ఖర్చులు పూడ్చుకునేందుకు కొందరు కౌన్సిలర్లు ఎన్నెన్నో చిత్రాలు చేస్తుండడంతో పట్టణంలో ప్రజలు పెద్దఎత్తున చర్చించుకుంటున్నారు. వీరి తీరును మార్చుకోకుంటే ప్రజల్లో వీరిపై ఉన్న గౌరవం మరింత దిగజారే అవకాశం ఉంది.

## ఇఎస్‌ఐ టెర్షియరీ కేర్ సేవలు ప్రారంభించిన ఎమ్మెల్యే

ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి



**ప్రజాపక్షం/మిర్యాలగూడ:** పారిశ్రామిక, వ్యాపార రంగాలలో పనిచేసే కార్మిక లోకానికి గుండె, కిడ్నీ వంటి దీర్ఘకాలిక వ్యాధులు సంభవించినప్పుడు ఉచితంగా కార్పొరేట్ స్థాయి వైద్యం అందించేందుకు మిర్యాలగూడ రివర్ హాస్పిటల్స్ అడుగులు వేయడం హర్షణీయమని స్థానిక శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి కొనియాడారు. పట్టణంలోని చర్చ్ రోడ్డులో గల రివర్ ఆసుపత్రిలో ఈఎస్ఐ టెర్షియరీ కేర్ సూపర్ స్పెషాలిటీ విభాగాన్ని మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, వార్డు కౌన్సిలర్ల సమక్షంలో ఎమ్మెల్యే జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ లోకిరెడ్డి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న వేలాది మంది ఈఎస్ఐ లబ్ధిదారులకు ఈ కేంద్రం ద్వారా క్యాష్‌లెస్ సేవలు అందుబాటులోకి వచ్చాయన్నారు. ఈ పథకం ద్వారా గుండె, కిడ్నీలు, లివర్, మెదడు, నరాల వ్యాధులకు సంబంధించిన క్లిష్టమైన ఆపరేషన్లను ఉచితంగా నిర్వహిస్తారు. అత్యవసర ప్రమాద బాధితుల కోసం 24 గంటల పాటు ట్రామా కేర్ వైద్యులు అందుబాటులో ఉంటారు. గత ఏడాది కాలంలో ఈ ఆసుపత్రి ఆరోగ్యశ్రీ ద్వారా 400 మందికి గుండె చికిత్సలు, 300 మందికి పైగా కిడ్నీ బాధితులకు విజయవంతంగా వైద్యం అందించి గుర్తింపు పొందింది. బీహెచ్‌ఈఎల్, టీఎస్‌జెన్‌కో, వివిధ కార్పొరేట్ సంస్థల ఉద్యోగులకు ఇక్కడ ఉచిత సేవలు లభిస్తాయి. కార్యక్రమంలో ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ వెంకట్రావు, ఇంటెన్సివిస్ట్ డాక్టర్ మహేష్, ఐసీయూ స్పెషలిస్ట్ డాక్టర్ నరేష్, యూరాలజిస్ట్ డాక్టర్ సుబ్బారెడ్డి, డాక్టర్ అంజిరెడ్డి గ్రూప్ చైర్మన్ డాక్టర్ అంజిరెడ్డి, స్థానిక ప్రముఖులుపాల్గొన్నారు.

## కార్మిక హక్కులు కాపాడేది ఎంప్లాయిస్ యూనియన్



ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి మేకల శ్రీనివాసరావు

**ప్రజాపక్షం/కోదాడ:** కార్మికుల హక్కుల కోసం నిరంతరం పోరాటంతో పాటు 8 గంటల పని విధానం వారంతపు సెలవులు సాధించిన ఘనత ఎంప్లాయిస్ యూనియన్‌కి దక్కిందని ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి మేకల శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం కోదాడ పట్టణంలోని బస్టాండ్‌లో పలు సంఘాలలో అనుబంధ సంఘం వారు ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షులు జమాల్‌గౌడ్ ఆధ్వర్యంలో మేకల శ్రీనివాసరావు సమక్షంలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణ సంస్థలో జరుగుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో కార్మికుల శ్రేయస్సు కోసం ఐక్య ఉద్యమాల సారధి ఎంప్లాయిస్ యూనియన్ చేస్తున్న కృషిని, ఎంప్లాయిస్ యూనియన్ చేస్తున్న పోరాటాలను చూసి ఆర్టీసీ కార్మికుల హక్కులను కాపాడే ఏకైక నాయకత్వం ఎంప్లాయిస్ యూనియన్ అని అన్నారు. నాటి పాలకులకు వ్యతిరేకంగా 55 రోజుల సమ్మె నిర్వహించి హక్కులను సాధించి నేటి ప్రభుత్వంపైన పోరాటం నడిపి రాష్ట్ర ప్రభుత్వానికి ఒప్పించి యూనియన్ ఎన్నికలను సిద్ధం చేస్తున్న ఏకైక సంఘం ఎంప్లాయిస్ యూనియన్ అని ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనం చేసే బాధ్యత ఎంప్లాయిస్ యూనియన్ తీసుకుందని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో బాగంగా ఎంప్లాయిస్ యూనియన్ కోదాడ డిపో నూతన కమిటిని ఎన్నుకోవడం జరిగింది. ఎంప్లాయిస్ యూనియన్ డిపో గౌరవధ్యక్షులుగా మేకల శ్రీనివాసరావు, కమిటి చైర్మన్‌గా ఎస్ఎస్‌రావు, డిపో అధ్యక్షులుగా వై.శ్రీనివాసరావు, డిపో కార్యదర్శిగా ఎస్.వెంకన్న, డిపో ట్రెజరర్‌గా కె.వెంకన్న, మహిళ నాయకురాలుగా ఎ.భవాని, గురులక్ష్మి, సత్యావతి, డిపో గ్యారేజీ సెక్రటరీగా రవిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర నాయకులు కెఎస్‌రెడ్డి, పాండయ్య, భాసాని వెంకటయ్య, నందనం, రాజు, రాజశేఖర్, స్వామిగో పాల్, బ్రహ్మం పాల్గొన్నారు.

## చేనేత కార్మికులకు చేయూతనివ్వడం అభినందనీయం

యాదగిరిగుట్ట మున్సిపల్ చైర్మన్ గుండ్లపల్లి వాణి భరత్ గౌడ్



**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట :** తెలంగాణ చేనేత వస్త్రాల ప్రాధాన్యతను, వైభవాన్ని ప్రపంచానికి చాటిచెప్పడం ఎంతో సంతోషకరమని యాదగిరిగుట్ట మున్సిపల్ చైర్మన్ గుండ్లపల్లి వాణి భరత్ గౌడ్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఐటీ హబ్ హైటెక్ సిటీలో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన 'మన యాదాద్రి భువనగిరి జిల్లా పోచంపల్లి చేనేత వస్త్రాల ఎగ్జిబిషన్'ను ఆదివారం యాదగిరిగుట్ట పురపాలక సంఘం పాలకవర్గ బృందం సందర్శించింది. రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా కలెక్టర్ల ప్రత్యేక ఆహ్వానం మేరకు ఈ ఎగ్జిబిషన్కు విచ్చేసినట్లు మున్సిపల్ చైర్మన్ ఈ సందర్భంగా తెలిపారు. గత మూడు రోజులుగా హైటెక్ కాంప్లెక్స్ కొనసాగుతున్న ఈ ప్రదర్శన చేనేత కార్మికులకు ఆర్థికంగా ఎంతో చేయూతను ఇస్తుందని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. ఆధునిక యంత్రాలపై (మిషన్లపై) తయారయ్యే వస్త్రాల కంటే, మన చేనేత కార్మికులు మగ్గాలపై తమ నైపుణ్యంతో నేసే వస్త్రాలు ఎంతో రంగురంగులుగా, ఆకర్షణీయంగా మరియు నాణ్యతగా ఉన్నాయని కొనియాడారు. ప్రతి ఒక్కరూ చేనేత వస్త్రాలను ధరించి నేతన్నలకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. ఈ సందర్శనలో యాదగిరిగుట్ట మున్సిపల్ వైస్ చైర్మన్ బరిగే రమ్య రామచందర్, కౌన్సిలర్లు బోడ రాధా సురేష్, కాటబత్తిని స్వప్న ఆంజనేయులు, బిట్టు సరోజ హరీష్, కర్రె మాధవి ప్రవీణ్, పెలమెల్లి లావణ్య శ్రీధర్, సాదునేని ధనలక్ష్మి మధుకర్, బూడిద మధు, పేరబోయిన సత్యనారాయణ, బబ్బురి శ్రీధర్ వీరితో పాటు కోఆప్షన్ సభ్యులు బండి జంగమ్మ శ్రీశైలం, గౌలికర్ అరుణ రాజేష్, ఎండి రైమా సలాం, ఎస్కే ఉస్మాన్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

## పొగాకును పూర్తిగా విడనాడాలి

క్యాన్సర్ శస్త్ర చికిత్స నిపుణులు డాక్టర్ రామకృష్ణ ప్రసాద్



**ప్రజాపక్షం/చండూరు :** ప్రతి ఒక్కరు పొగాకుకు దూరంగా ఉండాలని గొగాకు వత్త నోటి క్యాన్సర్ వస్తుందని, క్యాన్సర్‌ను మొదటి దశలోనే గుర్తిస్తే భయపడవసిన అవసరం లేదని క్యాన్సర్ శస్త్ర చికిత్స నిపుణులు డాక్టర్ చిలుకూరి రామకృష్ణ ప్రసాద్ అన్నారు. స్టార్ హాస్పిటల్ హైదరాబాద్ సౌజన్యంతో చండూరు మున్సిపాలిటీ చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు సహకారంతో ఆదివారం చండూరులోని గాంధీ విద్యా సంస్థలలో ఉచిత మెగా క్యాన్సర్ క్యాంపును నిర్వహించారు. ఈ క్యాంపులో క్యాన్సర్ శస్త్ర చికిత్స నిపుణులు డాక్టర్ చిలుకూరు రామకృష్ణ , బ్రెస్ట్ సర్జరీ స్పెషలిస్టు డాక్టర్ శిరీష వైద్య బృందం 150మందికి క్యాన్సర్ పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ చిలుకూరు రామకృష్ణ మాట్లాడుతూ పొగాకు క్యాన్సర్‌కు కారణమని, పొగాకు వల్ల నోటి క్యాన్సర్ వస్తుందని తెలియజేశారు. ప్రజలందరూ పొగాకును విడనాడాలని సూచించారు. క్యాన్సర్‌ను మొదటి దశలో గుర్తిస్తే భయపడవలసిన అవసరం లేదని, చికిత్స ద్వార నయం చేయవచ్చునని అన్నారు. ఈ క్యాంపులో పాల్గొన్న ప్రతి మహిళకు క్యాన్సర్ పరీక్ష చేయడం జరిగిందని టెస్టుల ఫలితాలు మూడు రోజుల్లో వస్తాయని అన్నారు. టెస్టుల్లో ఎవరు ఆరోగ్యంగా ఉన్నారో, ఎవరు పేషేంటో ఈ టెస్టులో తెలుస్తుందని అన్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు మాట్లాడుతూ స్టార్ హాస్పిటల్ హైదరాబాద్ వారు ఉచిత మెగా క్యాన్సర్ క్యాంప్‌ను ఏర్పాటు చేసి ఒక్కొక్కరికి పదివేల రూపాయల పరీక్షలు ఉచితంగా చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో వివిధ రకాల ఉచిత క్యాంపులను నిర్వహించి పేద ప్రజలు ఉచిత వైద్యం అందించే విధంగా కార్యక్రమాలు నిర్వహిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో స్టార్ హాస్పిటల్ మేనేజర్ సుమన్, కోడి గిరిబాబు, కోడి వెంకన్న, మున్సిపల్ వైస్ చైర్మన్ భూతరాజు దశరథ, కౌన్సిలర్లు బుషిపాక వాసు, కటకం రమేష్, తేలుకుంట్ల రాజకుమారిచంద్రశేఖర్, కొండ్రెడ్డి మధు, సిసిఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు రాపోలు ప్రభాకర్, కర్నాటి శ్రీను, చిలుకూరి అశోక్, గజ్జల కృష్ణారెడ్డి, సరికొండ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



## 10న కలెక్టరేట్‌ల ఎదుట ధర్నా

**ప్రజాపక్షం/చిట్యాల :** కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలకు నిరసనగా సిపిఐ ఆధ్వర్యంలో జరుపతలపెట్టిన ఈ నెల 10న కలెక్టరేట్ కార్యాలయాల ముందు జరుపతలపెట్టిన ధర్నా కార్యక్రమంలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి లొడంగి శ్రవణ్‌కుమార్ కోరారు. నల్లగొండ జిల్లా చిట్యాల మున్సిపాలిటి కేంద్రంలో ఆదివారం జరిగిన పార్టీ మండల కౌన్సిల్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం ధరలను పెంచుతూ సామాన్య ప్రజలపై పెను భారాన్ని మోపుతుందని విమర్శించారు. కలెక్టరేట్ మందు నిర్వహించే ధర్నా కార్యక్రమంలో ప్రజలు, కార్యకర్తలు, నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని శ్రవణ్ కోరారు. ఈ సమావేశంలో పార్టీ మండల కార్యదర్శి ఎండి అక్బర్, సహాయ కార్యదర్శి జిల్లా సత్యం, నాయకులు షేక్ షరీఫ్, బొల్గూరి లింగయ్య, దేశగాని బాలరాజు, గుండాల సత్తయ్య, రావులు వెంకన్న, కడకంచి రామలింగయ్య, నర్రా శేఖర్‌రెడ్డి, దండి నర్సింహ్మా తదితరులు పాల్గొన్నారు.

## కరాటే ఆత్మరక్షణకు ఎంతగానో ఉపయోగం



మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** కరాటే ఆత్మరక్షణకు ఎంతగానో ఉపయోగపడుతుందని మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని సద్దుల చెరువు మిని ట్యాంక్ బండ్ వద్ద సుమన్ షోటో ఖాన్ స్పోర్ట్స్ కరాటే దు అకాడమీ ఇండియా ఆధ్వర్యంలో కరాటే మాస్టర్ జె.వి.రమణ ఆధ్వర్యంలో శిక్షణ పొందిన ఎల్లో బెల్ట్ 25, ఆరెంజ్ బెల్ట్ 7, గ్రీన్ బెల్ట్ 3, బ్లూ బెల్ట్ 3, బ్రౌన్ బెల్ట్ 1 విద్యార్థులు, శిక్షణ పొందిన సర్టిఫికెట్లను విద్యార్థులకు అందజేసి మాట్లాడారు. ప్రస్తుత సమాజంలో బాలికలు తమ ఆత్మ రక్షణ కోసం ఖచ్చితంగా కరాటే నేర్చుకోవాలని సూచించారు. కరాటేతో శారీరక దారుఢ్యం, మేదోసంపత్తి ఎంతగానో పెరుగుతుందన్నారు. విద్యార్థులు చదువులతోపాటు క్రీడల్లోనూ రాణించాలని తెలిపారు. నేటి యువత గంజాయికి, మత్తు పదార్థాలకు బానిస కాకుండా కరాటే వంటి స్పోర్ట్స్‌పై ఆసక్తి పెంచుకోవాలన్నారు. తల్లిదండ్రులు విద్యార్థుల ఆసక్తిని గమనించి ఆ దిశగా ప్రోత్సహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షఫీ ఉల్లా, కౌన్సిలర్ నామ అరుణ ప్రవీణ్, కరాటే శిక్షకులు జె.వి.రమణ, శ్రీమన్నారాయణ, రిషికేష్, హర్షవర్ధన్, విద్యార్థులు పాల్గొన్నారు.

## మానసిక, శారీరక ఎదుగుదలకు క్రీడలు ఎంతో అవసరం



వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వేపూరి తిరపతమ్మ

**ప్రజాపక్షం/నడిగూడెం:** చిన్నతనం నుండే విద్యార్థిని విద్యార్థులు చదువుతో పాటు క్రీడల పట్ల మక్కువ ఎర్పరుచుకుని క్రీడల్లో రాణించాలని, మానసికంగా, శారీరక ఎదుగుదలకు క్రీడలు ఎంతోగానో దోహదపడతాయని కోదాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వేపూరి తిరపతమ్మ సుధీర్ అన్నారు. ఆదివారం గత 40 రోజులుగా మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న వేసవికాల ఉచిత కబడ్డీ, క్రీడల శిక్షణ ముగింపు కార్యక్రమం సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్ వేపూరి తిరపతమ్మ, సర్పంచ్ దున్న శ్రీనివాస్ లు పాల్గొని మాట్లాడారు. మారుతున్న కాలనుగుణంగా మొబైల్ గేమ్‌లు, టివిలు, సినిమాలకు, బైకు మీద వెళ్లడం వంటి వాటికి విద్యార్థులు ఆలవాటు పడి మైదానంలోకి వచ్చి క్రీడలు ఆడటం, రన్నింగ్ చేయడం మానేశారని అన్నారు. గతంలో ఎంతోమంది కబడ్డీ, వాలీబాల్, క్రికెట్, చెస్, క్యారమ్, కోకో, లాంగ్ జంప్, హై జంప్, జావలింగ్ త్రో అనేక రకాల క్రీడల్లో రాణించి గుర్తింపు పొంది ఎంతోమంది ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగాలలో స్థిరపడ్డారని గుర్తు చేశారు. క్రీడల ప్రోత్సహనికి మావంతు సహాయ సహకారాలు అందిస్తామని అన్నారు. వార్డు మెంబర్ దున్న శ్రీకాంత్, ఉపాధ్యాయులు మీరాజుద్దీన్, రియాజ్, ఇంతియాజ్, పల్లపు నాగేశ్వరరావు, గోపాల్, కరుణాకర్, విజయ్ దినేష్, హరిష్, మహేష్, గోపి, అంజి, సమద్, శ్రీకాంత్, విశాల్, సతీష్ పాల్గొన్నారు.

"రవితేజ హీరోగా 'మైత్రీ మూవీ మేకర్స్' నిర్మిస్తున్న 'ఇరుముడి'. శివ నిర్వాణ దర్శకుడు భక్తి, కుటుంబ భావోద్వేగాలు, యాక్షన్ అంశాల సమ్మేళనంగా తెరకెక్కుతున్న ఈ చిత్రం అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునేలా ఉండబోతోంది."

# లీల

## 19న 'మా ఇంటి బంగారం' రిలీజ్



హీరోయిన్ సమంత

ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్ బ్యానర్ మీద సమంత, రాజ్ నిడిమోరు, హిమాంక్ దువ్వూరు రయుక్తంగా నిర్మిస్తున్న చిత్రం 'మా ఇంటి బంగారం'. సమంత ప్రధాన పాత్రలో నందినీ రెడ్డి తెరకెక్కించిన ఈ మూవీని 19న రిలీజ్ చేయబోతోన్నారు. అయితే ఈ సినిమా విడుదల పై సోషల్ మీడియా లో కొన్ని వార్తలు వచ్చిన నేపథ్యంలో సమితి ఒక వీడియో విడుదల చేసింది. ఈ సినిమా విడుదలపై వస్తున్న అనుమానాలకు తావు లేదని , ఖచ్చితంగా 19న విడుదల అవుతుంది అని స్పష్టం చేశారు. 'మా ఇంటి బంగారం'లో ప్రతీ ఎమోషన్ ఉంటుంది. కంప్లీట్ ఫ్యామిలీ ఎంటర్‌టెనర్‌గా ఉంటుంది. యాక్షన్, డ్రామా, కామెడీ అన్ని అంశాలుంటాయి. జూన్ 19న మా చిత్రం రాబోతోంది. అందరూ చూసి ఎంజాయ్ చేయండి. అభిమానులంతా గర్వపడేలా ఈ సినిమా ఉంటుంది అని సమంత అన్నారు. ఈ చిత్రానికి నందిని రెడ్డి దర్శకత్వం వహించారు. రాజ్ నిడిమోరు, హిమాంక్ దువ్వూరు నిర్మించారు. ఈ చిత్రంలో శ్రీముఖి , దిగంత్, గుల్షన్ దేవయ్య, గౌతమి, ఆనంద్, లక్ష్మి, శ్రీనివాస్ గవిరెడ్డి, మంజూష తదితరులు ముఖ్య పాత్రలు పోషించారు. ఈ చిత్రానికి కెమెరామెన్ : ఓం ప్రకాష్ సంగీతం : సంతోష్ నారాయణన్, యాక్షన్ : లీ విట్టేకర్, ఏజాజ్ గులాబ్, ఎడిటింగ్ : ధర్మేంద్ర కాకరాల, ప్రొడక్షన్ డిజైన్ : ఉల్లాస్ హైదర్.

## 'తెల్ల కాగితం' పై రాసుకున్న ప్రేమకథ



హర్ష్ రోషన్, నక్షత్ర జంటగా అరుణాచల క్రియేషన్స్ బ్యానర్ మీద కృష్ణ కొమ్మలపాటి నిర్మిస్తున్న చిత్రానికి 'తెల్ల కాగితం' అనే టైటిల్‌ను ఫిక్స్ చేశారు. ఈ మూవీకి రమేష్ బంద్రెడ్డి దర్శకత్వం వహిస్తున్నారు. 'కోర్ట్', 'బ్యాండ్ మేళం' వంటి విజయాల తరువాత హర్ష్ రోషన్ చేస్తున్న ఈ సినిమా ఫస్ట్ లుక్‌ను తాజాగా రిలీజ్ చేశారు. యూత్ ఫుల్ ఎమోషనల్ లవ్ స్టోరీగా ఈ మూవీ రాబోతోంది. ఇదొక అందమైన ప్రేమ కథా చిత్రమని అర్థం అవుతోంది. ఆహ్లాదకరమైన ఫస్ట్ లుక్ పోస్టర్‌ను రిలీజ్ చేసి సినిమా మీద అంచనాలు పెంచేశారు. నందు సవిరిగన ఈ చిత్రానికి కథ, కథనాన్ని, మాటలను అందించారు. లోతైన భావోద్వేగాలతో ఈ కథను రెడీ చేశారు. రమేష్ బంద్రెడ్డి ఈ మూవీతో దర్శకుడిగా పరిచయం కాబోతోన్నారు. ఈ రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌ను సరికొత్తగా మలిచి ప్రేక్షకులకు ఓ కొత్త ఎక్స్‌పిరియన్స్ ఇవ్వాలని దర్శకుడు ప్రయత్నిస్తున్నారు. విజయ్ బుల్గానిన్ ఈ సినిమాకి సంగీతాన్ని అందిస్తున్నారు. ప్రముఖ సినిమాటోగ్రఫర్ కె.వి. గుహన్ కెమెరామెన్‌గా పని చేస్తున్నారు. కార్తీక శ్రీనివాస్ ఎడిటర్‌గా వర్క్ చేస్తున్నారు. ఈ చిత్రానికి ప్రొడక్షన్ డిజైనర్: చిన్నా ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: రవి సూర్నెడ్డి కొరియోగ్రఫీ: ఈశ్వర్ పెంటి.

## త్వరలోనే కల్కి-2 రెగ్యులర్ షూటింగ్

### * 'సింగ్ గీతం' గుర్తుండే సినిమా నిర్మాత నాగ్ అశ్విన్




లెజెండరీ డైరెక్టర్ సింగీతం శ్రీనివాసరావు తాజా ప్రాజెక్ట్ 'సింగ్ గీతం'. వైజయంతి మూవీస్, స్వప్న సినిమా బ్యానర్ల పై ఈ చిత్రాన్ని నిర్మించారు. ఆయాన్, అహల్యా బమ్రూ, శాలిని కొండెపుడి ఈ చిత్రంలో కీలక పాత్రలు పోషించారు. జూన్ 11న థియేటర్లలో విడుదల కానుంది. ఈ సందర్భంగా నిర్మాత నాగ్ అశ్విన్ మీడియాతో చిట్ చాట్ నిర్వహించారు. సింగీతం శ్రీనివాసరావు ఈ కథను ఎప్పటినుంచో చేయాలని అనుకుంటున్నారు. కమల్ హాసన్ ని కలిసినప్పుడు ఒక ఆసక్తికరమైన విషయం చెప్పారు. పుష్పక విమానంకు ముందే ఈ కథను ఆయన కమల్ హాసన్ కి చెప్పారు. అయితే సంగీతంకి ఉన్న కొన్ని ప్రాజెక్టుల కారణంగా అది కుదరలేదు. ఫైనల్‌గా ఇప్పుడు మెటీరియలైజ్ అయింది. ఆయన సినిమాలు పుష్పక విమానం, ఆదిత్య 369, భైరవద్వీపం ఇలా ఏ సినిమా తీసుకున్న టైం లెస్‌గా వుంటాయి. ఇప్పటికీ పుష్పక విమానం చూస్తే చాలా లెవెంట్‌గాఉంటుంది. బహుశా అది ఆయన మాయాబజార్ సినిమా నుంచి నేర్చుకున్న మెలకువ కావచ్చు. సింగ్ గీతం కూడా ఈ జనరేషన్ కోసం తీసిన కథలా అనిపిస్తుంది. ఇది పూర్తిగా సింగీతం శ్రీనివాసరావు ఎంపిక. ఆయనకు కొత్త జనరేషన్‌తో పని చేయాలని ఉంటుంది. నటీనటులే కాదు, టెక్నీషియన్స్ కూడా ఎక్కువగా కొత్తవారే ఉండాలని భావిస్తారు. అంతేకాకుండా ఇది ఒక ప్రత్యేకమైన ప్రపంచంలో జరిగే కథ. పెద్ద స్టార్ నటీనటులు ఉంటే వారి ఇమేజ్ ప్రభావం పడే అవకాశం ఉంటుంది. కొత్త ముఖాలు అయితే ప్రేక్షకులు ఆ ప్రపంచాన్ని మరింత సహజంగా ఫీల్ అవుతారు. సినిమా నిర్మించడం నా ఫస్ట్ జాబ్ కాదు. ఒక కథ నచ్చి, ఆ కథను ఇంకెవరూ చేయలేరనిపించినప్పుడే నేను నిర్మిస్తాను. జాతిరత్నాలు కూడా అలాంటిదే. ఆ సమయంలో అలాంటి సినిమా ఎవరూ చేసేవారు కాదనిపించింది. సింగ్ గీతం కూడా అంతే. ఇది ఒక ఫిక్షనల్ స్టోరీ. కుబేరపురంలో గోల్ మైన్స్‌కు ఉంటాయి. ఆ ఊరికి, ఆ గోల్ మైన్స్కు ఉన్న కనెక్షన్ ఏమిటనేది సింగీతం సిగ్నేచర్ స్టైల్లో, ఆయన టేడ్‌మార్క్ హ్యూమర్‌తో చెప్పడం జరిగింది. రైటింగ్, రిహార్సల్ ప్రాసెస్ చాలా లాంగ్గా ఉంటుంది. దాదాపు తొమ్మిది నెలలు మేము రైటింగ్లోనే ఉన్నాం. నటీనటులు ఫైనల్ అయిన తర్వాత రిహార్సల్స్ కూడా చేశాం. సింగీతం చాలా స్పాంటేనియస్గా ఉంటారు. ఒకసారి ఏదైనా చెప్పి, తర్వాత ఆయనకే అది నచ్చకపోతే వెంటనే మార్చేస్తారు. 'మీరే చెప్పారు కదా?' అంటే, 'నేను తప్పు చేయకూడదా?' అంటారు. అలాంటి విషయాలు ఆయన దగ్గర నుంచి నేర్చుకున్నాను. ఆయనతో కలిసి పనిచేయడం ఒక గౌరవంగా భావిస్తున్నాను. నిజానికి ఆయనను కలవడమే గొప్ప విషయం. అలాంటిది రెండేళ్లు ఆయనతో కలిసి ప్రయాణించడం, ప్రతిరోజూ మాట్లాడడం, సినిమా తీయడం మాటల్లో చెప్పలేని ఆనందం.
ఇందులో డైలాగ్స్ అన్నీ పాటల్లా వస్తాయి. కానీ ప్రేక్షకులు కొద్దిసేపటికే ఆ విషయాన్ని మర్చిపోతారు. ఆ ప్రపంచంలోకి పూర్తిగా వెళ్లిపోతారు. పోస్ట్ ప్రొడక్షన్‌లో సినిమా చూశాను. ప్రతి సీన్ చాలా ఎంటర్‌టైనిర్‌గా సాగుతుంది. డైలాగ్స్ పాటల్లా వస్తున్నాయనే ఫీలింగ్ ఉండదు. నాకు అప్పుడప్పుడు నేను కొత్త తరం దర్శకుడినా కాదా అనే డౌట్ వస్తుంది. కానీ సింగీతం మాత్రం 94 ఏళ్ల వయసులో కూడా కొత్త తరం దర్శకుడే. ఈ సినిమా కూడా ఒక టీనేజర్ తీసినట్టుగా ఉంటుంది. వారం రోజులు చూసి మర్చిపోయే సినిమా కాదు ఇది. పదేళ్ల తర్వాత కూడా గుర్తుండే సినిమా తీయాలనే ఉద్దేశంతో ఈ ప్రాజెక్ట్ చేశాం.
తమిళంలో రిలీజ్ అవుతోంది. మిగతా భాషల విషయానికి వస్తే ఇది చాలా కష్టమైన ప్రక్రియ. ఎందుకంటే ఇందులో డైలాగ్స్ అన్నీ పాటల రూపంలో ఉంటాయి. కాబట్టి ప్రతి భాషలోనూ వాటిని మళ్లీ సంగీతబద్ధంగా రూపొందించాలి. అయితే ఖచ్చితంగా ఇతర భాషల్లో కూడా తీసుకెళ్లాలనే ఆలోచన ఉంది.' కల్కి 2 ' సినిమా షూటింగ్ ఇప్పటికే ప్రారంభమైంది. వచ్చే నెల నుంచి కంటిన్యూగా షూటింగ్ చేసి శరవేగంగా పూర్తి చేసేలా సన్నాహాలు చేస్తున్నాం.

## రామ్ పోతినేని సినిమాకు డిఓపిగా తిరు



హీరో రామ్ పోతినేని దర్శకత్వం వహిస్తూ నటిస్తున్నారు. ఈ సినిమాకు సంబంధించిన సాంకేతిక నిపుణుల ఎంపిక ప్రస్తుతం జరుగుతోంది. జాతీయ అవార్డు గ్రహీత, ప్రముఖ సినిమాటోగ్రాఫర్ తిరునావుకరసు (తిరు) ఈ చిత్రానికి డైరెక్టర్ ఆఫ్ ఫోటోగ్రఫీగా జాయిన్ అయ్యారు. కొత్తగా ప్రారంభించిన రాపో సినిమాటిక్స్ బ్యానర్‌పై కృష్ణ పోతినేని నిర్మిస్తున్న ఈ చిత్రం నియోనాయర్ సైకలాజికల్ యాక్షన్ థ్రిలర్‌గా రూపొందుతోంది.
కథ, దర్శకత్వం, నటనతో పాటు సినిమా వరల్ బిల్డింగ్ వరకు ప్రతి అంశంలోనూ ఆయన ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. భారతీయ సినీ పరిశ్రమలో తన అద్భుతమైన విజువల్ స్టైల్, ఫ్రేమింగ్, లైటింగ్, కథనానికి ప్రాణం పోసే సినిమాటోగ్రఫీతో తిరు ప్రత్యేక గుర్తింపు సంపాదించారు. ఈ చిత్రంలోని నటీనటులు, ఇతర సాంకేతిక నిపుణుల వివరాలను త్వరలోనే ప్రకటించనున్నారు.

## బాలన్ -ది బాయ్ ట్రైలర్ రిలీజ్

కేవీఎన్ ప్రొడక్షన్స్, తెస్పియన్ ఫిలిమ్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న సినిమా 'బాలన్ ది బాయ్'. ఈ చిత్రానికి 'ఆవేశం' ఫేమ్ డైరెక్టర్ జితూ మాధవన్ అందించిన స్క్రిప్ట్ తో 'మంజుమ్మెల్ బాయ్స్' చిత్ర దర్శకుడు చిదంబరం దర్శకత్వం వహిస్తున్నారు. వెంకట్ కె నారాయణ, శైలజా దేశాయి ఫెన్ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. ఈ సినిమా 19న హిందీతో పాటు మలయాళం, తెలుగు, కన్నడ, తమిళంలో ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఇటీవలే 'బాలన్ ది బాయ్' మూవీ ఫ్రాన్స్ లో కేన్స్ ఫిలిం ఫెస్టివల్ లో ప్రదర్శితమై దక్కించుకుంది. తాజాగా 'బాలన్ ది బాయ్' మూవీ హిందీ ట్రైలర్ ను హీరో అజయ్ హీరో సూర్య, తెలుగు ట్రైలర్ ను హీరో నాగ చైతన్య, ఈ చిత్రాన్ని దర్శకుడు చిదంబరం తెరకెక్కిస్తున్నారు.

## ఆగస్టు 21న రవితేజ 'ఇరుముడి'



రవితేజ హీరోగా 'మైత్రీ మూవీ మేకర్స్' నిర్మిస్తున్న 'ఇరుముడి'. శివ నిర్వాణ దర్శకుడు భక్తి, కుటుంబ భావోద్వేగాలు, యాక్షన్ అంశాల సమ్మేళనంగా తెరకెక్కుతున్న ఈ చిత్రం అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునేలా ఉండబోతోంది. ఓ అంకిత భావం గల తండ్రి పాత్రలో రవితేజ నటన ప్రేక్షకుల హృదయాలను తాకేలా ఉంటుంది,గ్లింప్స్‌కు వచ్చిన విశేష స్పందనతో ఉత్సాహంతో ఉన్న చిత్రబృందం తాజాగా సినిమా విడుదల తేదీని ప్రకటించింది. వరలక్ష్మి వ్రతం శుభ సందర్భంగా ఆగస్టు 21న ప్రపంచవ్యాప్తంగా వి దుదల చేయనున్నట్లు అనౌన్స్ చేశారు. ప్రస్తుతం హైదరాబాద్లో చిత్రీకరణ శరవేగంగా కొనసాగుతోంది. ప్రధాన తారాగణం పాల్గొంటున్న ఈ షెడ్యూల్లో కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. రవితేజ, శివ నిర్వాణ పూర్తి అంకితభావంతో పని చేస్తూ సినిమాను అద్భుతంగా తీర్చిదిద్దుతున్నారు. ఈ చిత్రంలో రవితేజ సరసన ప్రియ పోషిస్తోంది. సాయికుమార్, అజయ్ ఘోష్, స్వాసిక ముఖ్య పాత్రల్లో కనిపించనున్నారు. నిర్మాతలు నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ భారీ స్థాయిలో నిర్మిస్తున్న ఈ చిత్రానికి జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్నారు. విష్ణు శర్మ సినిమాటో గ్రఫీ, సాహి సురేష్ ప్రొడక్షన్ డిజైన్, ప్రవీణ్ పూడి ఎడిటింగ్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

## గిరిజన విద్యాసంస్థల ఫుడ్ హ్యాండ్లర్లకు ఫోస్టాక్ శిక్షణ



ప్రజాపక్షం/హైదరాబాద్ : ప్రపంచ ఆహార భద్రతా దినోత్సవం, ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా గిరిజన సంక్షేమ, ఏకలవ్య మోడల్ విద్యాసంస్థల ఫుడ్ హ్యాండ్లర్ల కోసం జిహెచ్ఎంసి ఆహార భద్రతా విభాగం ప్రత్యేక 'ఫోస్టాక్' శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించింది. జిహెచ్ఎంసి, తెలంగాణ ఆహార భద్రతా కమిషనర్ ఆదేశాల మేరకు జరిగిన ఈ కార్యక్రమంలో సుమారు 200 మంది సిబ్బంది పాల్గొన్నారు. విద్యార్థులకు సురక్షితమైన, పౌష్టికాహారాన్ని అందించడమే లక్ష్యంగా.. ఆహార పదార్థాలలో కల్తీని గుర్తించడం, వంటశాలల్లో పాటించాల్సిన ప్రాథమిక పరిశుభ్రత, పారిశుద్ధ్య పద్ధతులపై ఈ సందర్భంగా నిపుణులు అవగాహన కల్పించారు.

## ఫిట్ ఇండియా సైక్లింగ్ ర్యాలీకి విశేష స్పందన



ప్రజాపక్షం/హైదరాబాద్: ప్రపంచ సైకిల్ దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో గచ్చిబౌలి స్టేడియంలో ఆదివారం నిర్వహించిన ఫిట్ ఇండియా సండేస్ ఆన్ సైక్లింగ్ కార్యక్రమానికి నగర సైక్లిస్టుల నుంచి విశేష స్పందన లభించింది. తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్ల జెండా ఊపి సైక్లింగ్ ర్యాలీని ప్రారంభించారు. వేలాది మంది యువకులు, క్రీడాకారులు, సైక్లింగ్ ప్రేమికులు పాల్గొని ఫిట్‌నెస్‌పై అవగాహన పెంపొందించే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్ల మాట్లాడుతూ రాష్ట్రంలో ఫిట్ ఇండియా సండేస్ ఆన్ సైక్లింగ్ కార్యక్రమాన్ని విస్తృత స్థాయిలో నిర్వహించడం అభినందనీయమన్నారు. తెలంగాణలో అపారమైన క్రీడా ప్రతిభ ఉందని, క్రీడాకారులను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు ప్రశంసనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు శ్రీధర్ బాబు, వాకిటి శ్రీహరి, రాష్ట్ర ప్రభుత్వ క్రీడల సలహాదారు ఎపి జితేందర్ రెడ్డి, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి, ఎండి డాక్టర్ సోనీ బాలదేవి, తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్ కార్యదర్శి మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు. వారు సైకిళ్లపై ముందుండి ర్యాలీలో పాల్గొని క్రీడాకారులను ఉత్సాహపరిచారు. గచ్చిబౌలి స్టేడియం ప్రాక్టీస్ గ్రౌండ్ ప్రధాన ద్వారం నుంచి ప్రారంభమైన ర్యాలీ ఐఐఐటీ జంక్షన్, గచ్చిబౌలి ఫ్లైఓవర్, పిస్తా హౌస్ జంక్షన్, బిట్స్, కేబుల్ బ్రిడ్జ్, మాదాపూర్, భారతీయ విద్యాభవన్ సెంటర్ రోడ్ బయోడైవర్సిటీ రోడ్ మీదుగా సాగి తిరిగి స్టేడియానికి చేరుకుంది. సైబరాబాద్ పోలీస్ కమిషనర్ రమేష్ రెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ డిప్యూటీ డైరెక్టర్లు, కోచ్‌లు, వివిధ క్రీడా సంఘాల ప్రతినిధులు, సైక్లింగ్ అసోసియేషన్ సభ్యులు, యువ క్రీడాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి సైక్లిస్టుకు తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ తరపున సర్టిఫికెట్లు, జ్ఞాపికలను అందజేశారు.

## తెలంగాణ క్రికెట్‌లో అక్రమాలపై టిసిఎ ఆగ్రహం

### టిజి-20 లీగ్‌కు చట్టబద్ధత లేదు: గురువా రెడ్డి



ప్రజాపక్షం/హైదరాబాద్: తెలంగాణ క్రికెట్‌లో జరుగుతున్న అవకతవకలు, హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సిఎ) పరిపాలనపై తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ (టిసిఎ) తీవ్రస్థాయిలో విరుచుకుపడింది. హెచ్‌సిఎ నిర్వహించతలపెట్టిన టిజి20 లీగ్‌కు చట్టబద్ధత లేదని, బిసిసిఐ నిబంధనలను ఉల్లంఘిస్తూ స్వయంప్రకటిత గవర్నింగ్ కౌన్సిల్ వ్యవహరిస్తోందని టిసిఎ ప్రధాన కార్యదర్శి ధారం గురువారెడ్డి ఆరోపించారు. ఇందిరా పార్క్ ధర్నా చౌక్ వద్ద తెలంగాణ క్రికెట్ హక్కుల కోసం నిర్వహించిన ప్రజా ఉద్యమంలో ఆయన మాట్లాడారు. రూల్28 ప్రకారం గవర్నింగ్ కౌన్సిల్‌ను హెచ్‌సిఎ సర్వసభ్య సమావేశంలో ఎన్నికల ద్వారా ఎంపిక చేయాల్సి ఉంటుందని, రూల్30 ప్రకారం బిసిసిఐ నుంచి లిఖితపూర్వక అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని ఆయన పేర్కొన్నారు. అయితే ఈ నిబంధనలను పాటించకుండా అనుమతులు వచ్చినట్లు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. ఈ నేపథ్యంలో రూల్31 ప్రకారం హెచ్‌సిఎ గుర్తింపు రద్దు కావడంతో పాటు, అందులో పాల్గొనే ఆటగాళ్లు, అధికారులు, సంస్థలపై నిషేధం విధించే అవకాశం ఉందని చెప్పారు. ఈ నిబంధనలు క్రికెటర్లు తిలక్‌వర్మ, మహమ్మద్ సిరాజ్‌లకు కూడా వర్తిస్తాయని వ్యాఖ్యానించారు. తెలంగాణ క్రికెట్‌ను ప్రక్షాళన చేయాల్సిన బాధ్యత టిసిఎ తీసుకుంటుందని, హెచ్‌సిఎలో ఉన్న అవినీతి, అక్రమాలను బయట పెడతామని గురువా రెడ్డి స్పష్టం చేశారు. టిజి20 లీగ్ నిర్వహణ, అనుమతులు, క్లబ్ సభ్యత్వాలు, ఆర్థిక లావాదేవీలు, పెండింగ్ ఫిర్యాదులు, అవినీతి ఆరోపణలపై సమగ్ర విచారణ జరపాలని ప్రభుత్వం, దర్యాప్తు సంస్థలు, సంబంధిత అధికారులను కోరారు. గతంలో నమోదైన ఫిర్యాదులు, ఆడిట్ అంశాలపై సిఐడి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. టిసిఎ కోచైర్మన్, మాజీ ఎమ్మెల్యే ఇ.లక్ష్మి నారాయణ మాట్లాడుతూ తెలంగాణ జిల్లాల క్రికెటర్లకు సమాన అవకాశాలు, పారదర్శక ఎంపిక విధానం, తెలంగాణ క్రికెట్ అభివృద్ధికి ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. 'తెలంగాణ క్రికెట్ హక్కుల కోసం మా పోరాటం కొనసాగుతుంది' అని ఆయన స్పష్టం చేశారు.టిసిఎ ఉపాధ్యక్షుడు డాక్టర్ విజయచంద్రారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోని వేలాది మంది యువ క్రికెటర్ల భవిష్యత్తు ప్రమాదంలో పడిందని, ప్రతిభ ఉన్నా అవకాశాలు దక్కడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మాజీ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ అల్లిపురం వెంకటేశ్వర రెడ్డి మాట్లాడుతూ గుజరాత్, మహారాష్ట్ర వంటి రాష్ట్రాల్లో బహుళ క్రికెట్ అసోసియేషన్లు స్థానిక ప్రతిభను ప్రోత్సహిస్తున్నాయని, తెలంగాణ జిలాల ఆటగాళ్లకు కూడా అలాంటి అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ ధర్నాలో చిత్తరంజన్, యుగంధర్, టి. జయపాల్, రామ్ చల్లా, వరుణ్ రెడ్డి, నరోత్తం రెడ్డి, ఝాన్సీ లక్ష్మి , జి. శ్రీనివాస్, గౌరవ్ శర్మ, శశాంక్, అనూష, వినోద్ తదితర క్రికెటర్లు, క్రీడా ప్రతినిధులు పాల్గొన్నారు.

## యంగ్ తెలంగాణ ఫుట్‌బాల్ లీగ్ ముగింపు..

### తొలి ఛాంపియన్‌గా రీడ్స్ ఎఫ్‌సి



ప్రజాపక్షం/హైదరాబాద్: తెలంగాణలో ఫుట్‌బాల్ క్రీడాభివృద్ధికి కొత్త ఊపునిచ్చే లక్ష్యంతో తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ నిర్వహించిన తొలి యంగ్ తెలంగాణ ఫుట్‌బాల్ లీగ్ విజయవంతంగా ముగిసింది. ఉత్కంఠభరితంగా సాగిన ఫైనల్ పోరులో రీడ్స్ ఎఫ్‌సీ 21 గోల్స్ తేడాతో పెట్రా స్పోర్టస్ అకాడమీని ఓడించి చరిత్రలో తొలి యంగ్ తెలంగాణ ఫుట్‌బాల్ లీగ్ ఛాంపియన్‌గా అవతరించింది. ఎల్‌బి స్టేడియంలో జరిగిన టోర్నమెంట్ చివరి రోజు పోటీలు అభిమానులను అలరించాయి. మొత్తం 17 మ్యాచ్‌లు నిర్వహించగా, సెమీఫైనల్స్ నుంచి ఫైనల్ వరకు జట్లు అద్భుత ప్రతిభ కనబరిచాయి. తొలి సెమీఫైనల్‌లో పెట్రా స్పోర్టస్ అకాడమీ పెనాల్టీ షూటౌట్‌లో ఎల్‌బీ స్టేడియం 'ఎ' జట్టుపై విజయం సాధించి ఫైనల్‌కు చేరుకోగా, మరో సెమీఫైనల్‌లో రీడ్స్ ఎఫ్‌సి 21 తేడాతో జిమ్ఖానా ఎఫ్‌సిని మట్టికరిపించి తుది పోరుకు అర్హత సాధించింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన షబ్బీర్‌అలీ విజేతలకు బహుమతులు అందజేసి అభినందించారు. రాష్ట్రంలో క్రీడల పునరుజ్జీవనానికి తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ చేపడుతున్న కార్యక్రమాలు ప్రశంసనీయమని ఆయన పేర్కొన్నారు.ఈ సందర్భంగా డాక్టర్ సోనీ బాలదేవి మాట్లాడుతూ ఇది కేవలం పైలట్ ఎడిషన్ మాత్రమేనని, భవిష్యత్తులో మరిన్ని వయో విభాగాలు, క్లబ్‌లతో దీర్ఘకాలిక ఫుట్‌బాల్ లీగ్‌లను నిర్వహించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు.

## ఆందోళన ఆపం

(మొదటి పేజీ తరువాయి)

ఉద్యోగ నియామక పరీక్షలలో జరిగినట్లు ఆరోపించబడుతున్న అక్రమాల విషయంలో బాధ్యతను డిమాండ్ చేస్తోంది. ఆదివారం దీప్కే ఛత్రపతి సంభాజీనగర్ జిల్లా ఎంఐడిసి వలుజ్ ప్రాంతంలోని తన నివాసానికి చేరుకోగా, కుటుంబ సభ్యులు ఆయనకు స్వా గతం పలికారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ, కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసే వరకు 'కాక్రోచ్ జనతా పార్టీ' చేపట్టిన ఆందోళన ఆగదని ఆయన అన్నారు. 'మేము (జంతర్ మంతర్ వద్ద) నిర్వహించిన నిరసన విజయవంతమైందని, ఈ ఆందోళన దేశవ్యాప్తంగా సాగుతుందన్నారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసే వరకు మేతాము వెనక్కి తగ్గబోమని ఆయన ఉద్ఘాటించారు. ఈ ఉద్యమాన్ని దేశవ్యాప్తంగా విస్తరించేందుకు తదుపరి కార్యాచరణ ప్రణాళికను రూపొందిస్తామని చెప్పారు. కాగా, దీప్కే నివాసం వద్ద భద్రతను కట్టుదిట్టం చేశారు. ఆయన నివాసం వద్ద భద్రతను పెంచామని, ఇంతకుముందు 11 మంది భద్రతా సిబ్బంది ఉండేవారు, ఇప్పుడు ఆ సంఖ్య 15కి చేరిందని ఎంఐడిసి వలుజ్ పోలీస్ స్టేషన్ అధికారి చెప్పారు. దీప్కే నివాసం వద్ద మోహరించిన సిబ్బంది స్థానిక పోలీస్ స్టేషన్, నగర పోలీస్ ప్రధాన కార్యాలయానికి చెందినవారన్నారు.

## బండ భారం (మొదటి పేజీ తరువాయి)

రూ. 913 నుండి రూ. 942కి పెరిగింది.అదే సమయంలో, 'ప్రధాన మంత్రి ఉజ్వల యోజన' (పిఎంయువై) లబ్ధిదారులు సిలిండర్‌కు రూ. 642 చెల్లిస్తూనే ఉన్నారు. వీరికి ఏడాదికి మొదటి నాలుగు రీఫిల్స్‌పై ఒక్కోదానికి రూ. 300 సబ్సిడీ లభిస్తుంది (గత ఏడాది తొమ్మిది రీఫిల్స్‌కు సబ్సిడీ ఉండేది). తాజా ధరల పెంపుతో కుటుంబాల నెలవారీ ఖర్చులు మరింత పెరిగే అవకాశం ఉంది. మధ్యతరగతి, దిగువ మధ్యతరగతి కుటుంబాలపై ఈ నిర్ణయం అదనపు భారంగా మారనుంది. ఫిబ్రవరి చివరలో పశ్చిమాసియాలో యుద్ధం మొదలైన తర్వాత అంతర్జాతీయ ధరలు పెరగడంతో, దేశీయ ఎల్‌పీజీ సిలిండర్ సరఫరా వ్యయం రూ. 1,600 దాటిందని ప్రభుత్వం ఒక ప్రకటనలో తెలిపింది. ధరలు పెరిగినప్పటికీ, పాకిస్థాన్, నేపాల్, బంగ్లాదేశ్, శ్రీలంక వంటి పొరుగు దేశాలతో పోలిస్తే దేశీయ ఎల్‌పిజి ధరలు తక్కువగానే ఉన్నాయని, అలాగే అమెరికా, ఆస్ట్రేలియా, కెనడా వంటి అభివృద్ధి చెందిన దేశాల ధరలతో పోలిస్తే చాలా తక్కువగా ఉన్నాయని ప్రభుత్వం తెలిపింది. సంక్షోభ సమయంలోనూ 'స్ట్రెయిట్ ఆఫ్ హోర్ముజ్' గుండా ఇంధన రవాణాకు ఎలాంటి అంతరాయం లేకుండా కొనసాగించగలిగిన అతికొద్ది దేశాలలో భారతదేశం ఒకటని, తద్వారా దేశంలో ఎల్‌పిజి లేదా ఇతర పెట్రోలియం ఉత్పత్తుల కొరత లేకుండా చూసుకున్నామని ప్రభుత్వం పేర్కొంది.

## 'ఇండియా' కూటమి (మొదటి పేజీ తరువాయి)

ఇండియా కూటమి చర్చించనుంది. జాతీయ సమస్యలపై మోదీ ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టడానికి ఒక ఉమ్మడి వ్యూహాన్ని రూపొందించాలని చూస్తుంది. కూటమిలోని కొన్ని భాగస్వామ్య పక్షాల మధ్య సంబంధాలు ఉద్రిక్తంగా ఉన్న తరుణంలో ఈ సమావేశం జరుగుతోంది. తమిళనాడులో కాంగ్రెస్ ద్రోహం చేసిందని ఆరోపిస్తూ డిఎంకె ఈ సమావేశానికి గైర్హాజరు కానుండగా, కేరళలో వామపక్షాలు బిజెపితో కుమ్మక్కయ్యాయని కాంగ్రెస్ అగ్ర నాయకులు చేసిన ఆరోపణలపై సిపిఐ(ఎం) అసంతృప్తి వ్యక్తం చేసింది. ఇండియా కూటమి సమావేశంపై సిపిఐ ప్రధాన కార్యదర్శి డి. రాజా స్పందించారు. చాలా కాలం తర్వాత ఇండి కూటమి అధికారిక సమావేశం జరగబోతోందని చెప్పారు. అయితే, దీని ఎజెండా ఏమిటి, సమావేశానికి ఎవరెవరు హాజరవుతారు అనే విషయాలపై స్పష్టత లేదని, కానీ చర్చించాల్సిన అంశాలు మాత్రం చాలా ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. పశ్చిమ బెంగాల్, తమిళనాడులో జరిగిన ఇటీవలి అసెంబ్లీ ఎన్నికలలో టిఎంసి, డిఎంకె అధికారంలో నుంచి వైదొలగిన నేపథ్యంలో ఈ సమావేశం జరుగుతోంది. ముఖ్యంగా ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల తర్వాత, అనేక రాష్ట్రాల్లో మారుతున్న రాజకీయ సమీకరణాల మధ్య, ప్రతిపక్ష పార్టీల మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేసే ప్రయత్నంగా ఈ సమావేశాన్ని భావిస్తున్నారు .
ఈ కూటమికి ఆప్ బహిరంగంగానే దూరంగా ఉండగా, డిఎంకె ఈ సమావేశాన్ని బహిష్కరిస్తున్నట్లు ప్రకటించింది. గతంలో కూడా పార్లమెంటు సమావేశాలకు ముందు 'ఇండియా' కూటమి నాయకత్వం సంప్రదింపుల కోసం సమావేశమైంది. అప్పుడు ప్రతిపక్ష పార్టీలు సభలో సమన్వయం, కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉమ్మడిగా లేవనెత్తాల్సిన అంశాలపై చర్చించాయి.

## ఉరుములు, మెరుపులతో వర్షాలు

(మొదటి పేజీ తరువాయి)

ఆసిఫాబాద్, మంచిర్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, జనగామ, సిద్ధిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్‌మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, నారాయణపేట, జో గులాంబ గద్వాల జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశముందన్నారు. రాష్ట్రంలో ని అన్ని ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కొనసాగే అవకాశం ఉందని, కొన్ని ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన ఈదురుగాలులు వీచే అవకాశముందని తెలిపారు.

**ఉష్ణోగ్రతల్లో పెద్ద మార్పు లేదు**
రాబోయే మూడు రోజుల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతల్లో పెద్దగా మార్పు ఉండదని అధికారులు చెప్పారు. ఆదిలాబాద్, జగిత్యాల, కరీంనగర్, కోమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల జిల్లాల్లో జూన్ 8 వరకు గరిష్ఠ ఉష్ణోగ్రతలు 41 నుంచి 44 డిగ్రీల సెల్సియస్ మధ్య నమోదయ్యే అవకాశం ఉందన్నారు. హైదరాబాద్ సహా రంగారెడ్డి, సంగారెడ్డి, మెదక్, మహబూబ్ నగర్, నల్లగొండ, వికారాబాద్ తదితర జిల్లాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 36 నుంచి 40 డిగ్రీల మధ్య ఉండే అవకాశం ఉందని చెప్పారు. ఈనెల 9వ తేదీ తర్వాత రాష్ట్రంలోని చాలా జిల్లాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 36 డిగ్రీల కంటే తక్కువకు పడిపోయే అవకాశం ఉందన్నారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com